
'సోమశిల'కు 7,504 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో




అనంతసాగరం, (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి 7,504 క్యూసెక్కుల ప్రవాహం వస్తున్నట్లు అధికారులు తెలిపారు. డ్యాం పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా 72.710 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దిగువ డెల్టాకు 2,550, కండలేరుకు 1,250, ఉత్తర కాలువకు 600, దక్షిణ కాలువ 150 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

జిల్లా సర్వతోముఖాభివృద్ధికి దిశానిర్దేశం

రెండు రోజులపాటు అమరావతిలో జరిగిన జిల్లా కలెక్టర్ల సదస్సులో నెల్లూరు జిల్లా సర్వతోముఖాభివృద్ధికి చేపట్టనున్న చర్యలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కీలక నిర్ణయాలు తీసుకోవడంతోపాటు ఆదేశాలు జారీ చేశారు. జిల్లావాసులకు నైట్ ల్యాండింగ్ సౌకర్యంతో విమానాశ్రయం మొదలు పల్లె ప్రాంతాలకు అన్న క్యాంటీన్ల విస్తరణ వరకు పలు అభివృద్ధి పనుల పూర్తికి కాలపరిమితిని నిర్దేశిస్తూ కలెక్టర్ ఆనంద్‌కు దిశానిర్దేశం చేశారు. అనుకున్న విధంగా ఈ అభివృద్ధి పనులన్నీ పూర్తి అయితే నెల్లూరు జిల్లా కొత్త శోభ సంతరించుకోనుంది.

- నెల్లూరు, (ఆంధ్రజ్యోతి)



రెండు రోజుల సదస్సులో సీఎం చంద్రబాబు కీలక ఆదేశాలు



- పరుగులు పెట్టనున్న దగదర్తి విమానాశ్రయ పనులు
- రోడ్ల బాగు కోసం బృహత్తర ప్రణాళిక
- భూ ఆక్రమణదారులపై ఉక్కుపాదం
- విద్యాసంస్థల్లోనూ 'ఈగల్' నిఘా
- పరిశ్రమల స్థాపన కోసం ప్రత్యేక ప్రణాళిక
- పల్లెలకూ విస్తరించనున్న అన్న క్యాంటీన్లు

జిల్లా ప్రజలకు విమానాశ్రయ సౌకర్యం కొద్దిరోజుల్లోనే కలగనుంది. దగదర్తి వద్ద చేపట్టనున్న ఈ పనులను శరవేగంగా పూర్తి చేసేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు సీఎం చంద్రబాబు ప్రకటించారు. రాత్రి పూట కూడా విమానాలు దగడానికి వీలుగా (నైట్ ల్యాండింగ్) విమానాశ్రయం రూపుదిద్దుకోనుంది. విమానాశ్రయానికి సంబంధించి జిల్లా స్థాయిలో చేపట్టాల్సిన పనులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సీఎం కలెక్టర్‌ను ఆదేశించారు.

- గత వైసీపీ ప్రభుత్వంలో జిల్లా రోడ్లు దారుణంగా దెబ్బతిన్న విషయం తెలిసిందే. ఆ ఐదేళ్ల కాలంలో రోడ్లమీద ఏర్పడిన గోతులకు తట్టెడు మన్నేసిన పాపాన పోలేదు. ప్రజలకు ప్రయాణం నరకతుల్యమైంది. ప్రమాదాల సంఖ్య పెరిగిపోయింది. కూటమి ప్రభుత్వం ఈ రోడ్ల బాగు కోసం నడుం బిగించింది. రెండేళ్ల కాల పరిమితిలో జిల్లా పరిధిలోని అన్ని రహదారులను బాగుచేయాలని ముఖ్యమంత్రి నిర్ణయించుకున్నారు. ఇందుకు అవసరమైన ప్రతిపాదనలు, తీసుకోవాల్సిన చర్యలపై కలెక్టర్‌ను ఆదేశించారు.
- జిల్లాలో భూ కబ్జాల నివారణకు, భూ వివాదాలను త్వరితగతిన పరిష్కరించడానికి జిల్లాస్థాయిలో టాస్క్‌ఫోర్సు కమిటీలను ఏర్పాటు చేయనున్నారు. జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఆర్డీఓ, ఎస్పీ, డీఎస్పీలు ఈ కమిటీల్లో సభ్యులుగా ఉంటారు.
- స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని ఉద్యమంలా చేపట్టనున్నారు. నెలలో ప్రతి మూడవ శనివారం ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. పారిశుద్ధ్య కార్మికులతోపాటు అధికారులు, ప్రజలు, స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యాన్ని తీసుకుంటారు.
- ఉచిత ఇసుక విధానం ద్వారా ప్రజల మన్ననలు పొందిన కూటమి ప్రభుత్వం ఇసుక ధర భారాన్ని మరింత తగ్గించాలని నిర్ణయించుకుంది. ఇళ్ల నిర్మాణదారులకు పూర్తిగా ఇసుక అందజేయడంతోపాటు ప్రస్తుతం ఉన్న రవాణా చార్జీలను కూడా మరింత తగ్గించాలని నిర్ణయించుకున్నారు.
- గత ప్రభుత్వంలో సంక్షేమ హాస్టళ్లు దయనీయ స్థితికి చేరుకున్నాయి. కనీస సౌకర్యాలు కూడా కరువయ్యాయి. ప్రత్యేకించి బీసీ హాస్టళ్లు మరింత దుర్భర పరిస్థితిని అనుభవించాయి. బీసీ హాస్టళ్లకు పూర్వవైభవం తెచ్చే దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఈ మేరకు హాస్టళ్ల నిర్వహణకు భారీగా నిధులు సమకూర్చనున్నారు. భోజన వసతి మెరుగుపరచడంతోపాటు హాస్టళ్లలో మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట వేయనున్నారు.



- పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం నుంచి సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు అందించే భోజన వసతిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా!? రుచిగా, శుభ్రంగా వండిపడ్డిస్తున్నారా!? అనే అంశాలను తెలుసుకోవడానికి ప్రతి వారం విద్యార్థుల నుంచి అభిప్రాయ సేకరణ చేయనున్నారు. ఇందుకోసం ప్రత్యేక యంత్రాంగాన్ని ఏర్పాటు చేయనున్నారు.
- పట్టణాలకు మాత్రమే పరిమితమైన అన్న క్యాంటీన్లు త్వరలో పల్లెలకూ విస్తరించనున్నాయి. కేవలం ఐదు రూపాయలకే టిఫిన్, భోజనం అందించే ఈ మానవీయ కార్యక్రమానికి ప్రజల విశేష స్పందన లభిస్తోంది. ఈ పథకాన్ని గ్రామీణ ప్రాంతాలకూ విస్తరించాలని నిర్ణయించుకున్నారు. మండల కేంద్రాలు, మేజర్ పంచాయతీల్లో వచ్చే ఏడాది మార్చి ఆరంభానికల్లా క్యాంటీన్లను ఏర్పాటు చేయనున్నారు.
- జిల్లాలో పెద్ద ఎత్తున పరిశ్రమల స్థాపన, తద్వారా ఉపాధి కల్పన దిశగా కూటమి ప్రభుత్వం సన్నద్ధం అవుతోంది. కృష్ణపట్నం, రామాయపట్నం పోర్టుల పరిధిలో పెద్ద ఎత్తున అనుబంధ పరిశ్రమల స్థాపన దిశగా జిల్లా యంత్రాంగాన్ని సమాయత్తం చేస్తోంది. ప్రస్తుతం ఉమ్మడి నెల్లూరు జిల్లా పరిధిలో రూ.2500 కోట్లతో 13వేల ఎకరాల్లో క్రిష్ సిటీ (కృష్ణపట్నం ఇండస్ట్రియల్ సిటీ) పనులు మొదలయ్యాయి. కృష్ణపట్నం పోర్టుతోపాటు అటు చెన్నై పోర్టుకు దగ్గరగా ఉండే విధంగా కోట, చిల్లకూరు మండలాల పరిధిలోని కొత్తపట్నం, తమ్మినపట్నం గ్రామాల్లో క్రిష్ సిటీ రూపుదిద్దుకోనుంది. సుదీర్ఘమైన సముద్ర తీరం ఉన్న ఉమ్మడి జిల్లాలో తీరానికి దగ్గరగా ఉన్న మండలాల పరిధిలో పలు పరిశ్రమల ఏర్పాటుకు కృషి జరుగుతోంది. యువతకు ఉపాధి కల్పన కోసం జిల్లాలో నైపుణ్య

- మిగతా 6లో..



భర్త మృతదేహం వద్ద విలపిస్తున్న మౌనిక, పక్కన పిల్లలు

ఆత్మహత్యకు ముందు వినోద్ తన చావుకు గల కారణాలను వివరిస్తూ ఓ సెల్ఫీ వీడియో తీశాడు. 'భూ సేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టరు పద్మావతి వేధింపుల వల్ల తాను విసిగిపోయాను ఫ్రెండ్స్. ఇక నేను బతకటం కూడా దండగ ఎవరూ బాధపడవద్దు. వైసీపీ ప్రభుత్వంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టరు పరిహారం చెల్లింపులో నాకు తీవ్ర అన్యాయం చేసింది. దీంతో ఎన్నికల ముందు టీడీపీలో చేరి ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు విజయానికి కృషి చేసినా ఆయన కూడా ఆ స్పెషల్ డిప్యూటీ కలెక్టరుకే సపోర్టుగా మాట్లాడారు. ఇక విధిలేక ఆత్మహత్య చేసుకుంటున్నా.' అంటూ ఆవేదన వ్యక్తం చేశారు.

విసిగిపోయి.. చనిపోతున్నా!

అధికారుల తీరును నిరసిస్తూ ఓ రైతు బలవన్మరణం




ఉరి వేసుకునే ముందు సెల్ఫీ వీడియోలో మాట్లాడుతున్న రైతు వినోద్

- రామాయపట్నం పోర్టు అనుబంధ పరిశ్రమల భూ పరిహారం చెల్లింపులో అన్యాయం
- సందేశాన్ని సెల్ఫీ వీడియో తీసి ఉరేసుకుని ఆత్మహత్య
- డిప్యూటీ కలెక్టరు వేధింపులతోనేనంటూ ఆరోపణ
- చేవూరులో విషాదం
- సబ్‌కలెక్టర్, ఎమ్మెల్యే ఇంటూరి పరామర్శ.. కుటుంబానికి న్యాయం చేస్తామని హామీ

గుడ్లూరు/కందుకూరు, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): రామాయపట్నం పోర్టు అనుబంధ పరిశ్రమల భూసేకరణ ఓ అన్నదాత ప్రాణం బలి తీసుకుంది. భూ సేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టరు పద్మావతి పరిహారం చెల్లింపులో తనకు అన్యాయం చేస్తూ వేధింపులకు గురిచేస్తోందని ఆరోపిస్తూ గుడ్లూరు మండలం చేవూరు గ్రామానికి చెందిన నక్కల వినోద్‌కుమార్ (40) అనే రైతు బలవన్మరణానికి పాల్పడ్డాడు. కావలిలోని తన నివాసంలో శుక్రవారం తెల్లవారుజామున ఆయన ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఉరికి అంతా సిద్ధం చేసుకుని ఒక సెల్ఫీ వీడియోలో తన ఆత్మహత్యకు గల కారణాన్ని వివరించి అనంతరం తనువు చాలించాడు. చేవూరుకు చెందిన వినోద్ కుమార్‌కు భార్య మౌనిక, కుమార్తె లాస్య (10) 6వ తరగతి, కుమారుడు (6) ఎల్‌కేజీ చదువుతున్నారు. పిల్లల చదువు కోసం కొంతకాలంగా కావలిలో కాపురం ఉంటున్నారు. వినోద్‌కు చేవూరులో 9.6 ఎకరాల భూమి ఉండగా రామాయపట్నం పోర్టు కోసం మొత్తాన్ని సేకరించారు. అయితే, ఇందులో 7 ఎకరాలకు నష్టపరిహారం చెల్లించారు. మిగిలిన 2.6 ఎకరాలకు పరిహారం చెల్లించాల్సి ఉంది. ప్రభుత్వ లెక్కల ప్రకారం రూ.60 లక్షల పరిహారం అందాల్సి ఉంది. నిబంధనల ప్రకారం అయితే సుమారు రూ.80 లక్షలు ఇవ్వాల్సి ఉంటుంది. నిబంధనల ప్రకారమే తనకు పరిహారం చెల్లించాలని కావలి భూ సేకరణ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా అధికారులు పట్టించుకోలేదని మృతుడి కుటుంబ సభ్యులు తెలిపారు. ఇటీవల 40 సెంట్లకు పరిహారం తన ఖాతాలో జమ అయినా వినోద్ వెనక్కి ఇచ్చేశాడు. అధికారుల తీరుపై విసిగి వేశారిన వినోద్ శుక్రవారం తెల్లవారుజాము 3.30 గంటల ప్రాంతంలో తన ఇంట్లోని కొక్కానికి ఉరి వేసుకుని మృతి చెందాడు.

గ్రామస్థుల ఆగ్రహం


శుక్రవారం ఉదయాన్నే కుటుంబసభ్యులు వినోద్‌కుమార్ మృతదేహాన్ని చేవూరుకు తరలించగా, పెద్దసంఖ్యలో గ్రామస్థులు అక్కడకు చేరుకుని అధికారుల తీరుపట్ల తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టరు పద్మావతి వ్యవహార శైలిపై ముక్తకంఠంతో నిరసన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు వచ్చి వినోద్‌కుమార్ కుటుంబానికి న్యాయం చేయడంతోపాటు భూసేకరణ ప్రక్రియ తీరు మారుస్తామని స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.



వినోద్‌కుమార్ నివాసం వద్ద చేవూరు గ్రామస్థులు

సబ్‌కలెక్టర్, ఎమ్మెల్యే పరామర్శ

కందుకూరు సబ్ కలెక్టరు శ్రీపూజ చేవూరుకు చేరుకుని మృతుడి భార్య వినోద్‌కుమార్ సతీమణి మౌనిక, ఇతర కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ఆత్మహత్యకు గల కారణాలపై ఆరా తీశారు. వినోద్ కుటుంబాన్ని ఆదుకోవాలని, భార్యకు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వడంతోపాటు ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని, మృతుడి పిల్లల బాధ్యతను ప్రభుత్వం తీసుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. పరిస్థితులను ఉన్నతాధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా కృషి చేస్తానని సబ్ కలెక్టరు వారికి హామీ ఇచ్చారు. అనంతరం కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు కూడా చేవూరులో వినోద్ మృతదేహానికి నివాళులర్పించి కుటుంబసభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా వ్యక్తిగతంగా రూ.50 వేల ఆర్థికసహాయం అందించారు. ఈ ఘటనపై కావలి టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి, విచారిస్తున్నట్లు గుడ్లూరు సర్కిల్ సీఐ మంగారావు, ఎస్‌ఐ వెంకట్రావు తెలిపారు.



మాట్లాడుతున్న సబ్ కలెక్టరు శ్రీపూజ, వినోద్ మృతదేహం వద్ద ఎమ్మెల్యే ఇంటూరి

న్యాయం జరిగేలా చూస్తా!

పరిహారం చెల్లింపులో అన్యాయం జరుగుతోందని వినోద్ నా దగ్గరకు వచ్చి చెప్పారు. న్యాయం జరిగేలా చూస్తాను. నువ్వేమీ తొందరపడవద్దని చెప్పి పంపించా. ఆ తర్వాత అధికారులతో కూడా మాట్లాడాను. కానీ ఇంత కఠిన నిర్ణయం తీసుకుంటాడనుకోలేదు. వినోద్‌కుమార్ పిల్లలను ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా ఉన్నత చదువులు చదివించే బాధ్యతను నేను తీసుకుంటాను. ఆయన భార్య మౌనికకు ప్రభుత్వ ఉద్యోగం వచ్చేలా చూస్తాను.

- ఇంటూరి నాగేశ్వరరావు, కందుకూరు ఎమ్మెల్యే

భూ సేకరణ... లోపభూయిష్టం

రైతుల మొరను ఆలకించని యంత్రాంగం

కందుకూరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి):రామాయపట్నం పోర్టు అనుబంధంగా పరిశ్రమల స్థాపన కోసం ఏపీ మారిటైమ్ బోర్డు చేపట్టిన భూసేకరణ ప్రక్రియ అంతా లోపభూయిష్టంగా ఉందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. భూసేకరణ గ్రామాలలో ఒకటైన చేవూరుకు చెందిన రైతు నక్కల వినోద్‌కుమార్ ఆత్మహత్యతో భూసేకరణ ప్రక్రియ సర్వత్రా చర్చనీయాంశమైంది.

కందుకూరు నియోజకవర్గ పరిధిలో ఉన్న చేవూరు, రావూరు, ఏలూరుపాడు గ్రామాలతోపాటు కావలి నియోజకవర్గ పరిధిలోని రుద్రకోట, చెన్నాయపాలెం, మద్దూరుపాడు తదితర గ్రామాల పరిధిలో 9వేల ఎకరాలను రైతుల నుంచి సేకరించాలని గత వైసీపీ ప్రభుత్వం నిర్ణయించి ఆయా గ్రామాలలో భూ క్రయవిక్రయాలను నిలిపివేసింది. కనీసం గ్రామసభలు, ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించకుండానే భూసేకరణ నోటిఫికేషన్ ఇచ్చేసింది. అయితే తమ డిమాండ్లను పరిగణలోకి తీసుకోకుండా బలవంతపు భూసేకరణను అనుమతించేది లేదని ఆందోళన చెలరేగటంతో అప్పట్లో ఆయా గ్రామాలలో గ్రామసభలు పెట్టారు. ఈ గ్రామసభల్లో తాము పరిశ్రమలకు భూములు ఇచ్చేందుకు సిద్ధంగా లేమని రైతులు ముక్తకంఠంతో చెప్పినా అవేమీ పట్టించుకోకుండా అధికారు లు బలవంతపు భూసేకరణకు తెరతీశారు. అప్పటి అధికార పార్టీ నాయకులను అడ్డం పెట్టుకుని డబ్బు అత్యవసరం ఉన్న రైతుల ను మభ్యపెట్టి భూసేకరణ ప్రారంభించిన అధికారులు నేటికీ నిర్విరామంగా అదేవిధానం అమలు చేస్తున్నారు. ప్రభుత్వం మారినా భూసేకరణ అధికారులు వారే కొనసాగుతుండటంతో నేటికీ అదేపరంపర కొనసాగుతోంది. దీంతో పది రోజులుగా భూసేకరణ ప్రక్రియ తీరును నిరసిస్తూ తాను ఆత్మహత్య చేసుకుంటానని హెచ్చరిస్తూ వచ్చిన వినోద్‌కుమార్ శుక్రవారం తెల్లవారుజామున అన్నంతపని చేశాడు.

భూసేకరణ ప్రక్రియ అన్యాయం

మృతుడు వినోద్‌కుమార్ స్వగ్రామమైన చేవూరు గ్రామ రెవెన్యూ పరిధిలో 7వేల ఎకరాలకుపైనే భూమి ఉంది. ఇందులో అటవీభూములు, చెరువులు, డొంకలు, కుంటలు, ప్రభుత్వ భూములుపోను 3వేల ఎకరాలకుపైగా రైతుల స్వాధీనంలో పట్టా, అసైన్‌మెంటు భూములు ఉన్నాయి. రిజిస్ట్రేషన్ శాఖ ధరల ప్రకారం మెట్ట, మాగాణి భూములు ఎకరం రూ.7.7 లక్షలు, పండ్ల తోటలు రూ.11 లక్షలు, జాతీయ రహదారి పక్కన రూ.18.7 లక్షలు, ఇళ్ల స్థలాలు రూ.31.95 లక్షలు, నివాసస్థలాలకు అనువైన భూముల ధర ఎకరం రూ.15.4 లక్షలు ఉంది. వాస్తవంగా మార్కెట్ ధర చూస్తే జాతీయ రహదారి సమీపంలో ఎకరం రూ.కోటిన్నరకుపైగా పలుకుతుండగా మిగిలిన భూములు కూడా ఎకరం రూ.50 లక్షలకు తక్కువ లేదు. క్రయవిక్రయాలకు అనుమతిస్తే ఆ మేరకు కొనుగోలుదారులు సిద్ధంగా ఉన్నారు. అయితే గ్రామస్థులు పరిశ్రమల ఏర్పాటు, ఈ ప్రాంత అభివృద్ధికి తాము సహకరిస్తామని భూసేకరణ చట్టం ప్రకారం తమ భూములు సేకరించుకోవాలని మొదటి నుంచీ డిమాండ్ చేస్తున్నారు. 2013 భూసేక రణ చట్టం ప్రకారం రిజిస్ట్రేషన్

- మిగతా 6లో..

సాగునీటి సంఘాలకు నేడు ఎన్నికలు

486 డబ్ల్యూఏలకు పాలకవర్గాల ఎన్నిక

పోలింగ్ విధుల్లో 3926 మంది సిబ్బంది

ఏకగ్రీవాలకు అధికార పార్టీ నేతల ప్రయత్నాలు

వ్యవసాయ రంగంలో కీలకమైన సాగునీటి సంఘాలకు ఎన్నికలు శనివారం జరగనున్నాయి. పదేళ్ల తర్వాత జరుగుతున్న ఎన్నికలు కావడంతో గ్రామాల్లో సందడి నెలకొంది. జిల్లాలో మొత్తం 486 సాగునీటి సంఘా(డబ్ల్యూఏ)లకు ఎన్నిక జరగనుంది. ఇందుకు సంబంధించి 3649 మంది ప్రాదేశిక నియోజకవర్గాల (టీసీ) సభ్యులను ఎన్నుకుంటారు. ఒక్కో డబ్ల్యూఏ పరిధిలో సరాసరి 10 మంది టీసీలు ఉన్నారు. వీరిని ఆయా పరిధిలోని ఆయకట్టు రైతులు ఎన్నుకుంటారు. వీరంతా కలిసి ఆ పరిధిలోని డబ్ల్యూఏ ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్‌ను ఎన్నుకుంటారు. మొత్తం 486 మంది ప్రెసిడెంట్లు, మరో 486 మంది వైస్ ప్రెసిడెంట్లకు ఎన్నిక జరగనుంది.

నెల్లూరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో నెల్లూరు సిటీ మినహాయించి మిగిలిన 37 మండలాల్లోనూ సాగునీటి సంఘాల ఎన్నికలు జరగనున్నాయి. తొలుత ఒక్కో టీసీ సభ్యుడి ఎన్నిక జరుగుతుంది. తొలుత రైతులంతా ఏకగ్రీవంగా ఎన్నుకునేందుకు అవకాశం కల్పిస్తారు. అది కుదరకపోతే ఆయకట్టు రైతులందరితో చేతులు ఎత్తి ఓటు వేసే విధానాన్ని నిర్వహిస్తారు. ఇది కూడా సాధ్యపడని పక్షంలో బ్యాలెట్ పేపర్ పద్ధతిలో ఎన్నిక జరుగుతుంది. టీసీ సభ్యులు, ప్రెసిడెంట్లు, వైస్ ప్రెసిడెంట్లుగా పోటీ చేసేందుకు ఆసక్తి ఉన్న వారి దగ్గర నుంచి నామినేషన్లు, స్ర్కూటినీ ప్రక్రియ మొత్తం శనివారమే జరుగుతుంది. కాగా ఈ సాగునీటి సంఘాల ఎన్నికల విధుల్లో 3926 మంది సిబ్బంది పాల్గొంటు న్నారు. ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు జిల్లా అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. సమస్యాత్మకం అనుకున్న చోట పోలీసు బందోబస్తు కూడా ఏర్పాటు చేస్తున్నారు. వీలైనంత వరకూ డబ్ల్యూఏ ప్రెసిడెంట్లు, వైస్ ప్రెసిడెంట్లను ఏకగ్రీవంగా ఎన్నుకునే విధంగా ప్రయత్నాలు

- మిగతా 6లో..



ముత్తుకూరు : ఎన్నికల సామగ్రిని తీసుకెళుతున్న అధికారులు

నేటి నుంచి ఇంధన పొదుపు వారోత్సవాలు

నెల్లూరు (జడ్పీ), డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఇంధన పొదుపు వారోత్సవాలను శనివారం నుంచి ఈ నెల 20వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు విద్యుత్ శాఖ ఎస్ఈ వీ విజయన్ తెలిపారు. ఈ ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. నెల్లూరులోని విద్యుత్ భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాబోయే కాలంలో విద్యుత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఇంధన పొదుపు చర్యల ఆవశ్యకతపై ప్రజలకు అవగాహన కల్పించనున్నామని చెప్పారు. విద్యుత్ వినియోగదారులు విద్యుత్ పొదుపు చర్యలను పాటించడం ద్వారా పరోక్షంగా ఎక్కువ విద్యుత్ పారిశ్రామిక, వ్యవసాయ రంగాలకు అందుబాటులో ఉండి తద్వారా ఉత్పత్తి పెరిగి రాష్ట్రం త్వరితగతిన అభివృద్ధి చెందుతుందన్నారు. విద్యుత్ ఆదా ఎలా చేయాలి, తీసుకోవాల్సిన చర్యలను వారోత్సవాల్లో వివరిస్తారని తెలిపారు. విద్యార్థులు, ఉద్యోగులతో విద్యుత్ భవన్ నుంచి కస్తూర్బా కళాపరిషత్ వరకు ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు ఇందన పొదుపుపై పెయింటింగ్, వ్యాసరచన పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశంలో విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు

నెల్లూరు(క్రైం)/పొదలకూరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ రాజేంద్రకుమార్ ఆదేశాల మేరకు విజిలెన్స్, మండల వ్యవసాయ అధికారులు శుక్రవారం జిల్లావ్యాప్తంగా ఎరువులు, పురుగుల మందుల దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. నెల్లూరులోని సాయిలక్ష్మి ఫెర్టిలైజర్స్, శ్రీకామాక్షి రైతు డిపో, శ్రీవెంకట పద్మావతి రైతు డిపో, దగదర్తి మండలం వెలుపోడులోని శ్రీకామాక్షితాయి ఫెర్టిలైజర్స్ దుకాణాల్లో అధికారులు తనిఖీ చేశారు. రూ.58,54,290 విలువ చేసే 324.96 మెట్రిక్ టన్నుల ఎరువులు, రూ.9,76,120 విలువ చేసే 851 లీటర్ల పురుగు మందులను స్వాధీనం చేసుకున్నారు. నాలుగు దుకాణాలపై 6(ఏ) సెక్షన్ కింద కేసులు నమోదు చేశారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్లు కే నరసింహరావు, ఏ శ్రీహరిరావు. డీసీటీవో విష్ణురావు, వ్యవశాయశాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే పొదలకూరులో విజిలెన్స్ సీఐ ఏ.శ్రీహరిరావు, విజిలెన్స్ తహసీల్దారు జీఎస్.కృష్ణప్రసాద్, అసిస్టెంట్ జియాలజిస్టు సీహెచ్.వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ శ్రీలక్ష్మి వెంకటేశ్వర రైతు డిపోలో 47.850 మెట్రిక్ టన్నుల ఫెర్టిలైజర్స్‌ని సీజ్ చేశామని, వీటి విలువ రూ.5,32,750 ఉంటుందని తెలిపారు. ఇదే షాపులో రూ.1,62,500 విలువ చేసే సేల్స్‌ను నిలిపి వేశామన్నారు. అలాగే సాయిబాబా ఏజెన్సీ నుంచి 201.515 మెట్రిక్ టన్నుల ఫెర్టిలైజర్‌లను సీజ్ చేశామని, వీటి విలువ రూ.42,94,845 ఉంటుందని తెలిపారు.



పొదలకూరు: దుకాణంలో తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ అధికారులు

నిమ్మ ధర ఢమాల్!

రోజు రోజుకు పెరుగుతున్న చలి తీవ్రత, వర్షాల వల్ల నిమ్మకాయల వినియోగం తగ్గి రైతులకు గిట్టుబాటు ధర దక్కడం లేదు. ఈ ఏడాది జనవరి నుంచి 11 నెలల పాటు బస్తా (లూజు) రూ.2వేలకు తగ్గకుండా గోల్డెన్ ఇయర్‌గా రికార్డు సాధించే క్రమంలో వాతావరణంలో జరుగుతున్న మార్పుల కారణంగా మూడు రోజుల నుంచి ధర తగ్గుముఖం పట్టింది. ఈనెల ప్రారంభం లోనూ రూ.2500 నుంచి రూ.3వేల వరకు పలికిన ధర ప్రస్తుతం రూ.1200 నుంచి రూ.1500కు మించడం లేదు. ఈ ధర కూడా నాణ్యత కలిగిన నిమ్మకాయ లకే వర్తిస్తోంది. కిలోల వంతునైతే రూ.15 నుంచి రూ.20 మాత్రమే ధర పలుకుతోంది. అయితే వర్షా కాలంలో ప్రస్తుతం ఉన్న ధర తక్కువ కాదంటు న్నారు వ్యాపారులు. బీజాపూర్ కాయలు ఎక్కువ కావడం, ఇక్కడ మంచు ప్రభావంతో కాయల్లో నాణ్యత లోపించడంతో గిట్టుబాటు ధర లభించడం లేదని తెలుస్తోంది. సంక్రాంతి వరకు ఇవే ధరలు ఉండవచ్చని పలువురు అభిప్రాయపడుతున్నారు.

- పొదలకూరు,(ఆంధ్రజ్యోతి)



వైభవంగా కృత్తికా దీపోత్సవం

జొన్నవాడ మల్లికార్జునస్వామి, కామాక్షితాయి ఆలయంలో శుక్రవారం కృత్తికా నక్షత్రం సందర్భంగా కృత్తికా దీపోత్సవం (అఖండ జ్యోతి) వైభవంగా జరిగింది. స్వామివారికి ఉదయం, సాయంత్రం మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అమ్మవారికి శ్రీచక్ర నవావరణ పూజలు నిర్వహించారు. అనంతరం రాత్రి ఆలయ ముఖ మండపంపై అఖండ జ్యోతి వెలిగించారు. ఉదయం అమ్మవారి పులకాపు కార్యక్రమానికి భవానమ్మ, రాత్రి అఖండ జ్యోతి కార్యక్రమానికి ధరణీకృష్ణ, సుధారాణి, శబరీశంకర్ పద్మావతి ఉభయకర్తలుగా వ్యవహరించారు. భక్తులు తరలివచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

- బుచ్చిరెడ్డిపాళెం, (ఆంధ్రజ్యోతి)



భక్తిశ్రద్ధలతో హనుమద్వ్రతం

నెల్లూరు (సాంస్కృతికం), డిసెం బరు 13 (ఆంధ్రజ్యోతి) : హను మద్వ్రతాన్ని జిల్లాలో శుక్రవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. నెల్లూరులోని రామాలయాలు, ఆంజనేయస్వామి ఆలయాల్లో విశేష పూజలు జరిగాయి. శబరి శ్రీరామ క్షేత్రంలో ఉదయం విశేష అభిషేకాలు, హనుమద్వ్ర తం, లక్ష నాగవల్లీ దళార్చన, హోమం నిర్వహించారు. సాయంత్రం రామకోటి పుస్తకాలకు ప్రత్యేక పూజలు చేసి మంగళ వాయిద్యాలు, వేదమంత్రాలతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం శ్రీరామ స్తూపంలో వాటిని నిక్షిప్తం చేశారు. సంతపేట ఆంజనేయ స్వామి ఆలయం, పప్పులవీధి ప్రసన్న ఆంజనేయ స్వామి ఆలయం, మహాత్మాగాంధీ నగర్ శ్రీకృష్ణ మందిరం అభిషేకాలు, విశేష పూజలు జరిగాయి.



శ్రీరామ స్తూపంలో రామకోటి పుస్తకాలు నిక్షిప్తం చేస్తున్న నిర్వాహకులు

PRATHIBHA

కొయ్య కళ.. భళా!

- ఉదయగిరి నుంచి అంతర్జాతీయ మార్కెట్‌కు ఎగుమతి
- చెక్కనగిషీ శిక్షణతో ఎందరికో జీవనోపాధి
- సీఎం నుంచి ప్రధాని వరకు ప్రశంసల వెల్లువ

రాచరిక సామ్రాజ్య కేంద్రంగా విరాజిల్లిన ఉదయగిరిలో ఆ ప్రాభవం ఇప్పుడు కనిపించక పోయినా హస్తకళా వైభవానికి కొదవలేదు. కొయ్యపై చెక్కిన కళాత్మక వస్తువులు ఖండాంత రాలకు ఎగుమతి అవుతున్నాయి. దేశీయంగానే కాకుండా ప్రపంచ ప్రఖ్యాతిని సొంతం చేసుకొంటు న్నాయి. ప్రముఖ ఆన్‌లైన్ స్టోర్స్‌లోనూ కళాత్మక వస్తువుల విక్రయాలకు చోటు దక్కించుకోవడమే కాదు.. ముఖ్యమంత్రి నుంచి ప్రధానమంత్రి వరకు ప్రశంసలు అందుకుంటున్నాయి.

- ఉదయగిరి (ఆంధ్ర జ్యోతి)



తయారైన బొమ్మలకు సాన పడుతూ..



ఢిల్లీలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ



కొయ్య కళకు ప్రాణం పోసిన అబ్దుల్‌బషీర్

పూర్వీకుల నుంచి చెక్కబొమ్మల తయారీని నేర్చుకున్న షేక్ అబ్దుల్ బషీర్ తన 18వ సంవత్సరం నుంచే ఈ వృత్తిలోకి ప్రవేశించి వివిధ రకాల వస్తువులను తయారు చేయడం ప్రారంభించారు. దీనిపై ఇతరులు పెద్దగా ఆసక్తి చూపకపోవడంతో తన ఇద్దరు కుమార్తెలు గౌషియా బేగం, ఫాయిదాలకు నేర్పించారు. 2003లో 15 మంది సభ్యులతో సంఘంగా ఏర్పడి చైతన్యజ్యోతి వెల్ఫేర్ సొసైటీ ద్వారా ఉడెన్ కట్లరీ ఉత్పత్తి కేంద్రాన్ని ప్రారంభించారు. దీనికి హ్యాండ్‌క్రాఫ్ట్ మినిస్టర్స్ ఆఫ్ టెక్స్‌టైల్స్ ఆర్థికసాయం అందించారు. ఏడాదిన్నర క్రితం అబ్దుల్ బషీర్ మరణానంతరం ఆయన పెద్దకుమార్తె గౌసియాబేగం ఆ కేంద్రం బాధ్యతలు అందుకున్నారు.

200 రకాల వస్తువుల తయారీ

ఉదయగిరి దుర్గం కొండపై లభించే జల్లనద్ది, లద్ది, కలువ, దేవదారు తదితర అటవీ కర్రను ఉపయోగించి ఈ వస్తువులను తయారు చేస్తారు. ఈ కొయ్య ద్వారా స్పూన్లు, దువ్వెనలు, ఫోర్కులు, అట్లకర్ర, గరిటెలు, డైనింగ్ టేబుల్స్, ఫొటోఫ్రేమ్స్, పిల్లల ఆట వస్తువులు, వంటకు ఉపయోగించే ట్రేలు, చిన్న గిన్నెలు, ప్లేట్లు, తదితరవి సుమారు 200 రకాల వస్తువులు ఈ కేంద్రంలో తయారు చేస్తున్నారు.

అంతర్జాతీయ మార్కెట్‌కు

ఉదయగిరిలో తయారవుతున్న చెక్కనగిషీ వస్తువులకు విదేశీయం గా మంచి గిరాకీ ఉంది. గౌసియాబేగం కేంద్రం బాధ్యతలు చేపట్టాక తనతోపాటు కుమారుడు జాకీర్‌హుస్సేన్‌ను భాగస్వామ్యం చేశారు. ఇది మహిళలకు నైపుణ్యంలో మరింత శిక్షణ ఇప్పించేందుకు దోహదపడింది. మొదట్లో 15 మందితో ప్రారంభమైన ఈ కేంద్రంలో ఇప్పుడు 500 మంది పని చేస్తున్నారు. ఇప్పటికే వీరు ఆన్‌లైన్ వేదికగా ఫ్లిప్‌కార్ట్, ఐటోక్రీ, బెటర్ ఇండియా, త్రివేజీ, ఓఎన్‌డీసీల ద్వారా విక్రయాలు చేస్తుండగా మరింత ప్రోత్సహించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఓపెన్ నెట్‌వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్‌లోనూ పేరు నమోదు చేసుకున్నారు. తద్వారా అంతర్జాతీయ మార్కెట్‌లో విక్రయించుకునే అవకాశం ఏర్పడింది. అరకు కాఫీ పొడికి ఉదయగిరి చెక్కనగిషీ కేంద్రంలో తయారయ్యే స్పూన్ ఎంపిక య్యింది. ఇప్పటికే ఏడాదికి రూ.80 లక్షల నుంచి 90 లక్షల వరకు టర్నోవర్ జరుగుతుండగా, విక్రయాలు మరింత పెరిగితే అధికమంది మహిళలకు ఉపాధి కల్పించే అవకాశం కలుగుతుంది.



గవర్నర్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న గౌసియాబేగం

200 కుటుంబాలకు జీవనోపాధి

చెక్కనగిషీ వస్తువుల తయారీ కేంద్రంలో 200 కుటుంబాలు జీవనోపాధి పొందుతున్నారు. వందేళ్లకు పూర్వం ఒకట్రెండు కుటుంబాలు ఈ కళారంగాన్ని నమ్ముకుని జీవనాన్ని సాగించాయి. ఉదయగిరి హస్తకళల కేంద్రంలో తయారు చేసిన వివిధ రకాల వస్తువులకు రాష్ట్రంలోని కాకుండా ఉత్తరాది రాష్ట్రాల్లో కూడా మంచి గుర్తింపు ఉంది. 2020, ఫిబ్రవరిలో ఢిల్లీలో జరిగిన చేతివృత్తుల ఎగ్జిబి షన్‌లో ఉదయగిరి కళాకారులు చేసిన స్టాల్‌ను ప్రధానమంత్రి నరేంద్రమోదీతోపాటు పలువురు ప్రముఖులు సందర్శించి ప్రశంసలు అందించారు.

ప్రసంశల జల్లు

ఈ కళకు ఊపిరిపోసిన అబ్దుల్‌రషీద్‌కు లేపాక్షి, హస్తకళల అభివృద్ధి సంస్థ హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ప్రశంసా పత్రంతోపాటు బహుమతులు అందజేశారు. ఆయన కుమార్తె గౌసియాబేగం ప్రతిభను గుర్తించి ఇదే సంస్థ వివిధ బహుమతులు అందజేసింది. అలాగే వైఎస్‌ఆర్ అచీవ్‌మెంట్ అవార్డు సైతం సొంతం చేసుకుంది. మైనారిటీ కార్పొరేషన్ ద్వారా యంత్రాల కోసం రూ.10 లక్షల నిధులు కూడా మంజూరు చేసింది. ప్రస్తుతం కేంద్రం నిర్వహిస్తున్న భవనం శిథిలావస్థకు చేరిం దని, ప్రభుత్వం స్పందించి నూతన భవనం మంజూరు చేయాలని నిర్వాహకులు కోరుతున్నారు.



కొయ్యతో బొమ్మలను తయారు చేస్తున్న మహిళలు



వసతులు కల్పిస్తే

చెక్కనగిషీ కేంద్రం పూర్తి శిథిలావస్థకు చేరింది. వర్షానికి ఊరుస్తూ కూలే దశలో ఉంది. గత ప్రభుత్వం రూ.10 లక్షలు మంజూరు చేసినా అరకొరగానే వస్తువులు కొనుగోలు చేశారు. ప్రభుత్వం స్పందించి నూతన కేంద్రాన్ని మంజూరు చేయడంతోపాటు ఆధునిక యంత్రాలు మంజూరు చేసి మౌలిక వసతులు కల్పిస్తే పలువురికి ఉపాధి కల్పించడంతోపాటు ఉదయగిరి చెక్కనగిషీ కేంద్రం ఖ్యాతిని నలుదిశలా చాటుతాం.

- షేక్ అప్సర



శిక్షణతో ఉపాధి

గత కొన్నేళ్లుగా చెక్కనగిషీ వస్తువుల తయారీలో మహిళలకు శిక్షణ ఇస్తున్నాం. శిక్షణతోపాటు వారికి ఉపాధి కూడా చూపుతున్నాం. ఇప్పటికే 500 మందికి శిక్షణ ఇచ్చాం. కేంద్రంలో 200 రకాల వస్తువులు తయారు చేస్తున్నారు. ఈ కేంద్రం వల్ల 200 కుటుంబాలు జీవనోపాధి పొందుతున్నాయి. కేంద్రానికి మౌలిక వసతులు కల్పిస్తే మరింత మందికి శిక్షణ ఇచ్చి వారికి ఆర్థిక భరోసా కల్పిస్తాం.

- షేక్ గౌసియాబేగం, కేంద్రం నిర్వాహకులు



ఉపాధి పొందుతున్నాం

చెక్కనగిషీ వస్తువుల తయారీలో శిక్షణ తీసుకుని ఉపాధి పొందుతున్నాం. డిజైనర్లు కొత్త వస్తువుల తయారీలో శిక్షణ ఇచ్చారు. స్థానికంగానే ఉంటూ వస్తువుల తయారు చేసి ఎంతోకొంత సంపాదిస్తూ కుటుంబ పోషణలో భాగమవుతున్నాం. ప్రభుత్వం చేయూత ఇస్తే మరిన్ని డిజైన్లతో వస్తువులు తయారు చేస్తాం.

- షేక్ అలీయా

17న నుడా చైర్మన్‌గా కోటంరెడ్డి ప్రమాణస్వీకారం

నెల్లూరు (వైద్యం), డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి ఈ నెల 17వ తేదీన నుడా చైర్మన్‌గా ప్రమాణస్వీకారం చేయనున్నట్లు మాజీ కార్పొరేటర్, టీడీపీ అధికార ప్రతినిధి ఉచ్చి భువనేశ్వరీ ప్రసాద్ ఓ ప్రకటనలో తెలియ చేశారు. వేదాయపాళెంలో ఉన్న నుడా కార్యాలయంలో ఉదయం 10 గంటలకు ఈ ప్రమాణ స్వీకారం జరుగుతుందన్నారు. నర్తకి సెంటర్ నుంచి కోటంరెడ్డికి మద్దతుగా భారీ బైక్ ర్యాలీ జరుగుతుందని అందరూ పాల్గొనాలని కోరారు.

జిల్లా సర్వతోముఖాభివృద్ధికి దిశానిర్దేశం

(5వ పేజీ తరువాయి)

గణన జరుగుతోంది. దీన్ని వేగంగా పూర్తి చేయాలని సీఎం చంద్రబాబు కలెక్టర్‌ను ఆదేశించారు. ఈ గణన ఆధారంగా జిల్లాలో ఎలాంటి పరిశ్రమల స్థాపన జరిగితే ఎక్కువ మందికి ఉపాధి లభిస్తుందో ఆ పరిశ్రమలను ప్రోత్సహించనున్నారు.

● గత ఐదేళ్ల ప్రభుత్వంలో మాదకద్రవ్యాల చెలామణి విస్తృత స్థాయికి చేరుకుంది. గంజాయి, ఇతర మత్తు పదార్థాలు విద్యాసంస్థల్లోకి చొరబడ్డాయి. విద్యార్థుల జీవితాలతో ఆడుకునే స్థాయికి చేరుకున్నాయి. వీటిని అరికట్టడం కోసం జిల్లా పరిధిలోని ప్రతి కళాశాల, పాఠశాలల్లో 'ఈగల్' కమిటీలు ఏర్పాటు చేయనున్నారు. అధ్యాపకులు, విద్యార్థులు, పరిసర ప్రాంతాల్లో నివశించే ప్రజలు ఈ కమిటీలో సభ్యులుగా ఉంటారు. వీరందరి పేర్లు గోప్యంగా ఉంచుతారు. ఈ బృందం విద్యాసంస్థల్లోకి మాదకద్రవ్యాల రాకను గమనించి ఆ విషయాన్ని జిల్లా ఉన్నతాధికారులకు చేరవేస్తుంది.

పోలీసు క్రీడలు వాయిదా

నెల్లూరు(క్రైం), డిసెంబరు 13 (ఆంధ్ర జ్యోతి) : జిల్లా పోలీస్ స్పోర్ట్ అండ్ గేమ్స్ మీట్ మళ్లీ వాయిదా పడింది. శుక్రవారం నుంచి పోలీసు క్రీడల నిర్వహణకు ఆ శాఖ అన్నీ ఏర్పాట్లు చేసింది. అయితే వర్షాల కారణంగా ఒకరోజు తర్వాత శనివారం నుంచి నిర్వహిస్తామని ప్రక టించింది. అయితే నీటి సంఘాల ఎన్నికల నేపథ్యంలో బందోబస్తుకు సిబ్బంది కొరత ఏర్పడు తున్న కారణంగా స్పోర్ట్ మీట్ ను మరోసారి వాయిదా వేశారు. తదుపరి తేదీలను త్వరలో ప్రకటించే అవకాశం ఉంది.

ఎట్టకేలకు మూడు అడుగులు లేచిన కాలువ తూము గేటు

- రాళ్లపాడు కుడి కాలువలోకి 80 క్యూసెక్కుల నీటి ప్రవాహం
- మరమ్మతు పనులను పర్యవేక్షించిన ఎమ్మెల్యేలు ఇంటూరి, కాకర్ల



మరమ్మతు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యేలు ఇంటూరి నాగేశ్వరరావు, కాకర్ల సురేష్

లింగసముద్రం, డిసెంబరు 13 (ఆంధ్ర జ్యోతి): వారంరోజులుగా మొరాయించిన రాళ్లపాడు కాలువ తూము గేటు పనుల్లో కొంత పురోగతి కనిపించింది. శుక్రవారం ఉదయం మెకానిక్ నిపుణులు షేక్ షమీంబాషా, వైజాగ్ స్కూబా డైవర్లు సంయుక్తంగా ఈ పనులను చేపట్టారు. దెబ్బతిన్న గేటు కింద ప్లేట్లు పెట్టి ఇనుప పుల్లీలతో సిబ్బంది, కొందరు రైతులు గేటును పైకి లాగడంతో మూడు అంగుళాల మేర గేటు పైకి వచ్చింది. దీంతో తూము నుండి కాలువలోకి నీరు ప్రవహించింది. అయితే శనివారం ఈ గేటును మరో ఐదారు అంగుళాల మేర పైకి లాగి కనీసం 150 క్యూసెక్కుల నీటిని ఇచ్చేందుకు ప్రయత్నిస్తామని డీఈఈ ఎం.వెంకటేశ్వర్లు తెలిపారు. నీటి విడుదల కావడంతో అక్కడకు పెద్ద ఎత్తున చేరుకున్న రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

పనులు పర్యవేక్షించిన ఎమ్మెల్యేలు

కాలువ తూము గేటు కొద్దిగా పైకి లేచిందని తెలియడంతో కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మధ్యాహ్నం 3గంటలకు చేరుకొని పనులను పర్యవేక్షించారు. ఎమ్మెల్యే నాగేశ్వరరావు గంగమ్మ తల్లికి చీర సారె సమర్పించి, కొబ్బరికాయ కొట్టి ప్రత్యే పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రాజెక్టు అధికారులు, మెకానిక్ బాషా, స్కూబా డైవర్లకు, సిబ్బందికి సహకరించిన రైతులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సోపంల్లి మనోహర్, మద్దెల రామారావు, అడపా రంగయ్య, గాలంకి ప్రసాద్, జంపాల శివప్రసాద్ పాల్గొన్నారు.

భూ సేకరణ... లోపభూయిష్టం

(5వ పేజీ తరువాయి)

శాఖ నిర్ణయించిన ధరకు 4 రెట్లు పరిహారంగా ఇవ్వాలని, ఆ ధరలు 2015లో నిర్ధారించినవి కనుక తాజా ధరలు నిర్ధాంచి పరిహారం ఇవ్వాలని కోరుతున్నారు. అయితే ఇవేమీ పట్టించుకోకుండా అన్ని భూములకు ఎకరానికి 23.2 లక్షల పరిహారం ఇచ్చేసి భూములు లాగేసుకుంటున్న దుస్థితి నెలకొంది. అలాగే భూములన్నీ తీసేసుకుని గ్రామాన్ని వదిలేస్తే వ్యవసాయం, పశుపోషణ, వ్యవసాయ కూలీలుగా జీవిస్తున్న తాము ఎలా బతకాలని ఆయా గ్రామాల ప్రజలు వేస్తున్న ప్రశ్నలకు అధికారుల వద్ద సమాధానం లేదు. గ్రామాలకు చుట్టూ కనీసం 300 మీటర్ల మేర భూసేకరణ చేయకుండా వదిలేయాలని మిగిలిన భూములను భూసేకరణ చట్టం ప్రకారం తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఆందోళనలు చేస్తున్నా అధికారులు పట్టించుకోకుండా బలవంతంగా భూసేకరణ చేసేస్తున్నారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు ఆందోళనలు చేస్తుండటమే గాక అధికారుల చుట్టూ తిరిగి తమకు న్యాయం చేయాలని మొరపెట్టుకుంటున్నారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం, అధికారులు ప్రజాభిప్రాయం తీసుకుని అందుకనుగుణంగా చర్యలు చేపట్టకుంటే ఈ గ్రామాలలో మరిన్ని అఘాయిత్యాలు జరిగే పరిస్థితులు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

సాగునీటి సంఘాలకు నేడు ఎన్నికలు

(5వ పేజీ తరువాయి)

జరుగుతున్నాయి. కాలువల నిర్వహణ, రైతాంగం సమస్యలను పరిష్కరించ డంలో సాగునీటి సంఘాలు కీలకంగా వ్యవహరిస్తాయి. అయితే చాలా కాలం నుంచి ఎన్నికలు లేకపోవడంతో అధికారులే ఇన్‌చార్జ్‌లుగా వ్యవహరి స్తూ వస్తు న్నారు. ఇప్పుడు సాగునీటి వ్యవస్థను మరింత బలోపేతం చేసే అవకాశం రావ డంతో గ్రామాల్లో రైతుల మధ్య వివాదాలు తలెత్తకుండా ఉండేలా అధికార పార్టీ నేతలు ఏకగ్రీవాలకు ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే కొన్ని చోట్ల మాత్రం పోటీ జరిగే అవకాశాలున్నట్లు తెలుస్తోంది.

జైళ్ల డీజీపీపై కేసు నమోదు చేయాలి

నెల్లూరు (సాంస్కృతికం), డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : రాజమండ్రి సెంట్రల్ జైలులో ఎస్‌టీపీ ఖైదీతో జైళ్ల శాఖ డీజీపీ రవికిరణ్ తన ఇంటిలో పనులు చేయించుకుంటున్నారని, రెండు మూడు రోజుల క్రితం ఆ ఖైదీని చావగొట్టారని ఆంధ్రప్రదేశ్ ఖైదీ కుటుంబ సంక్షేమ సమితి నాయకురాలు సీహెచ్ కవిత ఆరోపించారు. శుక్రవారం సమితి సభ్యులతో కలిసి ఆమె నెల్లూరులో విలేకరులతో మాట్లాడారు. ఇలాంటి సంఘటనలు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జైళ్లలో జరుగుతున్నాయని తెలిపారు. నెల్లూరు జైలులో ఓ ఖైదీని కూడా చితకబాదారని, దీనిపై బాధితులమైన తాము సీబీసీఐడీకి వాంగ్మూలం ఇచ్చి ఉన్నామన్నారు. డీజీపీ రవికిరణ్‌పై క్రిమినల్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కేసులు పెట్టకుండా అతనిని బదిలీ చేస్తే ఆందోళనకు దిగుతామన్నారు.

విద్యుత్ విజిలెన్స్ అధికారుల దాడులు

- 114 మందిపై కేసులు నమోదు
- రూ.4.60లక్షల అపరాధ రుసుం విధింపు

వలేటివారిపాలెం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. కందుకూరు డివిజన్ పరిధిలోని విద్యుత్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అధికారులు, అసిస్టెంట్ ఇంజనీర్ అధికారులు, విద్యుత్ సిబ్బంది 32 బృందాలుగా విడిపోయి అన్నిగ్రామాల్లోని విద్యుత్ చౌర్యంపై ఆరా తీశారు. ఆపరేషన్ ఎగ్జిక్యూటవ్ ఇంజనీరు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో మీటర్లు లేకుండా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న 4గురుని, అలాగే అదనపు విద్యుత్ లోడ్ వినియోగిస్తున్న 105మందిని గుర్తించినట్లు తెలిపారు. 114మందిపై కేసులు నమోదు చేసి వాళ్లకు రూ.4.60వేల అపరాధ రుసుం విధించినట్లు నాగేశ్వరరావు తెలిపారు.



మాట్లాడుతున్న విద్యుత్ విజిలెన్స్ అధికారులు

డిగ్రీ పరీక్షల్లో ఇద్దరు డీబార్

వెంకటాచలం, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): విక్రమ సింహపురి యూనివర్శిటీ పరిధిలోని అనుబంధ డిగ్రీ కళాశాలలో శుక్రవారం మధ్యాహ్నం జరిగిన డిగ్రీ మొదటి సెమిస్టర్ పరీక్ష లలో ఇద్దరు విద్యార్థులు డీబార్ అయినట్లు వీఎస్‌యూ పరీక్షల నిర్వాహణాధికారిణి డాక్టర్ అర్ మధుమతి తెలిపారు. ఈ పరీక్షలకు 3,156 మంది విద్యార్థులకు 2,630 మంది హాజరు కాగా 526 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. కాగా నెల్లూరులోని కృష్ణచైతన్య డిగ్రీ కళాశాలలో ఒకరు, శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో ఒకరు డీబార్ అయినట్లు ఆమె పేర్కొన్నారు.

సంగంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో శుక్రవారం హనుమత్ వ్రతం నిర్వహించారు. ఈసందర్భంగా స్వామివారికి లక్ష తమల పాకులతో పూజలు, అభిషేకాలు, కుంకుమార్చన చేశారు. అనంతరం హనుమత్ పారాయణం నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

- సంగం (ఆంధ్రజ్యోతి)



ఆంజనేయునికి ప్రత్యేక పూజలు

ఆదమరిస్తే అంతే...

సోమశిల జలాశయం స్లూయిజ్ కాలువలో కొందరు ప్రాణా లు తెగించి చేపలవేట సాగించడం ఆందోళన కలిగి స్తోంది. శుక్రవారం ఒక గిరిజన కుటుంబం తన ఇద్దరు చంటి బిడ్డలతో నీటి అంచున నిలబడి గాలాలతో చేపలు పడుతూ కనిపించారు. ఇది నిషేధిత ప్రాంతం. గతంలో ఎన్నో ప్రమాదాలు జరిగాయి.

- అనంతసాగరం. (ఆంధ్రజ్యోతి)



మోటారుసైకిల్ అదుపుతప్పి పడి యువకుడి మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ రంగనాథ్‌గౌడ్

కోవూరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామన్నపాళెం రైల్వే గేటు సమీపంలో చెన్నై-కోల్‌కత్తా జాతీయ రహదారిపై శుక్రవారం మోటారుసైకిల్ అదుపుతప్పి పడి ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు... కొడవలూరు మండల పరిధిలోని టపాతోపుకు చెందిన పుల్లా కృష్ణకిషోర్ నెల్లూరు నగరంలో వంట సామగ్రి కొనుగోలు చేసేందుకు మోటారు బైక్‌పై బయలుదేరాడు. రామన్నపాళెం గేటు సమీపంలో మోటారుసైకిల్ అదుపుతప్పి పడ్డాడు. దీంతో తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్‌ఐ రంగనాథ్‌గౌడ్ ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బస్సును ఢీకొన్న లారీ : ఇద్దరికి స్వల్పగాయాలు

మనుబోలు, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): మనుబోలు పోలీస్‌స్టేషన్ సమీపంలో జాతీయ రహదారిపై శుక్రవారం టూరిస్టు బస్సును లారీ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. వివరాల మేరకు.. మదనపల్లికి చెందిన 30మంది ముస్లింలు టూరిస్టు బస్సులో వచ్చి నెల్లూరు దర్గాను దర్శించుకుని తిరుగు ప్రయాణంలో మనుబోలు వద్ద ముందు వెళుతున్న లారీని అధిగమించి హఠాత్తుగా లారీ ముందుకు వెళ్లి బస్సు బ్రేక్ వేయడంతో వేగాన్ని అదుపుచేయలేక లారీ బస్సును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లారీ ముందుభాగం నుజ్జునుజ్జు అయింది. క్యాబిన్‌లో ఉన్న సూపర్‌వైజర్ దేవాకు, బస్సులో వెనుక కూర్చుని ఉన్న అబ్దుల్‌కు స్వల్పగాయాలయ్యాయి. ఈ ప్రమాదంతో స్తంభించిన ట్రాఫిక్‌ను పోలీసులు పునరుద్ధరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

భార్య ఆత్మహత్య కేసులో భర్త అరెస్ట్

వెంకటాచలం, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని కసుపూరులో ఏడాది కిందట భార్య ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన కేసులో ఆమె భర్తను గురువారం రాత్రి పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం మేరకు.. కసుపూరు పంచాయతీ జ్యోతినగర్‌కు చెందిన ఎనగలూరు నరేష్‌కు కలువాయికి చెందిన ఆదిలక్ష్మి(28)తో వివాహం జరిగింది. కొంతకాలం తరువాత భార్యాభర్తల నడుమ మనస్పర్థలు ఏర్పడ్డాయి. దీంతో ఏడాది కిందట ఆదిలక్ష్మి ఇంట్లోనే ఉరి వేసుకొని మృతి చెందింది. అప్పట్లో పోలీసులు అనుమానాస్పదం కింద కేసు నమోదు చేశారు. కానీ మృతురాలి తల్లిదండ్రులు మాత్రం తమ కుమార్తె మృతికి కారణం ఆమె భర్తేనని, భర్త కారణంగానే ఉరివేసుకొని చనిపోయిందని, తమ కుమార్తె మృతిపై అనుమానం ఉందని, అతని వ్యవహార శైలి కూడా అనుమానం కలిగిస్తుందని ఇటీవల మృతురాలి తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు క్షేత్రస్థాయిలో విచారించి నరేష్‌ను అరెస్ట్ చేసి శుక్రవారం కోర్టుకు హాజరుపరిచినట్లు సీఐ సుబ్బారావు తెలిపారు.

ఉరి వేసుకుని వృద్ధురాలి ఆత్మహత్య

బుచ్చిరెడ్డిపాళెం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ పరి ధిలోని కృష్ణా థియేటర్ సమీపంలో నివాసముంటున్న నక్కా సుగుణమ్మ(60) శుక్రవారం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన బంధువులు ఆమెను చికిత్స నిమిత్తం హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.

పోలీసుల అదుపులో టిప్పర్లు, ఎక్స్‌కవేటర్



పోలీస్‌స్టేషనులో ఉన్న టిప్పర్లు

అల్లూరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బట్రకాగొల్లులో అక్రమంగా గ్రావెల్‌ను తరలించేందుకు వెళుతున్న మూడు టిప్పర్లు, ఎక్స్‌కవేటర్‌లను శుక్రవారం ఎస్‌ఐ కిషోర్ బాబు దాడులు చేసి అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషనుకు తరలించారు. ఎలాంటి అనుమతులు లేకుండా గ్రావెల్ తవ్వకాలకు ప్రయత్నించారని మైనింగ్ అనుమతులకు పంపామని అనుమతులు వస్తే యజమానులకు అప్పగిస్తామని ఆయన తెలిపారు.

జర్నలిస్టులపై దాడులకు నిరసన

నెల్లూరు (సాంస్కృతికం), డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : పులివెందుల నియోజకవర్గం వేమలాల మండలంలో సాగునీటి సంఘాల ఎన్నికల కవరేజీకి వెళ్లిన జర్నలిస్టులపై మూకుమ్మడి దాడిని ఏపీయూడబ్ల్యూజే నాయకులు తీవ్రంగా ఖండించారు. శుక్రవారం సాయంత్రం గాంధీబొమ్మ వద్ద కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి ధర్నా చేశారు. నిందితులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి ఏ జయప్రకాష్, జిల్లా అధ్యక్షుడు వీ వెంకటేశ్వర్లు, టీ రమేష్‌బాబు, కార్యదర్శి మస్తాన్‌రెడ్డి, సామ్నా జిల్లా కార్యదర్శి హనోక్ పాల్గొన్నారు.

రేపు చలో గుంటూరు

నెల్లూరు (సాంస్కృతికం), డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మాలల మహాగర్జన ఈనెల 15న గుంటూరులోని నల్లపాడులో జరుగుతుందని, ఈ నేపథ్యంలో జిల్లాలోని మాలలు తరలిరావాలని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా భీమ్‌రావు అంబేడ్కర్ నెల్లూరు జిల్లా ఇన్‌చార్జి కేఎస్‌ఆర్ నారాయణ పిలుపునిచ్చారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరు లతో మాట్లాడారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో తొలగించిన హెల్త్ అసిస్టెంట్లను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. జనవరి 8 నుంచి ప్రతిగడప, ప్రజాక్షేత్రం కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నామన్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	100
లేయర్ లైవ్	105
స్కిన్ చికెన్	188
స్కిన్‌లెస్	208
లేయర్	178

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.7416
వెండి కిలో ధర	రూ. 92,400
వెండి ఒక గ్రాము	రూ.95.40

యువకుడి హత్య కేసు
దర్యాప్తు ముమ్మరం

కలువాయి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలం పల్లకొండకు చెందిన కొల్లూరు గోపి (27) హత్య కేసు దర్యాప్తును పోలీసులు ముమ్మరం చేశారు. శుక్రవారం రాపూరు సీఐ విజయకృష్ణ, ఎస్‌ఐ సుమన్ పల్లకొండ గ్రామానికి చేరుకుని హత్యకు గురైన యువకుడి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను విచారించారు. హతుడి సెల్‌ఫోన్ కాల్‌లిస్ట్‌లో ఉన్న కొందరిని పిలిపించి వివరాలు అడిగి తెలుసుకుంటున్నారు. గ్రామానికి చెందిన పలువురు యువకులను కూడా స్టేషన్‌కు పిలిపించి విచారిస్తున్నారు. ఎముకలు విరిగిన వారికి అవసరమైతే వారి ఊరికి వెళ్లి గోపీ కట్టుకట్టి వస్తుంటాడు. ఈక్రమంలో ఎవరితోనైనా విభేదాలు ఉన్నాయా అనే కోణంలో కూడా విచారిస్తున్నట్లు తెలిసింది.

చెత్త నుంచి
సంపద ఎక్కడ?

- నిరుపయోగంగా షెడ్లు
- వినియోగించేలా ప్రభుత్వ ఆదేశాలు
- మొదలుపెట్టి వదిలేసిన అధికారులు
- కొన్నిచోట్ల అసాంఘిక కార్యకలాపాలు

నెల్లూరు (జడ్పీ), డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో చెత్తసంపద కేంద్రాలకు గ్రహణం వీడటం లేదు. ప్రభుత్వాలు మారినా చెత్త నుంచి సంపద మాత్రం తయారవుతున్న దాఖలాలు కనిపించడం లేదు. గ్రామాల్లో వ్యర్థాల సమస్యను పరిష్కరించడంతోపాటు చెత్తతో సంపద సృష్టించాలన్న బృహత్తర లక్ష్యంతో గత టీడీపీ ప్రభుత్వం చెత్తసంపద కేంద్రాలను ఏర్పాటు చేసింది. జిల్లాలో 722 గ్రామ పంచాయతీలు ఉండగా 517 చెత్త సంపద కేంద్రాలను నిర్మించింది. అయితే వైసీపీ పాలనలో గత ఐదేళ్లు చెత్త సంపద కేంద్రాలు పూర్తిగా నిర్వీర్యమయ్యాయి. గ్రామాల అభివృద్ధిని వైసీపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో చెత్త సంపద కేంద్రాలు అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారాయి.



మనుబోలు మండలం కొండూరులో నిరుపయోగంగా ఉన్న చెత్త సంపద కేంద్రం షెడ్డు

● ఎక్కడి చెత్త అక్కడే

టీడీపీ కూటమి ప్రభుత్వం మళ్లీ ఏర్పడటంతో చెత్త సంపద కేంద్రాలకు మోక్షం కలుగుతుందని ప్రజల్లో ఆశలు చిగురించాయి. ఇందుకు అనుగుణంగానే గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించడంతో పాటు చెత్త సంపద కేంద్రాలన్నింటినీ వినియోగంలోకి తేవాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు యంత్రాంగంతో సమీక్షలు జరిపి ఆదేశాలు కూడా ఇచ్చింది. దీంతో ఐదేళ్లుగా నిరుపయోగంగా ఉన్న చెత్త సంపద కేంద్రాలపై అధికారులు దృష్టి సారించారు. 517 చెత్త సందప కేంద్రాలకుగాను 487 వినియోగానికి సిద్ధంగా ఉండగా మిగతా వాటికి మరమ్మతులు చేసి వినియోగంలోకి తేవాలని కసరత్తు చేశారు. అయితే అది ఆరంభ సూరత్వంగానే మిగిలి పోయింది. చెత్తసందప కేంద్రాలను అధికారులు పట్టించుకోకపోవడంతో గ్రామాల్లో ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోతోంది. పాలకులు, ఉన్నతాధికారు లు స్పందించి చెత్తసంపద కేంద్రాలను పూర్తిగా వినియోగంలోకి తేస్తే గ్రామాలు పరిశుభ్రం కావడమేకాక చెత్తతో విద్యుత్ ఉత్పత్తి చేయడంతో పాటు రైతులకు ఎరువులను తయారు చేసే అవకాశం ఉంటుంది.



బుచ్చి : పెనుబల్లిలో పేకాటకు నిలయంగా మారిన చెత్త సంపద కేంద్రం

మనుబోలు : కల్లేరు వాగు వద్ద చెత్త





ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్డీవో మాజీ చైర్మన్ గుండ్రా సతీష్‌రెడ్డి

గ్రామాల అభివృద్ధిలో
భాగస్వాములు కావాలి

● డీఆర్డీవో మాజీ చైర్మన్ గుండ్రా సతీష్‌రెడ్డి

ఆత్మకూరు, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మాజీ డీఆర్‌డీవో చైర్మన్, భారత రక్షణ మంత్రి సాంకేతిక సలహాదారు గుండ్రా సతీష్‌రెడ్డి సూచించారు. శుక్రవారం ఆత్మకూరు జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ అధినేత కంచి పరమేశ్వరరెడ్డి ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆత్మకూరు జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో ట్రస్ట్ ఏర్పాటుచేసి నిత్యం అన్నదానం చేస్తున్న కంచి పరమేశ్వరరెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అంతేకాకుండా అంత్యక్రియల మట్టి ఖర్చుల కోసం పేద కుటుంబాలకు రూ. 10 వేల చొప్పున సహాయం చేయడం, మృతదేహాలను భద్రపరచుటకు ఫ్రీజర్ బాక్సులు ఏర్పాటు చేయడం, కైలాస రథం ఉచితంగా ఇవ్వడం వంటి సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. అనంతరం సంతీష్‌రెడ్డిని పలువురు సత్కరించారు. ఈ కార్యక్రమంలో సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ అధినేత కంచి పరమేశ్వరరెడ్డి, డాక్టర్ సుధాకర్ రెడ్డి, జిల్లా వైద్యాధికారి డాక్టర్ పెంచలయ్య, అసిస్టెంట్ జిల్లా వైద్యాధికారి ఖలీల్, కుడుముల సుధాకర్‌రెడ్డి, ఎంపీపీ కేత వేణుగోపాల్‌రెడ్డి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి, గుండాల బుజ్జిరెడ్డి, పిడికిటి వెంకటేశ్వర్లు నాయుడు, శైలజ రెడ్డి, కొప్పోల రమాదేవి, సాంబశివ చారిటబుల్ సభ్యులు పాల్గొన్నారు.

భూవిలువ పెంపునకు రికార్డుల పరిశీలన

నెల్లూరు(హరనాథపురం), డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం భూవిలువ పెంపును జనవరి నుంచి అమలులోకి తేవాలని నిర్ణయించటంతో ఇందుకు సంబంధించిన అంచనాల తయారీలో భాగంగా శుక్రవారం జిల్లా రిజిస్ట్రార్ హరివర్మ నెల్లూరు ప్రధాన సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం(ఆర్‌ఓ)లో రికార్డులను పరిశీలించారు. జాయింట్ సబ్ రిజిస్ట్రార్ ఐ విజయరాణిని నెల్లూరు నగరంలో ప్రాంతాల వారీగా ప్రస్తుతమున్న మార్కెట్ విలువల గురించి అడిగి తెలుసుకున్నారు. మున్సిపల్ కార్పొరేషన్ అధికారుల నుంచి అనుమతి పొందిన లేఅవుట్ల వివరాలు తీసుకోవాలని సూచించారు. ఆర్డీవోల నుంచి వ్యవసాయ భూములు ఇళ్ల స్థలాలుగా మార్పు జరిగిన వివరాలు తీసుకోవాలని ఆదేశించారు. అన్నీ వివరాలతో ఒక నివేదిక తయారు చేసి, జాయింట్ కలెక్టర్ నిర్వహించే మార్కెట్ విలువల కమిటీ సమావేశానికి సిద్ధం చేయాలని దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ వాల్యూ సీనియర్ సహాయకుడు చైతన్య తదితరులు పాల్గొన్నారు.



మార్కెట్ విలువలను సబ్ రిజిస్ట్రార్ విజయరాణి, ఎస్ఏ చైతన్యను అడిగి తెలుసుకుంటున్న రిజిస్ట్రార్ హరివర్మ

అనధికారికంగా మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు

- ఎక్సైజ్ ఏసీ దయాసాగర్
- దాడుల్లో 296 మద్యం సీసాలు స్వాధీనం

ఉదయగిరి రూరల్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): అనధికారికంగా మద్యం విక్రయాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ దయాసాగర్ హెచ్చరించారు. శుక్రవారం స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయాన్ని సందర్శించి పలు కేసులపై సిబ్బందితో చర్చించి సంబంధిత రికార్డులు తనిఖీ చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉదయగిరి ఎక్సైజ్ సీఐ, ఎస్‌ఐలతో సిబ్బందితో కలిసి జిల్లా ఎన్స్‌ఫోర్స్‌మెంట్, స్టేట్ టాస్క్‌ఫోర్స్ బృందాలు గురువారం రాత్రి, శుక్రవారం అనధికారికంగా నిర్వహిస్తున్న మద్యం బెల్టు దుకాణాలపై దాడులు నిర్వహించామన్నారు. ఈ దాడుల్లో దుత్తలూరు మండలం నందిపాడు గ్రామంలో 190 మద్యం సీసాలు స్వాధీనం చేసుకొని వెంగయ్య, వేణుగోపాల్, మర్రిపాడు మండలం డీసీపల్లి గ్రామంలో 17 మద్యం సీసాలు స్వాధీనం చేసుకొని సుబ్బారావు, ఉదయగిరి మండలం గుడినరవ గ్రామ సమీపంలో 89 మద్యం సీసాలు స్వాధీనం చేసుకొని పిల్లి మాలకొండయ్యలను అదుపులోకి తీసుకొని కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. మద్యం షాపుల నిర్వాహకులు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. ఒక వ్యక్తికి మూడు మద్యం సీసాల కంటే ఎక్కువ ఇవ్వరాదన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఎస్‌లు జగదీశ్వర్‌రెడ్డి, రమేష్, సీఐ టీ లక్ష్మణస్వామి, ఎస్‌ఐ దీప్తికరంత్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న ఎక్సైజ్ ఏసీ దయాసాగర్

మహిళ మెడలో సరుడు చోరీ

- చోరీకి పాల్పడిన వ్యక్తులను వెంటాడిన డీటీ
- పోలీసుల అదుపులో ఒకరు

ఉదయగిరి రూరల్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని గన్నేపల్లి పంచాయతీలో ఉన్న శ్రీఅడవిపేరంటాలమ్మ ఆలయ సమీపంలో మహిళ మెడలో బంగారు సరుడు చోరీ చేసిన సంఘటన శుక్రవారం చోటుచేసు కొంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. అదే పంచాయతీకి చెందిన కోదారి పద్మావతి అనే మహిళ ఆలయ సమీపంలో తన బంధు వు, తెలంగాణ రాష్ట్రంలో డిప్యూటీ తహసీ ల్దారుగా విధులు నిర్వహిస్తున్న తిరుపతయ్య నూతనంగా ఇంటి నిర్మాణం చేపడుతుండగా అక్కడికెళ్లింది. కొంత సమయం తరువాత అక్కడ నుంచి తిరిగి స్వగ్రామానికి వెళుతుం డగా అప్పటికే కాపు కాసి ఉన్న ముగ్గురు వ్యక్తులు ఆమెను వెంబండించి మెడలో ఉన్న రెండున్నర సవర్ల బంగారు సరుడు లాక్కొని మోటార్‌బైక్‌పై పరారయ్యారు. ఆమె కేకలు విన్న తిరుపతయ్య వెంటనే అతని కారుతో చోరీకి పాల్పడిన వ్యక్తులను వెంబడించాడు. దాసరిపల్లి గ్రామం దాటిన తరువాత మోటార్‌బైక్‌ను రోడ్డుపక్కన పడేసి వారు అడవుల్లోకి పారిపోయారు.

పోలీసుల అదుపులో ఒకరు: అడవుల్లోకి పారిపోయిన ముగ్గురు వ్యక్తుల కోసం ఉదయగిరి సీఐ ఎన్.వెంకట్రావు, ఎస్‌ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డిలు తన సిబ్బందితో ముమ్మర గాలింపు చర్యలు చేపట్టారు. చోరీకి పాల్పడిన వ్యక్తులు అడవుల్లో నుంచి మాసాయిపేట గ్రామ సమీపంలో రోడ్డుపైకి వచ్చారు. ఆ సమయంలో ఉదయగిరి నుంచి హైదరాబాదు వెళుతున్న బస్సెక్కారు. బస్సులో ఉన్న ఓ వ్యక్తి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు గ్రామస్థులకు సమాచారం అందించి హుటాహుటిన గండిపాళెం బయలుదేరారు. గ్రామస్థులు బస్సు గ్రామానికి రాగానే బస్సెక్కి పోలీసులు వస్తున్నారు. అప్పటివరకు బస్సు ఆపాలని చెప్పడంతో ఒక్కసారిగా బస్సులో ముగ్గురు వ్యక్తుల్లో ఇద్దరు కిటికీలో నుంచి దూకి పరారయ్యారు. మిగిలిన ఒకర్ని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. పరారైన ఇద్దరి కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపడుతున్నారు. ఈ విషయమై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వారు తెలిపారు.

పంట కాలువ విషయమై ఘర్షణ

ఒకరికి తీవ్ర గాయాలు

ఏఎస్ పేట, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పంట కాలువ విషయమై జరిగిన ఘర్షణలో ఒకరికి తీవ్ర గాయాలైన సంఘటన శుక్రవారం అనుమసముద్రం గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన ప్రసాద్‌రెడ్డి, సుబ్బారెడ్డి అన్నదమ్ము లు. అన్న సుబ్బారెడ్డి కొడుకులు అశోక్, వివేకాలు పొలం వద్దకు వెళ్లి అక్కడ పొలానికి నీరు పారే పంట కాలువ విషయమై బాబాయి ప్రసాద్‌రెడ్డితో వాదనకు దిగారు. మాటామాటా పెరిగి చలగపారతో ప్రసాద్‌రెడ్డిపై దాడి చేయడంతో తలకు తీవ్ర గామమై కుప్పకూలిపోయాడు. దీంతో ఆయనను చికిత్స నిమిత్తం ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకి తీసుకువెళ్లారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ సైదులు తెలిపారు.

హామీలు నెరవేర్చాలి

● నెల్లూరులో వైసీపీ ర్యాలీ

నెల్లూరు(హరనాథపురం), డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతూ వైసీపీ ఆధ్వర్యంలో శుక్రవారం నెల్లూరులో అన్నదాతకు అండగా ర్యాలీ జరిగింది. ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, వైసీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డితో కలిసి వీఆర్సీ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం వీఆర్సీ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ జరిగింది. అక్కడ జాయింట్ కలెక్టర్ కార్తీక్‌కు నాయకులు వినతిపత్రం అంద చేశారు. ఈ సందర్భంగా కాకాణి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అబద్ధపు హామీలు గుప్పించి అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. రైతన్నలకు అందాల్సిన పెట్టుబడి సాయం ఇంత వరకు అందించకపోవటం రైతులను చంద్రబాబు మరోసారి దగా చేయటమే నన్నారు. ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ తల్లికి వందనం, అక్కచెల్లెమ్మలకు ఆడబిడ్డ నిధి, ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు, ఉద్యోగులకు ఐఆర్, నిరు ద్యోగ భృతి చెల్లించకపోవటం వంటి మోసాలకు కూటమి ప్రభుత్వం పాల్పడిందన్నారు. హామీ లను వెంటనే అమలు చేయాలని, లేకపోతే ప్రజాపోరాటం సాగిస్తామని హెచ్చరిం చారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్, మాజీ ఎమ్మెల్యేలు రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి, కిలివేటి సంజీవయ్య, బుర్రా మధుసూదన్ యాదవ్, మేకపాటి రాజగోపాల్ రెడ్డి, ఆనం విజయకుమార్‌రెడ్డి, ఖలీల్ అహ్మద్ పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న వైసీపీ శ్రేణులు

80 శాతం రాయితీపై
శనగ విత్తనాలు పంపిణీ



వర్షానికి దెబ్బతిన్న శనగ పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

దుత్తలూరు (ఉదయగిరి రూరల్), డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుపాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు దెబ్బతిన్న శనగ పంట రైతులకు 80 శాతం సబ్సిడీతో విత్తనాలు పంపిణీకి ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసినట్లు ఉదయగిరి ఇన్‌చార్జి ఏడీఏ పీ చెన్నారెడ్డి, మండల వ్యవసాయాధికారి వెంకటసుబ్బారెడ్డి తెలిపారు. శుక్రవారం వారు దుత్తలూరులో దెబ్బతిన్న శనగ పంటను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ దుత్తలూరు, వరికుంటపాడు మండలాల్లో మొలకెత్తే దశలో ఉన్న శనగ పంట వర్షాలకు దెబ్బతిందన్నారు. అలాంటి రైతులకు 80 శాతం సబ్సిడీతో విత్తనాలు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. మొలక దశలో పంట దెబ్బతిన్న రైతులకు ఆయా రైతుసేవా కేంద్రాల పరిధిలో గ్రామ వ్యవసాయ సహాయకులు గుర్తించి విత్తనాల పంపిణీకి చర్యలు చేపడతారన్నారు. కావున రైతులు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

సాగునీటి సంఘాల ఏకగ్రీవానికి నేతల కసరత్తు

కావలి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో శనివారం జరగనున్న సాగునీటి సంఘాల ఎన్నికల్లో ఎక్కువ భాగం ఏకగ్రీవం చేసేందుకు ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి నేతలు, రైతులతో చర్చిస్తున్నారు. మొత్తం 74సాగునీటి సంఘాలుండగా అందులో కావలి మండలంలో 20, బోగోలు మండలంలో 17, దగదర్తి మండలంలో 23, అల్లూరు మండలంలో 14 సాగునీటి సంఘాలు ఉన్నాయి. ప్రధాన ప్రతిపక్షం వైసీపీ నాయకులు ఉన్నా చాలా వరకు ఈ ఎన్నికల్లో పోటీ చేసేందుకు వెనుకాడుతున్నారు. కూటమి నేతల్లోనే పోటీ నెలకొంది. కూటమిలోని జనసేన, బీజేపీ నాయకులు శుక్రవారం ముసునూరులోని ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి నివాసానికి వెళ్లి ఈ ఎన్నికల్లో తమ పార్టీ నేతలకు కూడా కొన్నిచోట్ల ప్రాధాన్యత కల్పించాలని కోరారు. రుపు ఎన్నికలు జరుగుతుంటే ఇపుడు పేర్లు ఇస్తే వాటిని రైతులందరితో మాట్లాడి ఎలా సర్దుబాటు చేయాలని ప్రశ్నించారు. అనంతరం పోటీ చేసే అభ్యర్థుల వివరాలు తీసుకున్నారు. కొన్ని సాగునీటి సంఘాలకు టీడీపీలో కూడా ఏకాభిప్రాయం లేక పోవటంతో వారిని పిలిపించుకుని మాట్లాడి సర్దుబాటు చేశారు. దీంతో మొత్తం మీద మెజార్టీ సాగునీటి సంఘాలు ఏకగ్రీవం అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

పంచాయతీల అభివృద్ధికి కృషి చేయాలి



అవగాహన కల్పిస్తున్న పంచాయతీ కార్యదర్శి ప్రదీప్

కొండాపురం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పంచాయతీల అభివృద్ధికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీవో ఆదినారాయణ తెలిపారు. స్థానిక ఆదర్శ పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన శిక్షణలో కార్య దర్శులు, సచివాలయ సిబ్బంది, సర్పంచులు పాల్గొని మాట్లాడారు. ఐక్యరాజ్యసమితి సూచనల మేరకు దేశం పురోగతి సాధించాలంటే పంచాయతీలు కీలకమన్నారు. ఇందులో భాగంగా పంచాయతీలలో ప్రజలకు మౌలికవసతుల కల్పన తదితర విషయాలకు సంబంధించి 9రంగాలలో అభివృద్ధి సాధించేందుకు కార్య దర్శులు, సర్పంచులకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఎంఈవోలు 1,2 రవి కుమార్, ఆనంద రావు, ఈవోపీఆర్‌డీ నారాయణ, ఏపీఎమ్ కాంతా రావు, ఏవో శేషసాయి పాల్గొన్నారు.

●లింగసముద్రం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీల అభివృద్ధి లక్ష్యాలపై రెండోరోజు శిక్షణ తరగతులు కొనసాగించారు. పంచాయతీల అభివృద్ధి, పేదరిక నిర్మూలకు సర్పంచులు చర్యలు తీసుకోవాలని మండలాధికారులు సూచించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సీహెచ్ రాజశేఖర్, పీఆర్ ఏఈ రాజశేఖర్, సీహెచ్‌ఓ శ్రీనివాసులు, ఏపీఎం సింహాద్రి, ఇతర అధికారులు, సర్పంచులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆదరణ కేంద్రానికి మతి స్థిమితం లేని అనాథ మహిళ



మతిస్థిమితం లేని మహిళను
ఆదరణ కేంద్రంలో చేర్పిన మోహన్‌కృష్ణ

బిట్రగుంట, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం ముంగమూరు ఆదరణ కేంద్రంలో శుక్రవారం రాత్రి మతి స్థిమితంలేని అనాథ మహిళను మోహన్ కృష్ణ చేర్చారు. రుద్రకోటకు చెందిన మోహన్‌కృష్ణ వృత్తి రీత్యా ఉపాధ్యాయుడు. తిరుపతి జిల్లాలో పనిచేస్తున్నారు. స్వగ్రామానికి వచ్చిన ఆయనకు రోడ్డుపై తిరుగుతున్న ఆమెను గమనించి ఆటోలో ఆదరణ కేంద్రానికి తీసుకెళ్లి ఆదరణ కేంద్ర నిర్వాహకులు సింహాద్రిరావు, భవానీలకు అప్పగించారు.

చెరువులోకి దిగిన మతిస్థిమితం లేని వృద్ధురాలు

● కాపాడి ఇంటికి పంపిన చెంచుగానిపాలెం దంపతులు

కావలి రూరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మతిస్థిమితం కోల్పోయిన చౌదరిపాలెంకు చెందిన పోతినేని అనసూర్యమ్మ (80) శుక్రవారం దారి తప్పి చెరువులో పడింది. ఆ సమయంలో అటుగా వెళుతున్న చెంచుగానిపాలెం దంపతులు వినయ్, దీపిక దంపతులు ఆమెను చూసి బయటకు తీసుకొచ్చారు. గ్రామంలోని ఇంటికి తీసుకొచ్చి సపర్యలు చేశారు. ఆ వివరాలు ఇలా ఉన్నాయి. వృద్ధురాలు కావలిలో కుమార్తె వద్ద ఉంటుంది. చౌదరిపాలెం వెళ్లేందుకు ఆటోలో వచ్చి చెంచుగానిపాలెం క్రాస్ రోడ్డు వద్ద దిగింది. చౌదరిపాలెం బదులు దారితప్పి చెంచుగానిపాలెం వైపు వెళ్లింది. దాహార్తి తీర్చుకునేందుకు మార్గమధ్యలో ఉన్న చెరువు వద్దకు వెళ్లి జారి పడింది. తడి బట్టలతో వణకుతున్న వృద్ధురాలిని ఇంటికి తీసుకువెళ్లి స్నానాలు చేయించి బట్టలుకట్టి ఆహారం పెట్టి ఆటో లో ఎక్కించి కావలిలోని కుమార్తె వద్దకు పంపారు.

28న కావలిలో జగన్నాథుడి రథయాత్ర



మాట్లాడుతున్న డాక్టర్ సుఖదేవ్ మహరాజ్

కావలి టౌన్, డిసెంబరు 13: జగన్నాథుడి అనుగ్రహ కటాక్షం కోసమే జగన్నాథ రథయాత్ర అని, ఈ నెల 28న పట్టణంలో జగన్నాథ రథయాత్ర నిర్వహించనున్నట్లు నెల్లూరు ఇస్కాన్ మందిర అధ్యక్షుడు డాక్టర్ సుఖదేవ్ మహరాజ్ తెలిపారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఎదురు వీధిలోని ఇస్కాన్ మందిరంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. భక్త జనం వేలాదిగా పాల్గొని పూరీ జగన్నాథుడి కృపకు పాత్రులు కావాలన్నారు. బృందావనం కాలనీ నుంచి ప్రారంభమై ట్రంకు రోడ్డు మీదుగా ఆర్టీసీ గాంధీ బొమ్మసెంటర్ మీదుగా వెంకటేశ్వర, లత థియేటర్ల మీదుగా వాయునంద ప్రెస్‌వీధి జెండాచెట్టు సెంటర్, పెట్రోల్ బంకు వెనుకనున్న కల్యాణ మండపం వరకు ఈ యాత్ర కొనసాగుతుందన్నారు. ఈ సందర్భంగా 10వేల మందికి అన్నదానం చేస్తామన్నారు. సమావేశంలో చంద్రశేఖర్ స్వామి, నల్లూరు రవి, డాక్టర్ మాధవరెడ్డి, రమేష్, గోపీకృష్ణ, మాలకొండారెడ్డి పాల్గొన్నారు.

మజ్దూర్ యూనియన్ నాయకుల సంబరాలు



సంబరాలు చేసుకుంటున్న రైల్వే మజ్దూర్ యూనియన్ సభ్యులు

బిట్రగుంట, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రైల్వే ట్రేడ్ యూనియన్ గుర్తింపు ఎన్నికల్లో మజ్దూర్ యూనియన్ విజయం సాధించడంపై సంఘం బిట్రగుంట బ్రాంచ్ అధ్యక్షుడు మద్దిబోయిన శేఖర్‌యాదవ్ హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక బిట్రగుంట రైల్వే పీడబ్ల్యూ కార్యాలయ ఆవరణలో యూనియన్ విజయంపై సభ్యులతో కలిసి కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో బ్రాంచ్ కార్యదర్శి సీహెచ్ వెంకటేశ్వర్లు, సీనియర్ సెక్షన్ ఇంజనీర్లు (ఎస్ఎస్ఈ) సురేష్, కృష్ణన్, విజయవర్ధన్, జేఈ నాగరాజు, సూరిబాబు, సుభాషిణి, శ్రీహరి, రఘు, క్రాంతి, మధు, వంశీనాయక్, రమేష్ పాల్గొన్నారు.

వర్షాలకు దెబ్బతిన్న పొగాకు, మినుము పంటలు

● పరిహారం చెల్లించాలని రైతుల డిమాండ్



కూనిపాలెంలో పూర్తిగా దెబ్బతిన్న శనగ పంట

వలేటివారిపాలెం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): వరుస తుపాను ప్రభావంతో కురిసిన వర్షాలకు మండలంలోని కూనిపాలెం, పోలినేనిపాలెం, నేకునాంపురం, కళవళ్ల బడేవారిపాలెం పోకూరు వలేటివారిపాలెం, లింగపాలెం గ్రామాల్లోని శనగ, మినుము, పొగాకు పంటలు దెబ్బతిన్నాయి. కూనిపాలెం, కళవళ్ల, నేకునాపురంలో 70 ఎకరాలలో సాగు చేసిన శనగ పంట విత్తనం వేసినప్పటి నుంచి ఎడతెరిపి లేకుండా కురిసిన వానతో పూర్తిగా దెబ్బతింది. మళ్లీ దున్ని చేసి పంట సాగు చేద్దామనుకుంటే పొలాలు తేమ ఆరడం లేదని రైతులు వాపోతున్నారు. ఈలోగా శనగ పంట సాగు అదును దాటిపోతుందని చెబుతున్నారు. పోలినేనిపాలెం, శాకవరం, శింగమనేనిపల్లె, నలదలపూరు, కళవళ్ల కూనిపాలెం గ్రామాల్లో పొగాకు పూర్తిగానూ, వలేటివారిపాలెం, లింగపాలెం, బగారక్కపాలెం, అమ్మపాలెం, జమీన్‌ఉప్పటపాడు గ్రామాల్లో పాక్షికంగాను దెబ్బతింది. నల్లరేగడి నేలల్లో పొగాకు నాట్లు వేసినా ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు పొగాకు నాట్లు కుళ్లిపోయాయి. ఎర్రరేగడి నేలల్లోని ముదురు పొగాకు తోటల్లో బొబ్బ తెగుళ్ల రావడంతో మొక్కలు పీకి వేస్తున్నారు. ముదురు పొగ తోటల్లో క్యూరింగ్ అనంతరం రంగు మారి లోగ్రేడ్ వస్తుందని చెబుతున్నారు. కూనిపాలెం, పోకూరు, బడేవారిపాలెం, కాకుటూరు, నేకునాంపురం గ్రామాల్లో సాగు చేసిన మినుము కాయదశలో ఉండడం వలన వర్షాలకు కొంతమేర దెబ్బతింది. మళ్లీ వర్షం కురిస్తే పొగాకు, శనగ, మినుము పంటలపై ఆశలు వులుకోవాల్సిందే అని చర్చించుకుంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి దెబ్బతిన్న పంటలను పరిశీలించి నష్ట పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

సాగునీటి సంఘాల ఎన్నికలకు సర్వం సిద్ధం



ఉదయగిరి రూరల్: ఎన్నికల సామగ్రి అందజేస్తున్న చంద్రమౌళి

కావలి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల నిర్వహణకు అధికార యంత్రాంగం సిద్ధం అయ్యింది. రెవెన్యూ, జలవనరుల శాఖ అధికారులు సంయుక్తంగా వీటి పర్యవేక్షణ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ప్రతి సాగునీటి సంఘానికి 6 ప్రాదేశికాలు ఉండటంతో ఎన్నికలు అనివార్యమైతే వాటిని నిర్వహించేలా ప్రతి సాగునీటి సంఘానికి ఈవో, ఏఈవో మరో నలుగురు సిబ్బందిని నియమించి వారికి ఎన్ని కల నిర్వహణ మెటీరియల్‌ను అందజేశారు.

●ఉదయగిరి రూరల్ : ఉదయగిరి సబ్ డివిజన్‌లో శనివారం జరగనున్న సాగునీటి సంఘాల ఎన్నికలకు సర్వంసిద్ధం చేసినట్లు నోడల్ అధికారి, జలవనరుల శాఖ డీఈ కె చంద్రమౌళి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో ఎన్నికల సిబ్బందికి పోలింగ్‌కు సంబంధించి సామాగ్రిని పంపిణీ చేశారు. అనంతరం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ సబ్ డివిజన్ పరిధిలోని గండిపాళెం జలాశయం కింద 17 డిస్ట్రిబ్యూటరీలకు, ఉదయగిరి మండలంలో 11 చెరువులకు, సీతారామపురం మండలంలో 6 చెరువులకు సంబంధించి సాగునీటి సంఘాల ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా అన్ని చర్యలు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈలు వేణు, సురేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు : ఆర్డీవో



దుత్తలూరు సదస్సులో అర్జీలను పరిశీలిస్తున్న కావలి ఆర్డీవో

ఉదయగిరి రూరల్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): రైతుల భూ సమస్యల పరిష్కారానికే రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మన్నేటి వెంకటరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని కొండాయపాళెం పంచాయతీ గానుగపెంటపల్లి సచివాలయంలో తహసీల్దారు సుభద్ర ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా పలు సమస్యలపై ప్రజలు, రైతులు అర్జీలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో డీటీ హసీనా, ఆర్‌ఐ సురేంద్ర, వీఆర్వోలు మాలకొండయ్య, వెంకటేశ్వర్లు, జాఫర్, సర్వేయరు మీరావలి పాల్గొన్నారు.

●దుత్తలూరు: రెవెన్యూ సదస్సులను రైతులు, ప్రజలు సద్వినియోగం చేసుకొని తమ సమస్యలు పరిష్కరించుకోవాలని కావలి ఆర్డీవో వంశీకృష్ణ సూచించారు. శుక్రవారం మండలంలోని నందిపాడు గ్రామంలో జరుగుతున్న రెవెన్యూ సదస్సును పరిశీలించారు. ఈ సందర్భంగా సదస్సులో రైతులు, ప్రజలు అందజేసిన అర్జీలను పరిశీలించారు. అర్జీలకు సత్వరమే పరిష్కారమార్గం చూపాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు నాగరాజు, సర్వేయరు శివ, వీఆర్వో వెంకట్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

●వరికుంటపాడు(ఉదయగిరి రూరల్): తొడుగుపల్లి, తూర్పుపాళెం గ్రామాల్లో శుక్రవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. కార్యక్రమంలో డీటీ చంచయ్య, వీఆర్వోలు నారాయణ, శ్రీనివాసులు, టీడీపీ నాయకులు తెల్లగొర్ల వెంకటయ్య, పాలకొల్లు విజయభాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

● చేజర్ల : గ్రామాలలో భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఆత్మకూరు ఆర్డీవో పావని పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని నాగులవెల్లటూరు గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ రెవెన్యూ సదస్సుల ద్వారా వచ్చే సమస్యలకు క్షేత్ర స్థాయిలోనే పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు మురళి, స్థానిక టిడిపి నాయకులు వేలూరు కేశవచౌదరి పాల్గొన్నారు.

●మర్రిపాడు: స్థానిక సచివాలయం వద్ద శుక్రవారం రెవెన్యూ సదస్సు జరిగింది. అల్లంపాడు రెవెన్యూ పరిధిలోని రైతుల నుంచి తహసీల్దారు అనీల్‌కుమార్ అర్జీలు స్వీకరించారు. 10 అర్జీలు అప్పటి కప్పుడే పరిష్కరించినట్లు తహసీల్దారు తెలిపారు. టీడీపి మండలధ్యక్షులు ఆరికట్ల జనార్ధన్‌యుడు, సర్పంచ్ బీబీజాన్ రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

● సీతారామపురం: గుండుపల్లి గ్రామ పంచాయతీలో తహసీల్దార్ కృష్ణారెడ్డి అధ్యక్షతన శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రైతులు తమ సమస్యలను పరిష్కరించాలని 72 అర్జీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ శ్రీనివాసులు, సర్వేయర్ భాగ్యలక్ష్మి, వీఆర్వో ఖజామొద్దిన్, సచివాలయ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

●వలేటివారిపాలెం: రెవెన్యూ సదస్సులతో సమస్యలు పరిష్కారం అవుతాయని తహసీల్దార్ అబ్దుల్‌అమీద్ తెలిపారు. శాఖవరం సచివాలయంలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ప్రజల నుంచి అర్జీలను రెవెన్యూ అధికారులు స్వీకరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ నాయబ్‌రసూల్, ఆర్‌ఐ ప్రసాద్, ఎండోమెంట్ ఈఓ పావనిపాల్గొన్నారు.

●లింగసముద్రం: రైతు భూ సమస్యల పరిష్కారానికే సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు సీతామహాలక్ష్మి తెలిపారు. పెంట్రాల పంచాయతీ చీమలపెంటలో శుక్రవారం నిర్వహించిన సదస్సులో 6గురు రైతులు అర్జీలు సమర్పించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ రమణయ్య, వీఆర్‌ఓ వినోద్, సర్వేయరు వెంకటేష్, నాయకులు సుధాకర్, మధు, రమణయ్య ఉన్నారు.

ఇంధన పరిరక్షణ దినోత్సవం

బిట్రగుంట, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం కడనూతల ఆర్ఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల్లో శుక్రవారం ఎలక్ట్రికల్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో జాతీయ ఇంధన పరిరక్షణ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. విద్యార్థులకు నిర్వహించిన డ్రాయింగ్, వ్యాస రచన పోటీలోని విజేతలకు బహుమతులతో పాటు ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పీవీఎస్ రెడ్డి, ఈఈఈ డిపార్ట్మెంట్ హెచ్‌ఓడీ పీవీ రామ్‌కుమార్, అన్ని విభాగాల అధిపతులు, అధ్యాపకులు, వాలంటీర్లు ఉన్నారు.

వర్షపు నీరు తొలగింపు

సంగం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఎంపీడీవో ఆదేశాల మేరకు స్థానిక ఎస్సీ బాలికల వసతిగృహం ఆవరణలో నిలిచిన వర్షపు నీటిని శుక్రవారం బయటకు తరలించారు. రాళ్లచెలికలోని బాలికల వసతిగృహం ఆవరణలోకి వర్షపు నీరు చేరి విద్యార్థులకు ఇబ్బందిగా మారింది. సందర్శనకు వచ్చిన డీడీ విషయాన్ని డీపీవో దృష్టికి తీసుకెళ్లడంతో సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. దీంతో పంచాయతీ కార్యదర్శి వర్షపు నీరు వెళ్లేందుకు అడ్డంగా ఉన్న సిమెంట్ రోడ్డును పగలకొట్టి నీటిని బయటలకు తరలించారు.

ఇరువర్గాలపై కేసు

అల్లూరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి : స్థానిక పేట యర్రంశెట్టి వెంకట శేషయ్య, సావారపు శీనమ్మ పొలం తగాదాలో ఘర్షణ పడ్డారు. ఈ ఘటనలో శీనమ్మ భర్త శీనయ్య బావ అయిన యర్రంశెట్టి వెంకట శేషయ్యపై దాడి చేయగా రక్తగాయం అయ్యింది. ఇరువురి బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కిషోర్‌బాబు తెలిపారు.

రాజ్యసభ సభ్యులకు టీడీపీ నేతల సన్మానం



రాజ్యసభ సభ్యులను సన్మానిస్తున్న చెంచలబాబు యాదవ్

ఉదయగిరి రూరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాజ్యసభ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికైన బీద మస్తాన్‌రావు, ఆర్ కృష్ణయ్య, సాన సతీష్‌లను శుక్రవారం శాసనసభ ప్రాంగణంలో టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి, మాజీ జడ్పీ ఛైర్మన్ పొన్నెబోయిన చెంచలబాబు యాదవ్ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో దుత్తలూరు మాజీ ఎంపీపీ శ్రీకుర్తి రవీంద్రబాబు, టీడీపీ యువత అధ్యక్షుడు పాముల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కాకర్లను కలిసిన జనసేన నాయకులు



జనసేన నాయకులతో సమీక్ష జరుపుతున్న కాకర్ల

కలిగిరి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): సాగునీటి సంఘాల ఎన్నికల నేపథ్యంలో ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌ను శుక్రవారం పార్టీ కార్యాలయంలో జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి కిషోర్ గునుకుల మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సాగునీటి సంఘాల ఎన్నికలో జనసేన పార్టీ తరపున పోటీచేసే అభ్యర్థుల వివరాలు అందజేశారు. కూటమి ప్రభుత్వంలో అన్ని పార్టీల నాయకులు, కార్యకర్తలు కలిసి పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో రుషికేశ్‌యాదవ్, రత్తయ్య, రాము, దిలీప్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

జూడో క్రీడాభివృద్ధికి కృషి

కావలి టౌన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): జూడో క్రీడాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు జూడో అసోసియేషన్ జిల్లా అడ్‌హాక్ కమిటీ అధ్యక్షుడు మురళి తెలిపారు. శుక్రవారం ఈ విషయంపై ఆయన విలేకరులతో మాట్లాడారు. జూడో క్రీడాకారులను శిక్షణ ఇచ్చి ఉన్నతంగా తీర్చిదిద్దేందుకే ఈ అసోసియేషన్ అడ్‌హాక్ కమిటీని ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్ర జూడో అసోసియేషన్ సీఈవో నాగిశెట్టి వెంకట్ పర్యవేక్షణలో ఏర్పడిన కమిటీలో తనతోపాటు సురేష్, శ్రీను ఉన్నారని తెలిపారు.

హడావుడే తప్ప ఆక్రమణల తొలగింపేదీ!?



రోడ్డు వెంట వెలసిన దుకాణాలు

కావలి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఆక్రమణల తొలగింపుపై అధికారుల హడావుడి తప్ప ఆచరణ సాధ్యంలో చిత్తశుద్ధి లేదని ప్రజల నుంచి విమర్శలు వస్తున్నాయి. స్థానిక పట్టణ ట్రంకు రోడ్డులోని ఆర్డీవో కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయ సముదాయంలోని సర్కిల్, రూరల్ పోలీస్‌స్టేషన్, సబ్‌జైలు, ఉప ఖజానా, సబ్‌ట్రెజరీ, వ్యవసాయశాఖ కార్యాలయాలు ఉన్నా అవి కనిపించకుండా రోడ్ల వెంబడి ఆక్రమణలను ఏర్పాటు చేశారు. రెవెన్యూ, పోలీస్ అధికారుల కార్యాలయాలు కనిపించకుండా అధికారులు పట్టించుకోక పోవటం దారుణం. ఇటీవల మున్సిపల్ అధికారులు, ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాల వద్ద ఆక్రమణల తొలగింపునకు ఎక్స్‌కవేటర్ పెట్టి హడావుడి చేసినా మరుసటి రోజు నుంచే యథాప్రకారం వాటిని ఉంచారు. ఆక్రమణలతో ట్రంకు రోడ్డు కుదించుకు పోయి రాక పోకలకు ఇబ్బందికరంగా మారింది. ప్రధాన కార్యాలయాలు ఎక్కడ ఉన్నాయో కార్యాలయాలకు వచ్చే వాళ్లకు కూడా కనిపించకుండా మూసుకు పోతున్నట్లు ఆక్రమణలు వెలుస్తున్నాయి. అయినా అధికారులు పట్టించుకోకపోవటం వారి బాధ్యతారాహిత్యానికి నిదర్శనంగా కనిపిస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి కనీసం ప్రధాన కార్యాలయాల ముందు ఉన్న ఆక్రమణలనైనా తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

సత్ఫలితాల కోసమే మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్

● ఎంఈవో గోవిందయ్య



కావలి టౌన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు ఉపాధ్యాయుల మధ్య సత్సంబంధాలు నెలకొల్పడం కోసమే ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్‌ను ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిందని ఎంఈఓ గోవిందయ్య శుక్రవారం తెలిపారు.

? పీటీఎం ప్రధాన ఉద్దేశ్యం ఏమిటి.

! విద్యార్థుల సామర్థ్యం, ఉపాధ్యాయుల బోధన, పాఠశాలలో మౌలిక వసతులు, తదితర విషయాలపై ఇరువురిలో అవగాహన పెంచడమే ప్రధాన ఉద్దేశం.

? పీటీఎంతో ఎలాంటి ఫలితాలు వస్తున్నాయి.

! సత్ఫలితాలు వస్తున్నాయి. పీటీఎంతో విద్యార్థుల సామర్థ్యాలను పెంపొందించుకోవడంతో పాటు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు దోహద పడతాయి.

? డ్రాపవుట్స్‌పై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.

! కస్టర్ ప్రధానోపాధ్యాయులు సీఆర్‌పీలతో డ్రాపవుట్స్ ఏకారణంతో పాఠశాలకు రావడం లేదో తెలుసుకుని తిరిగి పాఠశాలకు తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నాం.

న్యూస్ బాక్స్

పనుల్లో నాణ్యత పాటించాలి

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లబోతులవారిపల్లి, రామాపురం గ్రామాల్లో జరుగుతున్న సిమెంట్‌రోడ్ల నిర్మాణ పనులను శుక్రవారం పంచాయతీరాజ్ డీఈ మణి కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నల్లబోతులవారిపల్లిలో రూ. 7లక్షలు, రామాపురంలో రూ. 10లక్షలతో నిర్మాణ పనులు చేపట్టడం జరుగు తుందన్నారు. పనులు చేపట్టే గుత్తేదారులు నాణ్యతా ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఈ రవీంద్రనాద్, సిబ్బంది రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

చైల్డ్ ఇన్ఫోలో విద్యార్థుల వివరాలు నమోదు చేయాలి

ఉదయగిరి రూరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పాఠశాలకు హాజరయ్యే విద్యార్థుల వివరాలు చైల్డ్ ఇన్ఫోలో నమోదు చేయాలని ఎంఈవో షేక్ మస్తాన్‌వలి సూచించారు. శుక్రవారం పట్టణంలోని బీసీ కాలనీలోని తెలుగు, ఉర్దూ ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజనం రుచి చూసి సంబంధిత రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జీ నాగయ్య, షేక్ సర్దార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టీడీపీ నేత మన్నేటికి సన్మానం

వింజమూరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్య దర్శి మన్నేటి వెంకటరెడ్డిని మదర్‌థెరిస్సా మిరాకిల్ ఫౌండేషన్ సభ్యులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా ఫౌండేషన్ సేవా కార్యక్రమాల గురించి ఫౌండర్ శ్యాంసన్‌ను అడిగి తెలుసుకుని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు ఈశ్వర్, మహేష్, శ్రీను, మోజస్, సాకేత్, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కావలి రూరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలో విద్యుత్ లైన్ల మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపులో భాగంగా శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని రూరల్ ఏఈ శ్రీనివాసులు రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ముసునూరు, అన్నగారిపాలెం, మద్దూరుపాడు, తుమ్మలపెంట, చెన్నాయపాలెం సబ్‌స్టేషన్ల పరిధిలో ఉదయం 8.30 నుండి మధ్యాహ్నం 2గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈ అసౌకర్యానికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

●బిట్రగుంట : బోగోలు మండలంలోని చెంచులక్ష్మీపురం, జక్కేపల్లిగూడూరు, ముంగమూరు, వడ్డిపాలెంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ నిలిపివేస్తామని ట్రాన్స్‌కో ఏఈ జదరాయ్ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

రేపు జిల్లాస్థాయి బాలుర, బాలికల కబడ్డీ జట్ల ఎంపిక

కావలి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా కబడీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం మధ్యాహ్నం పట్టణంలోని మినీ స్టేడియంలో జిల్లాస్థాయి జూనియర్స్ కబడ్డీ బాలురు, బాలికల జట్లను ఎంపిక చేయనున్నట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2005 తర్వాత జన్మించి, బాలురు 70 కిలోలు, బాలికలు 65 కిలోలు లోపు ఉన్న వారు పోటీలకు అర్హులన్నారు. పోటీలలో పాల్గొనదలిచిన వారు ఆధార్ కార్డుతో హాజరు కావాలని పేర్కొన్నారు. ఎంపికైన జట్టు రావులపాలెంలో నిర్వహించే 50వ జూనియర్ కబడీ రాష్ట్రస్థాయి పోటీలో పాల్గొంటారని తెలిపారు. పూర్తి వివరాల కోసం సెల్: 94405 03548, 92989 50860 నంబర్లను సంప్రదించాలన్నారు.

న్యూస్ బాక్స్

ఎస్సీ ఉపవర్గీకరణ విచారణకు వినతులు సమర్పించాలి

నెల్లూరు(హరనాథపురం), డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ ఉప వర్గీకరణపై జరిగే విచారణకు జిల్లా నుంచి ఆసక్తి గల వారు రాతపూర్వక వినతులను సమర్పించవచ్చని ఎస్సీ సంక్షేమశాఖ డీడీ శ్రీనివాసులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆ విచారణకు ప్రభుత్వం రాజీవ్ రంజన్ మిశ్రా నేతృత్వంలో ఏకసభ్య కమిషన్‌ను నియమించిందని, కమిషన్ కార్యాలయాన్ని విజయవాడలోని మొఘల్ రాజపురంలో ఉన్న గిరిజన సంక్షేమశాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిందని తెలిపారు. వినతులను ఆ కార్యాలయ పనివేళల్లో వ్యక్తిగతంగాగానీ, తిరుగు రసీదులతో కూడిన రిజిస్టర్ పోస్టు, ఈ-మెయిల్ ఐడీ ద్వారాగానీ వచ్చే ఏడాది జనవరి 9వ తేదీలోగా సమర్పించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కోవూరు, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని పడుగుపాడు, వేగూరు, కోవూరు విద్యుత్ సబ్‌స్టేషన్లలో మరమ్మతుల కారణంగా శనివారం కోవూరు పంచాయతీ పరిధిలోని పీఆర్ఆర్ కాలనీ, కొత్తూరు, పడుగుపాడు, పోతిరెడ్డిపాళెం, గంగవరం, వేగూరు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని డీఈఈ మధుసూదన రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నందున సహకరించాలని పేర్కొ న్నారు.

బెల్ట్ షాపులు నియంత్రించండి

ఇందుకూరుపేట, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తూరు బీసీ కాలనీలో విచ్చలవిడిగా మద్యం బెల్ట్ షాపులు వెలిశాయని టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి మునగాల రంగారావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కూలి పనులు చేసుకొని జీవనం సాగించే బీసీ కాలనీ వాసులు బెల్ట్ షాపు వలన పనులకు పోకుండా మద్యం సేవించి భార్యాబిడ్డలను హింసకు గురి చేస్తున్నారని తెలిపారు. ఇకనైనా ఎక్సైజ్ అధికారులు స్పందించి ఈ బెల్ట్ షాపులను అరికట్టాలని కోరారు.

అదానీ జూనియర్ కళాశాల భవనానికి భూమిపూజ

ముత్తుకూరు, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్అండ్ఆర్ కాలనీలో అదానీ జూనియర్ కళాశాల భవన నిర్మాణానికి శుక్రవారం అదానీ కృష్ణపట్నం పోర్ట్ లిమిటెడ్ సీఈవో జగదీష్ పటేల్ భూమిపూజ చేశారు. నిర్ణీత గడువులోగా భవనాన్ని నిర్మిస్తామని, అదానీ జూనియర్ కళాశాల ద్వారా విద్యార్థులకు విద్య అందించడం అదానీ చైర్‌పర్సన్ డాక్టర్ ప్రీతి ఆశయమన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్, పోర్టు ప్రతినిధులు శ్రీనివాస్‌రావు, రాజేష్ రంజన్, వేణుగోపాల్, గణేష్‌శర్మ, మృత్యుంజయరామ్, జయలాల్ తదితరులు పాల్గొన్నారు.

విలేకరుల నిరసన

తోటపల్లిగూడూరు, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): మీడియా ప్రతినిధులపై దాడి హేయమని ఖండిస్తూ మండలంలోని పలువురు విలేకర్లు శుక్రవారం తహసీల్దారు కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం డిప్యూటీ తహసీల్దారు శివయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పత్రికల ప్రతినిధులు నరసింహం, జడ్డయ్య, విద్యాసాగర్, కల్పన, కరుణాకర్, బుట్టి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కరించండి

నెల్లూరు (సాంస్కృతికం) : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రెవెన్యూ సదస్సులకు విశేష స్పందన వస్తోందని బహుజన ప్రజా సంఘం కార్యదర్శి ఇర్ల వెంకట రమణయ్య తెలిపారు. జిల్లాలో జరుగుతున్న రెవెన్యూ సదస్సుల్లో రైతుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం రాత్రి జిల్లా రెవెన్యూ అధికారికి ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇమ్మానియేల్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అనుపల్లిపాడు, గురివిందపూడిలో రెవెన్యూ సదస్సులు

మనుబోలు, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని అనుపల్లిపాడు, గురివిందపూడి రెవెన్యూ గ్రామాల్లో శుక్రవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. రైతుల నుంచి అర్జీలు స్వీకరించి భూ సమస్యలు త్వరలోనే పరిష్కరిస్తామని తహసీల్దారు సుబ్బయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌వో శీనమ్మ, సర్వేయర్ శ్రీనువాసులు, టీడీపీ నాయకులు చెన్నూరు సుధీర్‌రెడ్డి, సర్వేపల్లి శివకుమార్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పక్కన బండ్లు

యమదూతలే!

- హైవే పక్కన వందలాది లారీలు, ట్రక్కులు
- ఎక్కడ పడితే అక్కడ నిలిపివేత
- కనపడక ఢీకొడుతున్న ఇతర వాహనాలు
- రాత్రుళ్లే అధికంగా ప్రమాదాలు



ఎన్‌టీఆర్ నగర్ సమీపంలో హైవేపై నిలిపిన వాహనాలు



చింతారెడ్డిపాళెం సమీపంలో..



← నారాయణ ఇంజనీరింగ్ కళాశాల దాటిన తర్వాత జాతీయ రహదారిపై నిలిపి ఉన్న లారీ

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని జాతీయ రహదారుల పక్కన ఎక్కడపడితే అక్కడ వాహనాలను నిలిపి వేస్తున్నారు. ఇవి యమదూతలుగా మారి ఎందరో ప్రాణాలను హరిస్తున్నా యి. నెల్లూరు నగర పరిధిలోనూ రమారమి ప్రతి 100 మీటర్లకు ఒక వాహనం నిలుపుతున్నట్లు అంచనా. దేశంలో రోడ్డు ప్రమాదాల సంఖ్య నానాటికీ పెరిగిపోతోందని, అంతర్జాతీయ సదస్సుల్లో ఈ అంశం ప్రస్తావనకు వస్తే సమాధానం చెప్పలేక సిగ్గుతో ముఖాన్ని దాచుకోవాల్సి వస్తోందని కేంద్ర రోడ్డు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ గురువారం లోక్‌సభలో వాపోయిన విషయం విదితమే. రోడ్డు పక్కన ట్రక్కులను నిలిపి ఉంచడం ప్రమాదాలకు ప్రధాన కారణమని సాక్షాత్తు కేంద్ర మంత్రే పేర్కొనడం ప్రస్తుత పరిస్థితికి నిదర్శనం. జిల్లాలో జాతీయ రహదారుల పక్కన వాహనాలు నిలిపేందుకు ప్రత్యేకంగా స్థలాలు, రెస్ట్ రూమ్‌లు ఏర్పాటు చేసి ఉన్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే వాహనాల డ్రైవర్లు విశ్రాంతి తీసుకునేందుకు, వంట చేసుకునేందుకు, వాహనాలకు మరమ్మతులు చేసుకునేందుకు ఈ స్థలాలను కేటాయించారు. అయితే వాటిని ఉపయోగించే వారి సంఖ్య తక్కువగా ఉంటోంది. ఎక్కువ మంది డ్రైవర్లు జాతీయ రహదారిపై ఎక్కడపడితే అక్కడ ఇష్టానుసారంగా వాహనాలు నిలిపివేస్తున్నారు. ఇలాంటి వాటి వల్ల ప్రమాదాలు జరుగు తున్నాయి. ముఖ్యంగా రాత్రుళ్లు ఆ మార్గంలో వచ్చే వాహనాలకు ఆగి ఉన్న లారీలు, ట్రక్కులు కనిపించక ఢీకొడుతున్నారు. ఈ విధంగా జిల్లాలో పెద్ద సంఖ్యలో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఎంతో మంది ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు.

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



మాడ వీధుల్లో ఊరేగుతున్న ఆంజనేయస్వామి

రాపూరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పెంచలకోన లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో శుక్రవారం శుద్ధ త్రయోదశి సందర్భంగా పెంచలకోన క్షేత్రపాలకుడైన వీరాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం హనుమాన్ వ్రతం, ఆకుపూజ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం కోన మాడ వీధుల్లో ఆంజనేయస్వామికి క్షేత్రోత్సవం వైభవంగా నిర్వహించినట్లు ఆలయ ఈవో పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి తెలిపారు.

సోమిరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరిన ముంగర

మనుబోలు, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): స్థా నిక వైసీపీ నేత ముంగర విజయభాస్కర్‌రెడ్డి శుక్రవారం ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. మనుబోలులోని ముంగర నివాసంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆయనకు కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసీపీలో నాయకులతో వేగలేక, విధానాలు నచ్చక ముంగర మళ్లీ పుట్టింటికి వచ్చాడన్నారు.



విజయభాస్కర్‌రెడ్డికి కండువా వేస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి

అనంతరం పలు గ్రామాల టీడీపీ నాయకులు ముంగరను అభినందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు గాలి రామకృష్ణారెడ్డి, నాయకులు రామకృష్ణయ్య, మస్తాన్ నాయుడు, పచ్చిపాల రామిరెడ్డి, సాని వెంకటరమణయ్య, దండు చంద్రశేఖర్ రెడ్డి, రాయపాటి కిరణ్ కుమార్, మోపూరు ధనంజయరెడ్డి, శివుడురాజా గౌడ్, చెల్లగిరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే శిక్ష తప్పదు

- డెంటల్ విద్యార్థుల అవగాహన సదస్సులో ఏఎస్పీ సౌజన్య

నెల్లూరు(వైద్యం), డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఎవరైనా ర్యాగింగ్‌కు పాల్పడితే వారికి చట్టప్రకారం శిక్ష తప్పదని అదనపు ఎస్పీ సౌజన్య హెచ్చరించారు. శుక్రవారం నారాయణ డెంటల్ కళాశాలలో యాంటీ ర్యాగింగ్ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏఎస్పీ మాట్లాడుతూ ర్యాగింగ్ అనేది పరిచయాలకే పరిమితం కావాలని, విపరీత పోకడలకు పోరాదని హితవు పలికారు. తోటి విద్యార్థులకు ఇబ్బంది కలిగించేలా ఎవరైనా ర్యాగింగ్‌కు పాల్పడితే



మాట్లాడుతున్న ఏఎస్పీ సౌజన్య

101, 122 నెంబర్లకు ఫోన్ చేస్తే వెంటనే పోలీసులు స్పందిస్తారని తెలిపారు. అలాగే మాదకద్రవ్యాలు, బెట్టిం గులకు విద్యార్థులు దూరంగా ఉండాలని సూచించారు. నెల్లూరు రూరల్ డీఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడు తూ విద్యార్థులు రాత్రి సమయాల్లో బయటకు వెళ్లరాదని, ద్విచక్ర వాహనం నడిపేట ప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐలు వేణు, సుబ్బారావు, నారాయణ దంత వైద్య కళాశాల డీన్ డాక్టర్ శివకుమార్, ఏజీఎం భాస్కర్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్స్

నెల్లూరు(విద్య), డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): నగరంలోని సుంకు చెంగన్న మునిసిపల్ ఉన్నత పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు శుక్రవారం వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్స్ అందచేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు డీవీ సుబ్బరాజు మాట్లాడుతూ పదో తరగతి పరీక్షల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో విద్యార్థులు ఉత్తమంగా రాణించాలన్న ఉద్దేశంతో మెటీరియల్స్ అందచేశామని చెప్పారు. ఫలితాల్లో పాఠశాల ప్రథమ స్థానం సాధించిన విద్యార్థికి నగదు బహుమతి



స్టడీ మెటీరియల్స్ అందుకున్న విద్యార్థులతో వాకర్స్

అందచేస్తా మని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కే అరవింద్, అసోసియేషన్ కార్యదర్శి స్వర్ణ రమేష్‌బాబు, వ్యవస్థాపకుడు మేకల నరేంద్రరెడ్డి, కోశాధికారి జయదేవ్, సభ్యులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు (జడ్పీ), డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని బీఎస్ఆర్, ఏకే నగర్, రంగనాథ ఆలయం, శెట్టిగుంటరోడ్డు, మార్కెట్ యార్డ్, సండేమార్కెట్, కొండయపాళెం, రామ్మూర్తి నగర్ సబ్‌స్టేషన్ల పరిధిలో లైన్లకు మరమ్మతులు చేస్తున్నందున శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఈఈ శ్రీధర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. శెట్టిగుంటరోడ్డు సబ్‌స్టేషన్ పరిధిలో మాత్రం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

టీడీపీ పటిష్టతకు కృషి చేద్దాం

నెల్లూరు రూరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : అందరం కలిసి పని చేసి టీడీపీని మరింత పటిష్టం చేద్దామని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం రూరల్‌లోని కొమ్మరపూడికి చెందిన వైసీపీ నాయకులు సురేష్ నాయుడు, సందానీ బాషా, దొడ్డ సుబ్రహ్మణ్యం యాదవ్‌ల మిత్రబృందాన్ని కండువ కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో నూటికి నూరు శాతం అన్నీ పంచాయతీల్లో టీడీపీ జెండా ఎగరాలని సూచించారు. కొత్త, పాత నాయకులంతా ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరించేందుకు చొరవ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

వేధింపులపై పోలీసులకు ఫిర్యాదు

నెల్లూరు(క్రైం), డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : తనను ఓ వ్యక్తి వేధిస్తున్నాడని, ఇదేమిటని ప్రశ్నిస్తే తండ్రి పోలీసు అని చెప్పి బెదిరిస్తున్నాడని ఒక అవివాహిత శుక్రవారం చిన్నబజారు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆ మహిళ నగరంలోని సీఏఎం కాంపౌండ్‌లో నివసిస్తోంది. అదే కాంపౌండ్‌లో ఇటీవల ఇంగిలాల అమృతరావు అనే వ్యక్తి అద్దెకు చేరారు. అతను తనతో అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడని, ఇదెక్కడి న్యాయం అని ప్రశ్నిస్తే అతని తండ్రి పోలీసు అని బెదిరిస్తున్నాడన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా గంధమహోత్సవం

బుచ్చిరెడ్డిపాళెం, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): బుచ్చిరెడ్డిపాళెం ఖాజానగర్‌లో శుక్రవారం గంధమహోత్సవం వైభవంగా జరిగింది. ఆస్థాన దర్గా నుంచి బుచ్చి బస్టాండ్ సెంటర్ వరకు ఈ గంధమహోత్సవాన్ని మేళ తాళాలతో ఊరేగించారు. ఊరేగింపు అనంతరం ఖాజానగర్‌లోని ఆస్థానయే దర్గాకు చేరుకుని అక్కడ గంధం సమర్పించారు.

బోల్తాపడ్డ టిప్పర్, తప్పిన ప్రమాదం

నెల్లూరురూరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు రూరల్ పరిధిలోని కాకుపల్లికి సమీపాన శుక్రవారం ఓ టిప్పర్ బోల్తాపడింది. స్థానికుల సమాచారం మేరకు.. కాకుపల్లి నుంచి చిన్నచెరుకూరు వైపు క్వారీ డస్ట్‌లోడ్‌తో వెళ్తున్న టిప్పర్ లేఅవుట్లు దాటాక అదుపు తప్పింది. పక్కనే ఉన్న పంట కాలువలోకి దూసుకెళ్లి బోల్తాపడింది. ఈ సమయంలో అక్కడ ఎవరు లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

రేపు నెల్లూరులో మెగా జాబ్ మేళా

నెల్లూరు (వెంకటేశ్వరపురం), డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని కనుపర్తిపాడులో ఉన్న వీపీఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో ఆదివారం మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతీ మూడు నెలలకు ఒకసారి నిరుద్యోగుల కోసం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆదివారం జరిగే మేళాలో దాదాపు 100 కంపెనీల ప్రతినిధులు పాల్గొంటార న్నారు. దాదాపు 10వేల మందికి ఉపాధి కల్పించేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ధర్మరాజస్వామి ఆలయంలో నిత్యకైంకర్యాలు జరిపించండి

నెల్లూరు (సాంస్కృతికం), డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని నవాబుపేట ద్రౌపదీ సహిత శ్రీకృష్ణధర్మరాజుల స్వామి ఆలయంలో 43 రోజులుగా ధూపదీప నైవేద్యాలు, నిత్య కైంకర్యాలు జరగడంలేదని జిల్లా అగ్నికుల క్షత్రియ సంఘం అధ్యక్షుడు చమ్మండి రాము, ప్రధాన కార్యదర్శి టీ శివశంకర్‌లు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు దేవదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్‌కు శుక్రవారం లేఖ అందజేశారు. ఈవో నిర్లక్ష్యం కారణంగానే ఆలయానికి ఈ దుస్థితి వచ్చిందని తెలిపారు. ఆలయంలో నిత్య కైంకర్యాలు జరిగేటట్లు చర్యలు తీసుకోవాలని కోరారు. ఆలయ భూములను ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఎట్టకేలకు నాసిరకం మట్టి తొలగింపు

నెల్లూరు(సిటీ), డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : నగరంలో సుందరీకరణ పనుల్లో భాగంగా మొక్కలు పెంచడానికి డివైడర్లలో వేసిన నాసిరకం మట్టిని తీసేశారు. ఇందులో వేసిన మట్టి మొక్కలు పెంచడానికి ఏ మాత్రం అనుకూలం కాదని కార్పొరేషన్ కమిషనర్ సూర్యతేజ స్వయంగా చూసి ఆక్షేపించారు. 24 గంటల్లో మట్టిని తీసేయాలని సోమవారం ఆదేశించారు. కానీ బుధవారానికి కూడా మట్టిని తొలగించకపోగా అధికారులు అదే మట్టిని డివైడర్లలో చదును చేసేశారు. ఈ విషయాన్ని ఆంధ్రజ్యోతి వెలుగులోకి తీసుకురావడంతో ఆగ్రహించిన కమిషనర్ బాధ్యులైన ఇంజనీరింగ్ అధికారులకు షోకాజు నోటీసులిచ్చారు. దీంతో శుక్రవారం ట్రాక్టర్లతో మట్టిని తీసి బయటకు తరలించారు.

క్యాలెండరు ఆవిష్కరణ

నెల్లూరు (సాంస్కృతికం) డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని బట్వాడిపాలెం తెలుగు సెకండ్ బాప్టిస్టు చర్చిలో శుక్రవారం రాత్రి నూతన ఆంగ్ల సంవత్సర క్యాలెండరును ఆవిష్కరించారు. సంఘ కాపరి శామ్యూల్ కిషోర్, చర్చి చైర్మన్, టీడీపీ క్రిస్టియన్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులడు డాక్టర్ ఉరందూరు సురేంద్రబాబు, ప్రధాన కార్యదర్శి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

నీటి సంఘాల ఎన్నికలకు సర్వం సిద్ధం

ముత్తుకూరు, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలో నీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. శుక్రవారం డిప్యూటీ తహసీల్దారు ప్రదీప్ నీటి పారుదల శాఖ ఏఈ వేమారెడ్డి ఆధ్వర్యంలో ఎన్నికల అధికారులకు మెటీరియల్ పంపిణీ చేశారు. మండలంలో పెన్నా డెల్టా పరిధిలో ఉన్న పంటపాలెం, పైనంపురం, పొట్టెంపాడు, బ్రహ్మదేవం, పిడతాపోలూరు, ముత్తుకూరు నీటి సంఘాలకు శనివారం ఎన్నికలు నిర్వహించనున్నారు. ఇందుకు అవసరమైన సామగ్రిని ఆయా ఎన్నికల అధికారులకు అందజేశారు. మండలంలో ఆరు సాగునీటి వినియోగదారుల సంఘాలకు మొత్తం 6331 మంది ఓటర్లు ఉండగా పురుషులు 4029, మహిళలు 2302 మంది ఉన్నారు.

- రాపూరు,(ఆంధ్రజ్యోతి): మండలంలో శనివారం ఉదయం 8గంటల నుంచి 5గంటల వరకు నీటి సంఘాల ఎన్నికలు నిర్వహిస్తామని ఇరిగేషన్ ఏఈ సర్దార్ తెలిపారు. రాపూరు మండలంలో మొత్తం 8 చెరువులకు ఎన్నికలు జరుగుతాయని రాపూరు గ్రామంలో 2 చెరువులు, పంగిలిలో 2, సిద్ధవరంలో 1, జోరేపల్లిలో 1, ఏపూరులో 1, తెగచర్లలో ఒక నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తామని ఏఈ తెలిపారు.

జాతీయ క్రీడాకారులకు అభినందన

నెల్లూరు(విద్య), డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): నగరంలోని రామయ్య బడిలో చదువుతూ జాతీయ స్థాయిలో క్రీడల్లో రాణిస్తున్న విద్యార్థులకు శుక్రవారం పాఠశాలలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. హెచ్ఎం ఈ వేదమూర్తి మాట్లాడుతూ మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో జరిగిన జాతీయ జూనియర్ త్రోబాల్ పోటీల్లో తమ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న యశ్విన్ బాలుర విభాగంలో, బాలికల విభాగంలో శరణ్య రాణించారని చెప్పారు. ఇదే స్ఫూర్తితో ముందు విద్యలో రాణిస్తూనే క్రీడల్లో కూడా సత్తా చాటాలంటూ విద్యార్థులను అభినందించారు. పీఈటీ జంగం వెంకట్రావును హెచ్ఎం, తదితరులు సత్కరించారు.



క్రీడాకారులు, పీఈటీతో ఉపాధ్యాయులు

విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దాలి

- జిల్లా సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ ఉషారాణి

వెంకటాచలం, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు సులభమైన పద్ధతిలో విద్యా సామర్థ్యాలను నేర్పించి భావి భారత పౌరులుగా తీర్చిదిద్దాలని జిల్లా సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ఉషారాణి సూచించారు. మండలంలోని గొలగమూడి సమీపంలో ఉన్న టూరిజం కళాశాలలో గత ఐదు రోజులుగా జరుగుతున్న జిల్లాస్థాయి ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం ఆమె పరిశీలించారు. ఈసందర్భంగా ఉపాధ్యాయులు తయారు చేసిన టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ పరిశీలించి ఎంతో అద్భుతంగా తయారు చేశారని ఉపాధ్యాయులను అభినందించారు. కార్యక్రమంలో జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి సుధీర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



శిక్షణను పరిశీలిస్తున్న ఏపీసీ ఉషారాణి

వృద్ధ దంపతుల ఆత్మహత్యాయత్నం

- ఎస్‌ఐ బెదిరించడంతోనే అంటున్న బాధితుల కుమారుడు

బుచ్చిరెడ్డిపాళెం, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): బుచ్చిరెడ్డిపాళెంలోని జెండాదిబ్బ సమీపంలో గుంజి రమణయ్య, నాగమ్మ వృద్ధ దంపతులు శుక్రవారం పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. గమనించిన స్థానికులు, బాధిత కుటుంబ సభ్యులు వారిని 108లో బుచ్చి ప్రభుత్వాసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు. ఈ సందర్భంగా బాధితుల కుమారుడు గుంజి శ్రీనివాసులు మాట్లాడుతూ తమ కుటుంబానికి సంబంధించిన 30 సెంట్ల భూమి రీ సర్వేలో మరొకరి పేరుతో మారిందన్నారు. ఆ భూమిలో దిగితే కేసులు పెడతామని తమ తల్లిదండ్రులను ఎస్‌ఐ బెదిరించడంతో వారు ఆందోళన చెంది పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారని ఆరోపించారు. తమ భూమికి సంబంధించి అన్ని ఆధారాలు



బుచ్చి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధ దంపతులు

న్నాయని, తాము ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని వాపోయారు. ఈ విషయంపై సీఐ శ్రీనివాసులురెడ్డిని వివరణ కోరగా బాధితులు 112 నెంబరుకు కాల్ చేయడంతో పొలం వద్దకు ఎస్‌ఐని పంపించామన్నారు. ఆ భూమి ఆదిశేషారెడ్డిదిగా 1బీ, అడంగళ్, రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు ఉన్నాయని తహసీల్దారు చెప్పారని సీఐ తెలిపారు.

రేపు చలో గుంటూరుకు తరలిరండి

విడవలూరు, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణను నిరసిస్తూ ఆదివారం నిర్వహించ తలపెట్టిన చలో గుంటూరు కార్యక్రమాన్ని జయప్రదం చేసేందుకు పెద్దసంఖ్యలో తరలిరావాలని అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్లు సాల్మన్ కోరారు. మండల పరిధిలోని విడవలూరు, అన్నారెడ్డిపాళెం, ముదివర్తి, ఊటుకూరు గ్రామాల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. మాలల మహాగర్జనను జయప్రదం చేయాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. భద్రాచలం గ్రామంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆయన వెంట అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు గంగపట్నం సతీష్, మునలి నరేంద్ర, దానం మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.



జల గలగలలు

వానలకు వాగులు వంకలు పొంగడమే కాదు.. కొండకోనల్లోంచి జలపాతాలు జాలువారుతున్నాయి. శ్రీకాళహస్తి భైరవకోనలో శివలింగాన్ని అభిషేకిస్తూ జలధార కిందికి జారుతున్న దృశ్యం అబ్బురపరుస్తోంది. తిరుమల కొండల్లోనూ అనేకచోట్ల జలధారలు భక్తులకు కనువిందు చేస్తున్నాయి.



చదువులమ్మ వెళ్లిపోయింది

ఆంధ్రప్రదేశ్‌లో తొలి మహిళాకాలేజీ రూపశిల్పి కంభంపాటి రాజేశ్వరీమూర్తి శుక్రవారం కన్నుమూశారు. తిరుపతిలోని పద్మావతీ మహిళా కళాశాల ప్రిన్సిపాల్‌గా 22 ఏళ్లు సేవలందించిన ఆమె న్యూయార్క్‌లో తన 104వ పుట్టినరోజు జరుపుకొన్న మూడవ రోజునే కన్నుమూశారు.



అన్నదాతల జాడేది?

అధికారం కోల్పోయిన జగన్.. కూటమి ప్రభుత్వం ఆరునెలలకే విఫలమైందంటూ కత్తిగట్టి అన్నదాతకు అండగా అంటూ ఇచ్చిన పిలుపు తిరుపతిలో తుస్సుమంది. ఈ నిరసనలో అన్నదాతల జాడ కనిపించలేదు. వానకు ఇచ్చిన సెలవులో ఉన్న కాలేజీ విద్యార్థులను తరలించుకువచ్చారు.

- వివరాలు 6లో -

రెవెన్యూ సదస్సులకు 593 అర్జీలు

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): జిల్లాలో శుక్రవారం 43చోట్ల రెవెన్యూ సదస్సులు నిర్వహించగా, 593 అర్జీలు వచ్చాయని కలెక్టరు వెంకటేశ్వర్ తెలిపారు. భూకబ్జాలపై 2, ఇంటి స్థలాలకోసం 10, అసైన్‌మెంట్ ల్యాండ్‌కు సంబంధించి 57, రీసర్వేకు 22, గ్రామవార్డు సచివాలయాలపై 14, ఆర్‌వోఆర్‌కు 361, ఇతర విషయాలకు సంబంధించి 81 ఫిర్యాదులు అందినట్లు పేర్కొన్నారు. వీటిలో ఏడింటిని అప్పుడే పరిష్కరించామని తెలిపారు.

వాన నిలిచినా తగ్గని వెతలు

- నీట మునిగిన గ్రామాలు, ఇళ్లు
- నీటిపాలైన వందలాది ఎకరాల పంటలు



సూళ్లూరుపేట మండలం మన్నారుపోలూరు రోడ్డులో వరదనీరు



సూళ్లూరుపేట మండలం వట్రపాలెంలో వృద్ధురాలను తెప్పబెండుపై పునరావాస కేంద్రానికి తీసుకెళ్తున్న దృశ్యం



తడ మండలం చేనిగుంటలో నీటమునిగిన వరిపైరును చూపిస్తున్న రైతు

- తూర్పున పెరిగిన వాగుల ఉధృతి
- పలు మార్గాల్లో రెండో రోజూ ఆగిన రాకపోకలు

బంగాళాఖాతంలో తలెత్తిన వాయుగుండం కారణంగా జిల్లాలో గురువారం భారీ వర్షం పడింది. శుక్రవారం వాన తెరిపిచ్చినా జనం వెతలు మాత్రం తగ్గలేదు. ముఖ్యంగా తూర్పు ప్రాంతాల్లో వాగుల ఉధృతి మరింత పెరిగింది. పలు మార్గాల్లో రెండో రోజూ రాకపోకలు ఆగిపోయాయి. పలు గ్రామాలు, ఇళ్ళు నీటమునిగాయి. బీఎన్ కండ్రిగలో పూరిగుడిసె కూలిపోగా వందలాది ఎకరాల్లో మిరప, వరి పంటలు నీటి పాలయ్యాయి. వడమాలపేట మండలంలో బోటులో వెళ్ళి మరీ ట్రాన్స్‌కో సిబ్బంది విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి



ఏర్పేడు మండలం ముసలిపేడులో నీటితో దెబ్బతిన్న వేరుశనగ

సత్యవేడు, శ్రీకాళహస్తి ప్రాంతాల్లోనూ తగ్గని వరద ప్రభావం

కేవీబీపురం మండలంలో కళత్తూరు రిజర్వాయర్ నిండిపోయి కలుజు పొంగి పారుతోంది. పూడి గ్రామాలకు రాకపోకలు రెండవ రోజు కూడా నిలిచిపోయాయి. శ్రీకాళహస్తి మండలం ముచ్చువోలు వద్ద సున్నపు కాలువ ఉధృతి తగ్గలేదు. నిన్నటి నుంచీ రాకపోకలు ఆగిపోయాయి. ముళ్ళపూడి ఎస్టీ కాలనీ వద్ద కూడా వాగు పొంగి రాకపోకలు నిలిచాయి. వరదయ్యపాలెం మండలంలోని వాగుల్లో ఇంకా వరద ఉధృతి తగ్గలేదు. సీఎల్ఎన్ పల్లి వద్ద పాముల కాలువ, అంబూరు కామాక్షమ్మ ఆలయం వద్ద వాగు ఉధృతి వల్ల సంతవేలూరు, అంబూరు గ్రామాల వద్ద పొలాలన్నీ నీట మునిగాయి. పిచ్చాటూరు మండలంలో అరణియార్ ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండింది. బీఎన్ కండ్రిగలో 50 ఎకరాల మిరప పంట నీట మునిగింది. జంబుగోళం, పూసలపల్లి, చిన్నయ్యగుంట గ్రామాల్లో 300 ఎకరాల వరి పంట నీటిపాలైంది. చిన్నపాలేడు గ్రామంలో పోలయ్య అనే గిరిజనుడి పూరిగుడిసె కూలిపోయింది. బీఎన్ కండ్రిగ నుంచీ సూళ్ళూరుపేట మార్గంలో రాకపోకలు నిలిచాయి.



కోట మండలం గోవిందపల్లి- గోవిందపల్లిపాళెం గ్రామాల మధ్య వరద నీటి ప్రవాహం



చేనిగుంటలో మునిగిన పంటపొలాలను పరిశీలించేందుకు ట్రాక్టర్‌పై వెళ్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ



సూళ్లూరుపేట మండలం పుచ్చాకాలువ ప్రవాహంతో కోటపోలూరు రోడ్డుపై నీటి ప్రవాహం

పొంగిన వాగులు, కాలువలు

తడలో కాళంగి నది, పాముల కాలువలు పొంగడంతో కాదలూరు రోడ్డుపైకి నీరు చేరింది. కాదలూరు, వెండ్లూరుపాడు, కట్టవ గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. మండలంలోని గ్రద్దగుంటలో పలు ఇళ్ళు నీట మునిగాయి. పులికాట్ సరస్సులో పోటు పెరగడంతో వందలాది ఎకరాలు నీట మునిగాయి. గూడూరు మండలంలో పంబలేరు పొంగి ప్రవహిస్తోంది. దీంతో పట్టణంలోని పాత నెల్లూరు రోడ్డులో రాకపోకలు స్తంభించాయి. కోట మండలంలో స్వర్ణముఖి, చల్ల కాలువలకు వరద పోటు పెరిగింది. దొరవారిసత్రంలో కాళంగి ఉగ్రరూపం దాల్చింది. దీంతో పరివాహక ప్రాంతాలు జలమయమయ్యాయి. పెళ్లకూరు మండలంలో వరి పంట నీటమునిగింది. మండలంలోని కలవకూరు డ్యామ్‌పై నీటి ఉధృతికి రాకపోకలు ఆగిపోయాయి.

వచ్చిన నీరు వచ్చినట్లే..

వాకాడు మండలంలోని స్వర్ణముఖి బ్యారేజీలోకి గురువారం పది వేల క్యూసెక్కుల వరద నీరు రాగా శుక్రవారం ఏకంగా 27 వేల క్యూసెక్కుల నీరు చేరింది. దీంతో వచ్చిన నీటిని వచ్చినట్లే కిందకు వదిలిపెట్టేస్తున్నారు. మొత్తం 34 గేట్లలో ఏడింటిని ఎత్తివేసి నీటిని సముద్రంలోకి వదులుతున్నారు. దీంతో బాలిరెడ్డిపాలెం, గంగనపాలెం నడుమ కాజ్‌వేపై ప్రవాహ ఉధృతి పెరిగిపోయింది. రెండో రోజైన శుక్రవారం కూడా 12 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. కాజ్‌వేకి ఇరువైపులా భారీగా గ్రావెల్ తరలించి కట్టలుగా ఏర్పాటు చేసిన రెవిన్యూ అధికారులు నీరు గ్రామాల్లోకి రాకుండా అడ్డుకున్నారు.

నాయుడుపేట, సూళ్లూరుపేటలో రోడ్లపైకి వరద నీరు

నాయుడుపేటలో స్వర్ణముఖిలోకి వరద నీరు భారీగా చేరుతోంది. దీంతో పట్టణంలో కాజ్‌వేపై కూడా నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. ఫలితంగా నాయుడుపేట నుంచీ మేనకూరు, వెంకటగిరి ప్రాంతాలకు రాకపోకలు స్థంభించాయి. కాజ్‌వేకి ఇరువైపులా వాహనాలు భారీగా నిలిచిపోయాయి. కాజ్‌వే వద్ద పోలీసు, రెవిన్యూ బృందాలు మకాం వేసి పరిస్థితిని పర్యవేక్షిస్తున్నాయి. సూళ్ళూరుపేట ఆర్టీసీ డిపో సమీపంలో జాతీయ రహదారిపైకి వరద నీరు చేరింది. కాళంగి నదికి భారీగా వరద నీరు రావడంతో సూళ్ళూరుపేట నుంచీ మన్నారుపోలూరు వెళ్ళే రోడ్డుపైకి నీళ్ల వచ్చాయి. దీంతో ఈ మార్గంలో రాకపోకలు ఆగిపోయాయి. మన్నారు పోలూరు గ్రామం కూడా దాదాపు జలదిగ్బంధంలో చిక్కుకుంది. పుత్తూరు మండలం నందిమంగళం చెరువు నిండి కలుజు పారుతోంది. వీరప్పరెడ్డిపాలెం చెరువు సైతం నిండిపోయింది. తాజా వర్షాలకు మండలంలో మూడు మినహా మిగిలిన చెరువులన్నీ నిండాయి. వడమాలపేట సమీపంలో చీమలవారి వంక కాజ్‌వే కుంగడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.



బోటుపై వెళ్లి..

- విద్యుత్ సరఫరా పునరుద్ధరించిన సిబ్బంది

ఈ వర్షాలకు వడమాలపేట మండలం ఎస్వీఆర్‌పురం వద్ద గూళూరు చెరువు నిండింది. ఈ చెరువులోని 11 కేవీ మెయిన్ లైన్ నీటి ప్రవాహంతో ట్రిప్ అయి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో దిగువ గూళూరు పరిసర గామాల్లో గురువారం నుంచే సరఫరా ఆగిపోయింది. పుత్తూరు విద్యుత్ ఏఈ జయసాయి ఆధ్వర్యంలో లైన్‌మ్యాన్ వేణు, జేఎల్ఎం అశోక్, సిబ్బందితో శుక్రవారం గూళూరు చెరువులో బోట్‌పై వెళ్లి 11 కేవీ స్తంభం వద్ద లైన్‌కు మరమ్మతులు చేసి విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. విద్యుత్తు సరఫరా పునరుద్ధరణకు సిబ్బంది చేసిన కృషిని స్థానికులు కొనియాడారు.

- వడమాలపేట, ఆంధ్రజ్యోతి

రేణిగుంట ఇన్‌చార్జి సబ్‌రిజిస్ట్రార్ సస్పెన్షన్

రేణిగుంట, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఓ స్థలం రిజిస్ట్రేషన్ వ్యవహారంలో రేణిగుంట ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ రాజేష్ సస్పెండయ్యారు. ఈ మేరకు చిత్తూరు జిల్లా ఇన్‌స్పెక్టర్ జనరల్ గిరిబాబు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో ఇన్‌చార్జిగా సీనియర్ అసిస్టెంట్ ప్రవీణ్‌కుమార్‌ను నియమించారు. రేణిగుంట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అవకతవకలపై అందిన ఫిర్యాదుల మేరకు ఇటీవల రిజిస్ట్రేషన్ శాఖ అదనపు ఐజీ ఉదయ్‌భాస్కర్ మూడు రోజులపాటు సమగ్ర విచారణ జరిపిన విషయం తెలిసిందే. నిబంధనలకు విరుద్ధంగా జరిగిన రిజిస్ట్రేషన్ల వివరాలతో ఉన్నతాధికారులకు నివేదిక అందించారు. వాటి ఆధారంగా ఇన్‌చార్జి సబ్‌రిజిస్ట్రార్ రాజేష్‌ను సస్పెండ్ చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఇక్కడ పనిచేసే అధికారులు ఒకరి తర్వాత మరొకరు తాము చేసిన తప్పులకు సస్పెండవుతుండటం చర్చనీయాంశంగా మారింది. కాగా, గతంలో ఇక్కడ సబ్‌రిజిస్ట్రార్‌గా పనిచేసి సస్పెండైన ఓ అధికారి మళ్లీ పోస్టింగ్ కోసం విశ్వప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది.

ఘనంగా చొక్కాణి ఉత్సవం



వెలుగుతున్న చొక్కాణి

శ్రీకాళహస్తి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలోని మహానంది వద్ద శుక్రవారం రాత్రి చొక్కాణి ఉత్సవం వేడుకగా జరిగింది. గురువారం రాత్రి కలశస్థాపనతో వేదపండితులు క్రతువును ప్రారంభించారు. కలశస్థాపన అనంతరం బాలాదీపాలను అమ్మవారి సన్నిధి వద్ద వెలిగించి స్వామి సన్నిధి వద్దభద్రపరిచారు. శుక్రవారం రాత్రి వరకు బాలాదీపాలను నిరంతరాయంగా వెలిగేలా ఏర్పాటు చేశారు. శుక్రవారం ఉదయం తాటిచెట్టును మహానంది వెనుకవైపున దారాలతో లాగి నిలబెట్టారు. దీని చుట్టూ తాటాకు మట్టలను కప్పారు. రాత్రి ఆలయం నుంచి బాలాదీపాలను ఊరేగింపుగా తాటిచెట్టు వరకు తీసుకొచ్చి ప్రదక్షిణలు చేశారు. ప్రత్యేక పూజల అనంతరం చొక్కాణిని వెలిగించారు. చొక్కాణి జ్యోతి అఖండ ప్రజ్వలనతో ప్రకాశించింది. ఇందులోని భస్మాన్ని ఈశ్వరప్రసాదంగా భావించి భక్తులు పోటీపడి ఇళ్లకు తీసుకెళ్లారు. ఈవో బాపిరెడ్డి, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ఊరేగింపుగా వస్తున్న స్వామి అమ్మవార్లు

నేడు తిరుపతిలో ఏపీఈఆర్‌సీ చైర్మన్ సమావేశం

తిరుపతి(ఆటోనగర్), డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): తిరుపతి విద్యుత్ సర్కిల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో శనివారం ఏపీఈఆర్‌సీ చైర్మన్ టి.రామ సింగ్ అధ్యక్షతన సమావేశం నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. విద్యుత్ సంస్థ ఆర్థికాభివృద్ధికి సంబంధించిన అంశాలపై సమీక్షించనున్నట్లు వివరించారు.



నేడు నీటి సంఘాల ఎన్నికలు


- 610 సంఘాలు.. 1,94,268 మంది ఓటర్లు

తిరుపతి(ఉపాధ్యాయనగర్), డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సాగునీటి సంఘాల ఎన్నికలకు రంగం సిద్ధమైంది. జిల్లాలో 610 సంఘాలకు ఎన్నికలు నిర్వహించేందుకు బుధవారం కలెక్టర్ నోటిఫికేషన్ విడుదల చేశారు. ఆమేరకు శనివారం అన్ని కమిటీలకు ఎన్నిక నిర్వహించేందుకు నీటిపారుదల శాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. సంఘాల అధ్యక్ష కార్యదర్శులను ఎన్నుకోనున్నారు. క్షేత్ర స్థాయిలో సమస్యలు తలెత్తకుండా వీలైనంత వరకు ఏకగ్రీవంగా ఎన్నికలను పూర్తిచేసేందుకు జలవనరుల శాఖ అధికారులు ప్రయత్నిస్తున్నారు. జిల్లాలోని 33 మండలాల్లో మొత్తం 610 నీటి సంఘాలు ఉన్నాయి. వీటిలో మైనర్ ఇరిగేషన్‌కు చెందిన సంఘాలు 599 కాగా సంఘాలు ప్రాజెక్టులకు చెందినవి 11 ఉన్నాయి. ఇందులో అరణియార్ ప్రాజెక్ట్ కింద 5, స్వర్ణముఖి కింద 6 ఉన్నాయి. శనివారం ఉదయం ఎనిమిది నుంచి ఎన్నికలు జరగనున్నాయి. 18 ఏళ్లు నిండి, పట్టా భూమి తమ పేరున కలిగి ఉండటంతోపాటు నీటి తీరువాలో ఎలాంటి బకాయిలు లేనివారే ఓటర్లుగా ఉంటారు. అలా జిల్లాలో 1,94,263 మంది ఓటర్లు ఉండగా.. వీరిలో పురుషులు 1,32,156, మహిళలు 62,107 మంది. సుమారు తొమ్మిదేళ్ల తర్వాత నీటి సంఘాల ఎన్నికలు జరుగుతుండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

తిరుపతి(కలెక్టరేట్), ఆంధ్రజ్యోతి: సాగునీటి సంఘాల ఎన్నికలు పారదర్శకంగా చేపట్టాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం వర్చువల్ విధానంలో ఆయన జిల్లా అధికారులతో సమీక్షించారు. పక్షపాతం, అవకతవకలకు తావు లేకుండా ఎన్నికలు నిర్వహించాలన్నారు.

నేడు అన్ని పాఠశాలలకు సెలవు

తిరుపతి(విద్య), ఆంధ్రజ్యోతి: జిల్లాలోని అన్ని పాఠశాలలకు రెండో శనివారం సెలవు దినంగా డీఈవో కేవీఎన్ కుమార్ ప్రకటించారు. అలాగే, నీటి సంఘాల ఎన్నికలకు చాలా ప్రాంతాల్లో పాఠశాలల భవనాలే పోలింగ్ కేంద్రాలుగా ఉన్నందున సెలవు ప్రకటించినట్టు తెలుస్తోంది.





వామ్మో..!

తిరుమల శ్రీవారిసేవసదన్ వెనుకభాగంలోని గార్డెన్‌లో శుక్రవారం ఈ భారీ నాగు పాము పట్టుబడింది. పామును గుర్తించిన గార్డెన్ సిబ్బంది పాములు పట్టే భాస్కర్‌నాయుడికి సమాచారం ఇచ్చారు. చాకచక్యంగా దీనిని పట్టుకున్న ఆయన, ఆ తర్వాత అడవిలో విడిచిపెట్టారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి





అక్కగార్లకు కార్తీక పూజలు

తిరుమల మొదటి ఘాట్‌రోడ్డులోని అక్కగార్లకు శుక్రవారం ఉదయం టీటీడీ రవాణా విభాగం ఆధ్వర్యంలో కార్తీకమాస పూజ జరిగింది. డ్రైవర్లు, స్థానికులు కలిసి అక్కదేవతల ఆలయాన్ని శోభాయమానంగా అలంకరించారు. అనంతరం టీటీడీ రవాణా విభాగం అధికారులు, సిబ్బంది సారె సమర్పించారు. కనుమరోడ్లలో భక్తులు సురక్షితంగా ప్రయాణాలు సాగించేలా అనుగ్రహించాలని అక్కదేవతలను ప్రార్థించారు. టీటీడీ లా ఆఫీసర్ వరప్రసాద్‌రావు, డిప్యూటీ ఈవోలు రాజేంద్ర, ఆశాజ్యోతి పాల్గొన్నారు. - తిరుమల, ఆంధ్రజ్యోతి

తిరుమలలో రేపు కార్తీకదీపోత్సవం

పౌర్ణమిగరుడసేవ రద్దు

తిరుమల శ్రీవారి ఆలయంలో ఈనెల 15న కార్తీక పౌర్ణమి నాడు దీపోత్సవం జరుగుతుంది. శ్రీవారికి సాయంకాల కైంకర్యాలు, నివేదనలు పూర్తయిన తర్వాత నేతి వత్తులతో దీపాలను వెలిగించి ఛత్రచామర, మంగళవాయిద్యాలతో ఊరేగింపుగా విమాన ప్రదక్షిణం చేస్తూ ఆనంద నిలయంలోని శ్రీవారికి హారతి ఇస్తారు. ఈ తర్వాత వరుసగా గర్భాలయంలో అఖండం, కులశేఖరపడి, రాములవారి మేడ, ద్వార పాలకులు, గరుడ్వాళ్వారు, వరదరాజస్వామి, వకుళమాత, బంగారుబావి, కల్యాణమండపం, సభ అర, తాళ్లపాక అర, భాష్యకారుల సన్నిధి, యోగనరసింహస్వామి, విష్వక్సేనులు, చందనం అర, పరిమళ అర, వెండివాకిలి, ధ్వజస్తంభం, బలిపీఠం, క్షేత్రపాలకుల సన్నిధి, తిరుమలరాయమండపం, పూలబావి, రంగనాయక మండపం, మహాద్వారం, బేడి ఆంజనేయస్వామి, శ్రీవరాహస్వామిఆలయం, స్వామి పుష్కరిణి వద్ద దీపాలను వెలిగిస్తారు. ఈసందర్భంగా సహస్ర దీపాలంకారసేవను, పౌర్ణమి గరుడసేవను టీటీడీ రద్దు చేసింది.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



దర్శనానికి 15 గంటలు

తిరుమల వేంకటేశ్వర స్వామి దర్శనానికి 15 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 17 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులూ, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులూ వేచి ఉన్నారు.

బుధవారం నాటి హుండీ ఆదాయం: రూ.3.85 కోట్లు

గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 61,178

తలనీలాలు సమర్పించినవారు: 22,464

చదువులమ్మ కన్నుమూత



పద్మావతి కాలేజీ రూపశిల్పి రాజేశ్వరీమూర్తి మృతి

104వ పుట్టిన రోజు జరుపుకున్న మూడు రోజులకే న్యూయార్క్‌లో ఆఖరిశ్వాస

తిరుపతి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని పద్మావతి మహిళా కళాశాల రూపశిల్పి రాజేశ్వరీ మూర్తి శుక్రవారం కన్నుమూశారు. ఈనెల 10న న్యూయార్క్‌లోని తన ఇంట్లో 104వ పుట్టినరోజును జరుపుకున్న ఆమె రెండు రోజుల కిందట అస్వస్థతకు గురయ్యారు. అక్కడి ఆసుపత్రిలో భారత కాలమానం ప్రకారం శుక్రవారం సాయంత్రం 4.30 గంటలకు కన్నుమూశారు. ఆంధ్రప్రదేశ్‌లో తొలి మహిళా కళాశాల రూపశిల్పిగా ఆమె కృషి ఎనలేనిది. టీటీడీ ఆధ్వర్యంలో 1952లో పద్మావతీ మహిళాకళాశాల ప్రారంభం అయింది. 1954లో కళాశాల ప్రిన్సిపాల్‌గా కాకినాడకు చెందిన రాజేశ్వరీ మూర్తి నియమితులయ్యారు. 22 ఏళ్ల పాటు ఈ బాధ్యతల్లో ఉన్న ఆమె అందించిన సేవలు అనన్యసామాన్యమైనవి. కళాశాల భవనాల నిర్మాణం మొదలు, లైబ్రరీ, లేబరేటరీ, హాస్టళ్ల దాకా ప్రతిదీ ఆమె కనుసన్నల్లో ఏర్పాటయ్యాయి. పద్మావతి కాలేజీలో చదువుకున్న వందలాది మంది విద్యార్థులు వివిధరంగాల్లో అత్యున్నత స్థానాల్లో ఉన్నారంటే దాని వెనుక ఈమె కృషే కనిపిస్తుంది.



అమెరికాలో 104వ పుట్టిన రోజు వేడుకల్లో రాజేశ్వరీమూర్తి

ఆఖరి కోరిక తీరకుండానే..

రాజేశ్వరీమూర్తి మృతితో ఆమె శిష్యులు కన్నీటితో ఆమె జ్ఞాపకాలు తలపోసుకుంటున్నారు. "పద్మావతి కాలేజి అంటే రాజేశ్వరీమూర్తికి ప్రాణం. అమెరికాలో ఉన్నా ఆమె పద్మావతి కాలేజీనే కలవరించేవారు. ఇక్కడి విశేషాలు ఎప్పటికప్పుడు తెలుసుకునేవారు. ఒక్కసారి అక్కడికి రావాలని ఉంది అని ఇటీవలే నాతో చెప్పారు. అది ఆమె ఆఖరి కోరిక. తీరకుండానే వెళ్లిపోయారు' అని ఆమె శిష్యురాలు ప్రేమావతి గుర్తు చేసుకున్నారు.

గొప్ప విద్యావేత్త : ఆడవాళ్లకు చదువులెందుకు అనే రోజుల్లో కాకినాడకు చెందిన రాజేశ్వరీమూర్తి పీయూసీ చేశారు. ఆ తర్వాత చదువు సాగలేదు. మద్రాసు ప్రెసిడెన్సీ కాలేజీలో ప్రొఫెసర్‌గా చేస్తున్న మూర్తితో పెళ్లయ్యాక, ఆయన ప్రోత్సాహంతో చదువు కొనసాగించారు. బీఎస్సీ ఆనర్స్ చేసి అదే కాలేజీలో గణిత బోధకురాలిగా చేరారు. అప్పటి టీటీడీ చైర్మన్ చెలికాని అన్నారావు ఆహ్వానం మేరకు ఆమె పద్మావతీ కాలేజి ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరించారు. 1976 దాకా పద్మావతిలోనే పనిచేశారు. వీరికి పిల్లలు లేరు. భర్త చనిపోయాక అమెరికాకు వెళ్లారు. కొలంబియా విశ్వవిద్యాలయంలో పోస్ట్ డాక్టొరల్ చేశారు. 'కమ్యూనిటీ కాలేజెస్ ఆఫ్ ఇండియా' అనే అంశంపై పరిశోధన చేశారు. అమెరికాలోని యునైటెడ్ నేషన్స్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ కేంద్రంలో రిజిస్ట్రార్‌గా రిటైరయ్యారు. అమెరికా పౌరులకు మాత్రమే ఇచ్చే బెస్ట్ అడ్మినిస్ట్రేటర్ అవార్డును ఆమె అందుకున్నారు.

జలపాతాల సవ్వడి




తిరుమల కొండల్లో ..

రెండురోజులుగా కురిసిన వానలకు తిరుమల కొండల్లోంచి జాలువారుతున్న నీటి ధారలు.. భక్తులకు కనువిందుగా మారాయి. మొదటి ఘాట్ రోడ్డులో తిరుమల నుంచి తిరుపతికి ప్రయాణించేవారికి ఇవి కనిపిస్తాయి. అవ్వాచారికోన లోయ వెంబడి ఉన్న కొండలపై నుంచి జాలువారుతున్న నీటి ధారల్లో కాలినడక భక్తులు తడిచి ఆనందిస్తున్నారు. వాహనాల్లో ప్రయాణించేవారు ఈ అందాలను చూసి ముగ్ధులవుతున్నారు. తిరుపతి సమీపించే సమయంలో మాల్వాడిగుండం హోరు ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. జలపాత తుంపర్లు వానలా ప్రయాణీకులను తడుపుతున్నాయి. అలిపిరి దాటి దిగాక కపిలతీర్థం స్వాగతం పలుకుతోంది.

- తిరుమల, ఆంధ్రజ్యోతి







వెయ్యిలింగాలకోనలో..

శ్రీకాళహస్తిలో పలుచోట్ల జలపాతాలు పరవళ్లు తొక్కుతున్నాయి. వేడాంలోని వెయ్యిలింగాలకోన వద్ద కైలాసపర్వతాల నుంచి గంగమ్మ ఉధృతంగా కిందకు దూకుతూ చూపరులను అబ్బుర పరుస్తోంది. చిన్నమిట్టకండ్రిగ భైరవకోనలో కొండలనుంచి జలం కిందకు దూకుతోంది. కోనపై కొండల నుంచి గంగాజలం శివలింగాన్ని అభిషేకిస్తున్న దృశ్యాలను భక్తులు ఆసక్తికరంగా వీక్షిస్తున్నారు. శ్రీకాళహస్తి శివార్లలోని రాజీవ్‌నగర్ వద్ద హరహర తీర్థం జలపాతం వద్ద యువత స్నానాలు చేస్తూ ఉల్లాసంగా గడిపారు.

- శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి





వెయ్యిలింగాలకోన - రాజీవ్‌నగర్ వద్ద హరహర తీర్థం

మురిసిన చెంచురాజుకండ్రిగ



స్వగ్రామంలోని ఇంటి ముందు గ్రామస్తుల సంతోషం

పిచ్చాటూరు, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రపంచ చెస్ ఛాంపియన్‌గా నిలిచిన యంగ్ ఇండియన్ సొంతూరు చెంచురాజుకండ్రిగ మురిసిపోయింది. స్థానికుల్లో ఆనందం వెల్లివిరిసింది. పిచ్చాటూరు మండలం చెంచురాజు కండ్రిగకు చెందిన ఈఎన్‌టీ సర్జన్ రజనీకాంత్, మైక్రో బయాలజిస్టు పద్మ దంపతులు చెన్నైలో స్థిరపడ్డారు. వీరి కుమారుడు గుకేష్ చిన్నప్పటి నుంచీ చలాకీగా ఉంటూ.. చదరంగంపై ఉన్న ఆసక్తితో 12 ఏళ్లకే గ్రాండ్ మాస్టర్‌గా చరిత్ర సృష్టించాడు. ఇప్పుడు వరల్డ్ చెస్ చాంపియన్ అయిన గుకేష్. తమ గ్రామస్తుడు కావడం గర్వంగా ఉందంటూ స్థానికులు వారి ఇంటి ముందు సంబరాలు చేసుకున్నారు.

గుజరాత్‌లో గోడౌన్లపై టాస్క్‌ఫోర్స్ దాడి

● రూ.2 కోట్ల విలువైన ఎర్రచందనం దుంగలు స్వాధీనం

మంగళం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం అక్రమ రవాణాకు స్మగ్లర్లు కొత్తగా రూట్లు మారుస్తున్నారు. గతంలో బెంగళూరు, చెన్నై, వెస్ట్ బెంగాల్ మీదుగా స్మగ్లింగ్ జరిగేది. ఇప్పుడు గుజరాత్‌ను ఎంచుకున్నారు. ఈ క్రమంలో ఇక్కడి నుంచి వెళ్లిన టాస్క్‌ఫోర్సు పోలీసులు గుజరాత్ రాష్ట్రం పటాన్‌లో గోడౌన్లపై శుక్రవారం దాడి చేశారు. 4.5 టన్నుల బరువైన 155 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. ఇక్కడికి అందిన సమాచారం మేరకు తిరుపతి టాస్క్‌ఫోర్సు ఇన్‌చార్జి ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు డీఎస్పీ షరీఫ్ బృందం గుజరాత్ వెళ్లి పటాన్ పోలీసుల సహకారంతో దాడులు చేశారు. ఉత్తమ కుమార్, హన్సిరాజ్, పరదేశి ప్రధాన నిందితులుగా గుర్తించారు. పట్టుబడిన ఎర్రచందనం విలువ రెండు కోట్లు ఉంటుందని అంచనా వేస్తున్నారు. పట్టుబడ్డ ఎర్రచందనాన్ని తిరుపతి టాస్క్‌ఫోర్స్ కార్యాలయానికి తరలించేందుకు సిద్ధం చేస్తున్నారు.

వేదంతోనే లోక సంరక్షణ

కంచి మఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): వేదంతోనే లోక సంరక్షణ సాధ్యమని కంచి మఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి పేర్కొన్నారు. తిరుపతి బ్రాహ్మణ సమాజం ఆధ్వర్యంలో 44వ వార్షిక వేద విద్వాన్ మహాసభలు కంచి మఠంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర విజయేంద్ర సరస్వతి అనుగ్రహ భాషణం చేశారు. సనాతన ధర్మానికి వేదమే మూలమన్నారు. లోక సంరక్షణ జరగాలంటే, వేద పరిరక్షణ అవసరమని అభిప్రాయపడ్డారు. వేదంలో వేద భావం మాత్రమే ఉంటుందనీ, బేధ భావం ఉండదని స్పష్టం చేశారు. కుటుంబ వ్యవస్థ బాగా ఉండాలంటే విశాల దృక్పథంతో వేద మార్గాన్ని అనుసరించాలని కోరారు. ధర్మ ప్రచారం కోసం టీటీడీ వంటి మరింత గట్టి కృషి చేయాలని సూచించారు. టీటీడీ ధర్మకర్తల మండలి సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ.. హిందూ ధర్మ పరిరక్షణకు, సనాతన వైదిక ధర్మ రక్షణకు టీటీడీ తరపున రూ.25 కోట్ల శాశ్వత నిధి ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. వేదం చదువుకున్న సుమారు 500 మంది విద్యార్థులకు శంకర విజయేంద్ర సరస్వతి చేతుల మీదుగా సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ నేత సైకం జయచంద్రారెడ్డి తిరుపతి బ్రాహ్మణ సమాజానికి రూ.9 లక్షల విరాళాన్ని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో జాతీయ సంస్కృత వర్సిటీ వీసీ ప్రొఫెసర్ జీఎస్ఆర్ కృష్ణమూర్తి, సూర్యనారాయణ, శివ సుబ్రమణ్యావధాని, యజ్ఞేశ్వరయాజులు, బ్రాహ్మణ సమాజ అధ్యక్షుడు వెంకటాచలం, ప్రధాన కార్యదర్శి కొత్తపల్లె అజయ్‌కుమార్, భీమాస్ బాలాజీ, వెంకట పెరుమాళ్, రామశర్మ, భీమాస్ అశోక్, ప్రభాకర్, హరి, ప్రొఫెసర్ చక్రవర్తి రాఘవన్, వేద విద్యార్థులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జయేంద్ర

షార్‌లో వేగంగా గగన్‌యాన్ పనులు

సూళ్లూరుపేట, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): గగన్‌యాన్ ప్రయోగానికి శ్రీహరికోట రాకెట్ కేంద్రంలో ఏర్పాట్లు వేగంగా జరుగుతున్నాయి. తొలుత మానవరహిత ప్రయోగం చేపట్టనున్నారు. ఒక రోబోను అంతరిక్షంలోకి పంపి సురక్షితంగా భూమిమీదకు తీసుకువస్తారు. ఈ ప్రయోగం జనవరిలో జరిగే అవకాశం ఉంది. ఇందుకోసం హెచ్‌ఎల్‌వీఎం3-జీ 1 రాకెట్‌ను సిద్ధం చేస్తున్నారు. ఈ రాకెట్‌లో కీలకమైన దశలో వినియోగించే ఎస్200 సాలిడ్ మోటారు సెగ్మెంట్‌ను రాకెట్ అసెంబ్లీంగ్ బిల్డింగ్‌కు శుక్రవారం తరలించారు. షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ పచ్చజెండా ఊపి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అన్ని దశల అనుసంధాన పనులు పూర్తయ్యాక రాకెట్ సంసిద్ధత సమావేశంలో ప్రయోగ తేదీని నిర్ణయిస్తారు.



ఎస్200 సాలిడ్ మోటారు సెగ్మెంట్



షార్ డైరెక్టర్ రాజరాజన్ జెండా ఊపడంతో అనుసంధాన భవనానికి తరలుతున్న హెచ్‌ఎల్‌వీఎం3-జీ 1 రాకెట్

ఎస్వీ వైద్య కళాశాలకు వాహనం వితరణ



వెంకట్‌కు వాహనం అందజేస్తున్న బ్యాంకు జీఎం భాస్కర్‌రావు

తిరుపతి(వైద్యం), డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో క్యాన్సర్‌పై అవగాహన కల్పించేందుకు ఎస్వీ వైద్య కళాశాలకు అవసరమైన రూ.20 లక్షల విలువచేసే 12 సీట్ల ఫోర్స్ వాహనాన్ని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(యూబీఐ) వారు శుక్రవారం అందించారు. యూబీఐ బ్యాంకు జనరల్ మేనేజరు సీవీఎన్ భాస్కర్‌రావు వాహనాన్ని కళాశాల ఆవరణలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వెంకట్‌కు అందజేశారు. బ్యాంకు సిబ్బందికి వెంకట్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో యూబీఐ రీజనల్ డైరెక్టర్ రామప్రసాద్, మేనేజరు స్వాతి, వైద్యులు డీఎస్ఎన్ మూర్తి, సునీత పాల్గొన్నారు.

రేపు కేంద్రమంత్రి గిరిరాజ్‌సింగ్ రాక

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): కేంద్ర చేనేత, జౌళి శాఖ మంత్రి గిరిరాజ్‌సింగ్ రెండు రోజుల పర్యటన నిమిత్తం ఆదివారం జిల్లాకు విచ్చేస్తున్నారు. ఉదయం ఢిల్లీ నుంచి విమానంలో బయలుదేరి తిరుపతి విమానాశ్రయానికి చేరుకుంటారు. 10 గంటలకు ఆర్‌సీపురం మండలం రామాపురం వద్ద ఉన్న సిద్ధేశ్వర బ్రహ్మరుషి ఆశ్రమాన్ని సందర్శిస్తారు. అక్కడి నుంచి పద్మావతి అతిథిగృహానికి వచ్చి విశ్రాంతి తీసుకుంటారు. 3 గంటలకు చేనేత శాఖ రీజనల్ అధికారులతో సమీక్ష నిర్వహిస్తారు. సాయంత్రం స్థానిక కార్యక్రమాల్లో పాల్గొని రాత్రికి పద్మావతి అతిథిగృహానికి చేరుకుంటారు. సోమవారం వేకువజామున 3 గంటలకు సిద్ధేశ్వర బ్రహ్మరుషి ఆశ్రమం చేరుకుని అక్కడి కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఉదయం 7 గంటలకు తిరుపతి విమానాశ్రయం నుంచి ఢిల్లీకి బయలుదేరుతారు.

ల్యాబ్ టెక్నీషియన్, డేటా మేనేజరు పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(వైద్యం), డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ వైద్య కళాశాలలో ఏడాది పాటు కాంట్రాక్టు ప్రాతిపదికన పనిచేసేందుకు ల్యాబ్ టెక్నీషియన్, డేటా మేనేజరు పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ చంద్రశేఖరన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నాన్ కమ్యూనికబుల్ డిసీస్ కంట్రోల్, యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్(ఏఎంఆర్) సర్వేలన్స్ ప్రోగ్రాం కింద ఏడాదిపాటు కాంట్రాక్టు కింద పనిచేసేందుకు అర్హులు ఈనెల 26 తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు కళాశాల వెబ్‌సైట్‌ను సందర్శించాలని పేర్కొన్నారు.

ఎరువుల దుకాణాలపై విజిలెన్సు దాడులు

ఎనిమిది దుకాణాల్లో విక్రయాల నిలిపివేత



ఎరువుల దుకాణాల్లో తనిఖీలు చేస్తున్న విజిలెన్సు అధికారులు

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారులు శుక్రవారం దాడులు చేశారు. విజిలెన్సు సీఐలు వెంకటరవి, చంద్రశేఖర్, ఎస్.చంద్రశేఖర్, ఏజీ ధనంజయ టీములుగా విడిపోయి ఏకకాలంలో తిరుపతి, సదుం, పుంగనూరు, ఏర్పేడు, రొంపిచెర్ల తదితర ప్రాంతాల్లోని 20 దుకాణాలపై దాడులు చేశారు. స్టాకు, సేల్స్ రిజిస్టర్లను పరిశీలించారు. లైసెన్సులు ఉన్నాయా లేదా ఆరా తీశారు. స్టాకులో తేడాలుండడంతో రొంపిచెర్లలో రెండు, ఏర్పేడులో రెండు, తిరుపతిలో ఒకటి, సదుంలో రెండు, పుంగనూరులో ఒక దుకాణంలో విక్రయాలు ఆపేశారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ రైతులకు కాకుండా పక్కదారి పట్టించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

వ్యవసాయ కళాశాలకు బాంబు బెదిరింపు



తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో ఇటీవల బాంబు బెదిరింపు ఈ మెయిల్స్ ఆందోళన కలిగిస్తున్నాయి. హోటళ్లకు వరసగా ఐఎస్ఐ ఉగ్రవాదుల పేరిట మెయిల్స్ వచ్చిన విషయం తెలిసిందే.తాజాగా శుక్రవారం మధ్యాహ్నం వ్యవసాయ కళాశాలకు బాంబు బెదిరింపు ఈ-మెయిల్ వచ్చింది. కళాశాలలో బాంబులు ఉన్నట్లు అందులో పేర్కొన్నారు. కళాశాల అధికారులు వెంటనే చంద్రగిరి డీఎస్పీకి, తిరుపతి రూరల్ సీఐ చిన్నగోవిందుకు సమాచారమిచ్చారు. హుటాహుటిన బాంబు డిస్పోజల్, డాగ్ స్క్వాడ్లు రంగంలోకి దిగాయి. ప్రిన్సిపల్, డీన్, రెక్టార్ చాంబర్లు, పరిపాలనా భవనం, హాస్టల్ గదులు, పరిసరాలను తనిఖీ చేశారు. కళాశాలకు దాదాపు మూడు కిలోమీటర్ల పరిధిలో తనిఖీలు చేసి బాంబు బెదిరింపు మెయిల్ నకిలీవని నిర్ధారించారు. దీంతో అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులు, సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు. కాగా, నెల రోజుల వ్యవధిలో తిరుపతిలోని దాదాపు ఐదారు స్టార్ హోటళ్లకు బాంబు బెదిరింపు మెయిల్స్ వచ్చిన విషయం తెలిసిందే. అప్పట్లోనూ తనిఖీలు చేసి బాంబులు లేవని నిర్ధారించారు. ఇప్పుడు వ్యవసాయ కళాశాలకు బెదిరింపు మెయిల్ రావడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు.

చంద్రబాబు రైతు వ్యతిరేకి

- కలెక్టరేట్ వద్ద వైసీపీ ఆందోళన -



తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): అధికారంలోకి రాగానే ప్రతియేటా రైతులకు పెట్టుబడి సాయం కింద రూ.20వేలు ఇస్తామని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం, దానిని తుంగలో తొక్కిందని ఉమ్మడి చిత్తూరు జిల్లా వైసీపీ అధ్యక్షుడు భూమన కరుణాకర్‌రెడ్డి విమర్శించారు. 'అన్నదాతకు అండగా' అనే పేరుతో వైసీపీ అధిష్టానం పిలుపు మేరకు తిరుపతి జిల్లా కలెక్టరేట్ వద్ద ఆ పార్టీ నేతలు శుక్రవారం ధర్నా చేపట్టారు. ఈ నిరసన కార్యక్రమంలో కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ, చంద్రబాబు రైతు వ్యతిరేకి అన్నారు. ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ పథకాలంటూ వాగ్దానాలు చేసి ఆతర్వాత పట్టించుకోలేదని అన్నారు. అబద్ధపు హామీలు ఇవ్వలేకే జగన్‌అధికారం కోల్పోయారని చెప్పారు. రైతుల పక్షాన పోరాటం చేస్తామంటూ, అవసరమైతే జైలుకు వెళతామన్నారు. మాజీ ఎమ్మెల్యే నారాయణస్వామి మాట్లాడుతూ చంద్రబాబు మోసకారి అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం, తిరుపతి మేయర్ శిరీష, శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, అభినయ్‌రెడ్డి, మోహిత్‌రెడ్డి, నూకతోటి రాజేష్ పాల్గొన్నారు. అనంతరం డీఆర్వో నరసింహులు వినతిపత్రం అందజేశారు.

రైతుల్లేని కార్యక్రమం

అన్నదాతలకు అండగా అంటూ వైసీపీ చేపట్టిన కార్యక్రమంలో రైతులు మాత్రం కనిపించలేదు. కాలేజీ విద్యార్థులను తరలించుకు వచ్చారు. పట్టణంలోని కొందరు మహిళలను కూడా ఎన్నికల సమయంలో తరలించినట్లుగా తీసుకువచ్చి నిలబెట్టారు. ఎందుకు ఈ నిరసన కార్యక్రమం అని అడిగితే, చాలా మంది చెప్పలేకపోయారు. తమను తీసుకువస్తే వచ్చామని చెప్పారు.

పలువురు ఇన్‌ఛార్జులు డుమ్మా

భారీ కార్యక్రమం అంటూ పిలుపు ఇచ్చానా తిరుపతి జిల్లాలో పలు నియోజకవర్గాలకు చెందిన వైసీపీ ఇన్‌ఛార్జిలు ఈ నిరసన కార్యక్రమానికి డుమ్మా కొట్టారు. మాజీ మంత్రి రోజా, నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, సూళ్ళూరుపేట సంజీవయ్య, గూడూరు నుంచి మేరుగ మురళి ధర్నాకు రాలేదు. కార్యకర్తలు కూడా పలుచగా కనిపించారు. మరోవైపు మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కూడా పాల్గొనలేదు. పార్లమెంటు సమావేశాల కారణంగా తిరుపతి ఎంపీ గురుమూర్తి హాజరవలేదు.

సూళ్లూరుపేటను ముంచిన కాళంగి

జాతీయ రహదారిపైకి చేరిన వరదనీరు ● జలదిగ్బంధంలో వట్రపాలెం





చెరువును తలిపిస్తున్న వట్రపాలెం - జాతీయ రహదారిపై చేరిన వరదనీటిలో నెమ్మదిగా వెళుతున్న వాహనాలు

సూళ్లూరుపేట, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో రెండు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు తోడు ఎగువ కాళంగి రిజర్వాయర్ గేట్లు ఎత్తివేయడంతో పట్టణ పరిసర ప్రాంతాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. కాళంగి నదికి భారీగా వరదనీరు చేరడంతో నది పరివాహక ప్రాంతమైన వట్రపాలెం జలదిబ్బంధంలో చిక్కుకొంది. ఇళ్లను వరదనీరు చుట్టుముట్టడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. స్థానికులను వట్రపాలెం జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలోని పునరావాస కేంద్రానికి తరలించారు. అదేవిధంగా మన్నారుపోలూరు రోడ్డు మోకాటి లోతు నీరుచేరడంతో రాకపోకలు స్తంభించాయి. కాళంగి ఉధృతికి ఆర్టీసీ డిపో సమీపంలో గోకులకృష్ణ కళాశాల వద్ద జాతీయ రహదారిపైకి భారీగా వరదనీరు చేరింది. పోలీసులు, హైవే సిబ్బంది అక్కడకు చేరుకొని భారీగేట్లు ఏర్పాటు చేసి వాహనాల రాకపోకలను నెమ్మదిగా సాగించారు. వరదనీరు పెరగుతుండడంతో ఎక్స్‌కవేటర్లతో కళాశాల రోడ్డుకు గండికొట్టి నీటిని అటువైపు మళ్లించారు. మధ్యాహ్నం వరకు జాతీయ రహదారిపై వరదనీరు పారుతుండడంతో వాహనదారులు అవస్థలు పడ్డారు. శ్రీసిటీ, మాంబట్టు పరిశ్రమలకు నైట్ డ్యూటీలకు వెళ్లిన కార్మికులు శుక్రవారం ఉదయం మన్నారుపోలూరుకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. సాయంత్రం 4 గంటలకు వరద ఉధృతి తగ్గడంతో మోటారు సైకిళ్లు, ఇతర వాహనాల్లో గమ్యానికి చేరారు. కాళంగికి ఒక్కసారిగా వరదనీరు రావడంతో పరిసర ప్రాంతాలే కాకుండా మన్నారుపోలూరు, పడమటి కండ్రిగ, ఎన్‌వీ కండ్రిగ, గోపాల్ రెడ్డిపాలెం ప్రాంతాల్లో వరిపైర్లు నీటి మునిగాయి. చెంగాళమ్మ ఆలయ సమీపంలో కాళంగి నది పక్కనే ఉన్న గోశాల ప్రాంతమంతా వరదనీటిలో మునిగింది. వారం వ్యవధిలోనే మరోసారి సూళ్లూరుపేటను వరదనీరు ముంచెత్తడంతో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. జాతీయ రహదారిపై చేరిన వరదనీటిని, వట్రపాలెం ప్రాంతాలను ఆర్డీవో కిరణ్మయి అధికారులతో కలిసి పరిశీలించి జాగ్రత్త చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం పునరావాస కేంద్రంలో ఉన్న వరద బాధితులతో మాట్లాడి కమిషనర్ చిన్నయ్యను అధికారులకు పలు సూచనలు చేశారు.

కాళంగి ఉగ్రరూపం

వందలాది ఎకరాల నీట మునక



తనియాలి వంతెనపై వరదనీరు

దొరవారిసత్రం, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): గత రెండు రోజుల పాటు కురిసిన వర్షాలకు తోడు కాళంగి రిజర్వాయర్ గేట్లు ఎత్తి 600 క్యూసెక్కుల నీటిని విడుదల చేయడంతో నది ఉగ్రరూపం దాల్చింది. కాళంగి వరద ప్రవాహంతో నదీ పరివాహ ప్రాంతాల్లో వందలాది ఎకరాలు నీటమునిగాయి. మండల పరిధిలో వెదురుపట్టు, తుంగమడుగు, బూదూరు, తనియాలి, మావిళ్లపాడు, అక్కరపాక, తల్లంపాడు ప్రాంతాల్లో నదికి ఇరువైపులా వరి పొలాలు వరదనీటితో కప్పబడిపోయాయి. కాళంగి వరద ప్రవాహంతో తనియాలి వద్ద ఉన్న వంతెన శుక్రవారం సాయంత్రానికి కూడా బయటపడలేదు. పాలకాలువ వరద ప్రవాహంతో కుప్పారెడ్డిపాలెం వద్ద వెదురుపట్టు రోడ్డులో ఉన్న వంతెనపై నీటి ప్రవాహం కొనసాగుతూనే ఉంది.

వరద బాధితులకు అండగా ఉంటాం: విజయశ్రీ

సూళ్లూరుపేట, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): వరద బాధితులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. శుక్రవారం ఆమె పార్టీ నాయకులతో కలిసి ముంపునకు గురైన వట్రపాలెం ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం పునరావాస కేంద్రంలో ఉన్న వరద బాధితులను పరామర్శించి వారికి ఆహార పొట్లాలను అందజేశారు. ఎవరూ అధైర్య పడొద్దని, అన్ని విధాలా ఆదుకొంటామన్నారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్, పార్థసారధి, సురేష్ నాయుడు, మున్సిపాలిటీ కమిషనర్ చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

మేల్బూరు చెరువుకు గండి



తెగిపోయిన పెద్దచెరువు కట్టను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల

బాలాయపల్లి, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి) అల్పపీడనం ప్రభావంతో కురిసిన వర్షాలతో వచ్చిన వరదలకు మండలంలోని పెరిమిడి పంచాయతీ పరిధిలో గల మేల్బూరు పెద్దచెరువు కట్టకు గురువారం తెల్లవారుజామున గండి పడింది. దీంతో చెరువు కింద నాటిన వరి పంట కొంతమేర దెబ్బతింది. కట్టకు గండి పడడంతో చెరువులో చుక్కనీరు లేకుండా వెళ్లిపోయింది. ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ శుక్రవారం చెరువు కట్టను పరిశీలించారు. మరమ్మతులు చేపట్టి రైతులకు సాగునీటికి ఇబ్బందిలేకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో వినీల్ కుమార్, ఈఈ బాబురెడ్డి, డీఈ సుధాకర్, నాయకులు నల్లబోతుల మురళి, దాసరి రాజగోపాల్ నాయుడు, దాసరి ప్రభాకర్ నాయుడు, కృష్ణమనాయుడు, రాపూరు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఉధృతంగా స్వర్ణముఖి

● స్తంభించిన రాకపోకలు



స్వర్ణముఖినది బ్రిడ్జిపైన వరదనీరు

నాయుడుపేట టౌన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు స్వర్ణముఖినదికి భారీగా వరదనీరు చేరింది. పట్టణంలో నుంచి మేనకూరుకు వెళ్లే మార్గంలో స్వర్ణముఖినది బ్రిడ్జిపైన శుక్రవారం తెల్లవారుజామున వరద నీరు పారడంతో మేనకూరు, వెంకటగిరికి వేళ్లే వాహనాలను పోలీసులు నిలిపివేశారు. సాయంత్రం 4 గంటలకు వరద ప్రభావం తగ్గడంతో వాహనాలను అనుమతించారు. దీంతో మేనకూరులో ఉన్న కర్మాగారాలకు వెళ్లే లారీలు రెండు వైపులా భారీగా నిలిచిపోయాయి.

స్వర్ణముఖి కాజ్‌వేపై చెత్తా చెదారాల తొలగింపు

నాయుడుపేట, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలతో ఎగువ ప్రాంతాల నుంచి వచ్చిన నీటిలో నాయుడుపేట స్వర్ణముఖినది కాజ్‌వే వద్ద చెత్తా చెదారాలు భారీగా పేరుకుపోయాయి. దీంతో కాజ్‌వే కింద నుంచి నీటి ప్రవాహానికి అడ్డంకి ఏర్పడింది. మున్సిపాలిటీ కమిషనర్ ఫజులుల్లా ఎక్స్‌కవేటర్‌ను పంపి కాజ్‌వేపై చెత్తా చెదారాలను శుక్రవారం తొలగించారు. దీంతో మేనకూరు సెజ్, వెంకటగిరి ప్రాంతాలకు రాకపోకలు సులభతరమయ్యాయి.

పీఆర్ క్లబ్ సేవలు స్ఫూర్తిదాయకం



పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

గూడూరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పేదలకు చేయూతనందించేలా పెల్లేటి రామిరెడ్డి క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నాయని ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ అన్నారు. శుక్రవారం క్లబ్ సభ్యుల దాతృత్వంతో పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పీఆర్ క్లబ్ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు నిర్వహించడం, పేద విద్యార్థులను విద్యలో ప్రోత్సహించేందుకు ఉపకార వేతనాలు అందజేయడం, ప్రతిభ చాటే క్రీడాకారులను నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేయడం వంటి ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ పీఆర్ క్లబ్ ఆదర్శంగా నిలుస్తోందన్నారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు కోడూరు మీరారెడ్డి, కార్యదర్శి శ్రీకి రెడ్డి, మధుసూదన్ రెడ్డి, ఎల్లసిరి గోపాల్ రెడ్డి, శ్రీకంటి రామమోహన్‌రావు, వేముల శ్రీధర్, ఆరికట్ల మస్తాన్ నాయుడు, వెంకటసుబ్బయ్య, పులిమి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పిచ్చి మొక్కలను తొలగించండి

వెంకటగిరి టౌన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డు బొగ్గులమిట్ట, ధర్మాపురం ప్రాంతాల్లో రోడ్డు వెంబడి పిచ్చి మొక్కలు విపరీతంగా పెరిగిపోయాయని, వాటిని వెంటనే తొలగించాలని కౌన్సిలర్ ఆరి శంకరయ్య అన్నారు. శుక్రవారం ఆయన బొగ్గులమిట్ట, ధర్మాపురం ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిచ్చి మొక్కల వల్ల దోమలు విపరీతంగా వృద్ధి చెందుతున్నాయన్నారు. ఈ విషయంపై పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని, ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎయిడెడ్ పాఠశాలలో ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(విద్య), డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): గూడూరులోని ఎస్పీఎస్ అప్పర్ ప్రైమరీ ఎయిడెడ్ స్కూల్లో ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి కేవీఎన్ కుమార్ తెలిపారు. సెకండరీ గ్రేడ్ టీచర్ పోస్టు-1, తెలుగు లాంగ్వేజ్ పండిట్-1, హిందీ లాంగ్వేజ్ పోస్టు-1 డైరెక్ట్ నియామకం ద్వారా భర్తీ చేసేందుకు పాఠశాల కరస్పాండెంట్ ఇప్పటికే నోటిఫికేషన్ జారీ చేశారని, అర్హత కలిగిన అభ్యర్థులు ఈ నెల 24వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. https://cse.ap.gov.in/AidedRecruitment లింక్ ద్వారా ఆన్‌లైన్‌లోగాని, పాఠశాల కరస్పాండెంట్ వద్దగాని దరఖాస్తులు సమర్పించాలని కోరారు.

20న చేపల చెరువుల వేలం

వెంకటగిరి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని 7 చెరువుల్లో చేపల పెంపకానికి ఈనెల 20వ తేదీన వేలం నిర్వహించనున్నట్లు ఇన్‌ఛార్జి కమిషనర్ శ్రీధర్ శుక్రవారం తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని అమ్మవారిపేట, కుమ్మరగుంట, చెవిరెడ్డిపల్లి, ధర్మాపురం, పెరియవరం, మారటపల్లి, పోలిశెట్టి గుంట, మనులాల పేట చెరువుల్లో చేపల పెంపకానికి వేలం నిర్వహిస్తామన్నారు.

షాపింగ్ కాంప్లెక్స్‌లో గదులకు...

వెంకటగిరి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బందిలదొడ్డి వీధిలో ఉన్న మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లో ఖాళీగా ఉన్న 1,2,4,6,8,9,10,11,12,13,14,15,16 గదులను నెలసరి అద్దెకు లీజుకు ఇచ్చేందుకు ఈనెల 20వ తేదీన 3గంటలకు వేలం నిర్వహించనున్నట్లు ఇన్‌ఛార్జి కమిషనర్ శ్రీధర్ తెలిపారు. పూర్తి వివరాలకు మున్సిపల్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

అన్నదాతలకు భారీ నష్టం

● నీట మునిగిన వందలాది ఎకరాలు
● పులికాట్ పోటుతో నీళ్లల్లోనే పొలాలు





ఉధృతంగా ప్రవహిస్తున్న పాములకాలువ - చేనిగుంటలో దెబ్బతిన్న వరిపైరును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ

తడ, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): అల్పపీడన ప్రభావంతో గురువారం కురిసిన భారీ వర్షం రైతులకు భారీ నష్టం చేకూర్చింది. కాదలూరు, వెండ్లూరుపాడు, కటవ, మాంబట్టు, గ్రద్దగుంట, చేనిగుంట, వాటంబేడు, కారిజాత గ్రామాల్లో పంటపొలాలను వరదనీరు ముంచెత్తగా వేనాడు, ఇరకందీవుల్లోని పంట పొలాలు ఉప్పునీటితో నిండిపోయాయి. వందల ఎకరాల్లో పొట్టదశలో ఉన్న వరిపంట పాచిపోయే పరిస్థితి నెలకొంది. సుమారు 2500 నుంచి 3వేల ఎకరాల వరకు వరి పంటకు నష్టం వాటిల్లిందని ప్రాథమిక అంచనా. మరో వైపు ఇరకం దీవిలో ఐదు పూరిగుడిసెలు ధ్వంసమయ్యాయి. పాములకాలువ ఉప్పొంగడంతో కాదలూరు, వెండ్లూరుపాడు, కట్టవగ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. సాధారణ రోజుల్లో వర్షం ఆగిపోయిన 3, 4 గంటల్లోనే వరద నీరంతా పులికాట్ సరస్సులోకి వెళ్లిపోయేది. అయితే పౌర్ణమి సమీపించడంతో సముద్రంలో ఆటుపోట్లు కారణంగా పులికాట్ సరస్సులో సముద్రపునీరు భారీగా చేరి పోటుమీద ఉంది. తద్వారా వరదనీరు పులికాట్‌లోకి వెళ్లేందుకు సమయం పట్టనుంది. దీంతో నీళ్లన్నీ పొలాల్లో నుంచి వెళ్లేందుకు మరో రెండు రోజులు పట్టే ట్టే అవకాశం ఉంది. కాగా, ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ ట్రాక్టర్‌లో వెళ్లి చేనిగుంటలో నీటమునిగిన పంట పొలాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. రైతులకు ధైర్యం చెప్పారు. వ్యవసాయశాఖ అధికారులు పంట నష్టాన్ని అంచనా వేస్తున్నారని, రైతులను ఆదుకుంటామని చెప్పారు. ఎమ్మెల్యే వెంట తహసీల్దారు శరత్‌బాబు, టీడీపీ నాయకులు పార్థసారధి, కామిరెడ్డి మురళీరెడ్డి, బొమ్మన పళణి తదితరులు ఉన్నారు.

గంగ కాలువను తడ వరకు పొడించండి

తడ, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఏటా కురిసే వర్షాలకు పంట పొలాలన్నీ మునిగిపోయి నష్టపోతున్నామని పలువురు రైతులు ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ దృష్టికి తీసుకువచ్చారు. శుక్రవారం తడకు వచ్చిన ఆమె గ్రద్దగుంట, చేనిగుంట, కాదలూరులోని పంట పొలాలను పరిశీలించారు. గ్రద్ద గుంటలో రైతులు మాట్లాడుతూ తాము వర్షాధారంతోనే పంటలను పండిస్తు న్నామని, ఆ వర్షమే తరచూ తమను నష్టాలపాలు చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. భారీ వర్షాలతో చేతికి వచ్చే పంట నీళ్లపాలవుతోందని చెప్పుకొచ్చారు. తెలుగుగంగ-8బి కాలువ తడ వరకు పొడిగిస్తే ఆ నీళ్లతో చెరువులన్నీ నిండి సాగుకు ఇబ్బందులు ఉండవని వివరించారు. తెలుగు గంగ-8బి కాలువ వరదయపాళెం మండలం కళత్తూరు వరకే ఉందని, అక్కడి నుంచి తడ వరకు తీసుకువచ్చేందుకు 2017లో అప్పటి ప్రభుత్వం ప్రయత్నించినా అటవీశాఖ అడ్డంకులతో పనులు ఆలస్యమయ్యాయన్నారు. తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. ఆ కాలువ నిర్మాణానికి కృషి చేయాలని ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి గంగ కాలువల నిర్మాణానికి కృషి చేస్తానని విజయశ్రీ తెలిపారు.

పరవళ్లు తొక్కుతున్న స్వర్ణముఖి, చల్లకాలువ

ప్రమాదపుటంచున ఐదు గ్రామాలు



కోట మండలం దైవాలదిబ్బ వద్ద ప్రమాదకరంగా ఉన్న స్వర్ణముఖి పొర్లుకట్టలను పరిశీలిస్తున్న తహసీల్దారు, ఇరిగేషన్ అధికారులు

కోట, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వల్ల వచ్చిన వర్షానికి పలు గ్రామాల్లో వరిపైర్లు నీటమునగగా, చెరువులు నిండుకుండల్లా మారాయి. తిరుపతిలోని కల్యాణిడ్యామ్ గేట్లు ఎత్తివేసి స్వర్ణముఖినదిలోకి వరదనీరు వదలడంతో శుక్రవారం కోట మండలం గూడలి, తిన్నెలపూడి గ్రామాల వద్ద స్వర్ణముఖి, మామిడికాలువ నదులు వరదనీటితో పరవళ్లు తొక్కాయి. గూడలి వద్ద స్వర్ణముఖినదిలో బ్రిడ్జి మీద ప్రయాణం చేయకుండా పోలీసులు వాహనాలను నిలిపివేయడంతో కోట, నాయుడుపేట మార్గాల్లో వాహనాలు రాకపోకలు పూర్తిగా ఆగిపోయాయి. స్వర్ణముఖినది పరవళ్లు తొక్కుతుండటంతో ప్రమాదపు అంచున ఉన్న పుచ్చలపల్లి, దైవాలదిబ్బ, దొరువుకట్ట గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈ గ్రామాల సమీపంలో ఉన్న వాకాడు మండలం గంగన్నపాళెం గ్రామానికి ప్రమాదం పొంచి ఉంది. తహసీల్దారు జయజయరావు, ఇరిగేషన్ ఈఈ శ్రీనివాసరావు, వీఆర్వో కృష్ణయ్య ఆధ్వర్యంలో స్వర్ణముఖి నది పొర్లుకట్టలకు తాత్కలిక మరమ్మతులు చేయడానికి రైతుల సాయంతో రింగ్‌బండ్‌లు వేస్తున్నారు. చల్లకాలువ, స్వర్ణముఖి పరవళ్లు తొక్కుతుండటంతో కర్లపూడి, చనుములుదిబ్బ గ్రామాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు రెవెన్యూ అధికారులు ఏర్పాట్లు చేశారు. బకింగ్‌హామ్ కెనాల్ పొంగడం వల్ల గోవిందపల్లిపాళెం మత్స్యకార గ్రామానికి దారి సౌకర్యం లేకపోవడంతో మత్స్యకారులు పడవల ద్వారా గోవిందపల్లికి వచ్చి నిత్యావసర సరుకులు తీసుకువెళ్తున్నారు.

పొంగిన వాగులు, వంకలు

నీట మునిగిన పంట పొలాలు



జాతీయ రహదారిని పరిశీలిస్తున్న ఆర్డీవో కిరణ్మయి

సూళ్లూరుపేట, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రెండు రోజుల నుంచి కురిసిన భారీ వర్షం, కాళంగి నది ఉగ్రరూపంతో సూళ్లూరుపేటలోని నెర్రికాలువ, పుచ్చాకాలువ, పాముల కాలువ పొంగి ప్రవహించాయి. పట్టణ నడిబొడ్డున ఉన్న నెర్రికాలువ ఉధృతంగా ప్రవహించడంతో పరమేశ్వరి నగర్ సమీపంలో శ్రీహరికోటకు వెళ్లే మార్గంలో రోడ్డుపై నీరుచేరి వాహన రాకపోకలకు ఇబ్బదులు తలెత్తాయి. అదేవిధంగా కోటపోలూరు రైల్వేగేటు అండర్ బ్రిడ్జి సమీపంలో ఉన్న పుచ్చాకాలువ ప్రవాహానికి కోటపోలూరుకు వెళ్లే రహదారిపై భారీగా నీరు చేరడంతో రాకపోకలు స్తంభించాయి. వాగులు, వంకలు పొంగి ప్రవహించడంతో దాదాపు 3500 ఎకరాలకు పైగా పంట పొలాలు నీటమునిగాయి. అదేవిధంగా మంగళంపాడు, ఇలుపూరు, ఉగ్గుముడి గ్రామాలతో పాటు పడమటి పల్లెల్లో మిరపపంట నీటిపాలయ్యాయి. ఆర్డీవో కిరణ్మయి అధికారులతో కలిసి ముంపు ప్రాంతాలతో పాటు నీట మునిగిన పొలాలను పరిశీలించారు.

బాలాంజనేయస్వామి ఆలయంలో సిందూర పూజలు

సూళ్లూరుపేట, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని బాలాంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం సామూహిక హనుమత్ వ్రత పూజల్లో భాగంగా సిందూర పూజలు వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని హనుమంతుడి ఉత్సవమూర్తిన్ని కొలువుదీర్చి పుష్పాలతో అలంకరించారు. యాగశాల మండపంలో హోమం నిర్వహించి సామూహిక సిందూర పూజలు చేశారు. ఉభయ కర్తలుగా మోదుకూరి ప్రియవర్ధన్, లావణ్య దంపతులు వ్యవహరించారు.

లైసెన్స్ లేని వాహనాల సీజ్

కోట, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్, గూడలి, చిట్టేడు, కోట ప్రాంతాల్లో ఉప రవాణాఅధికారి శాంతి శుక్రవారం వాహనాలను తనిఖీ చేశారు. లైసెన్స్, పర్మిట్ లేకుండా తిరుగుతున్న ఆటోలు, లారీలు, ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు.

కార్తీక దీపోత్సవం

కోట, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కోట సమీపంలో గల కొక్కుపాడు రోడ్డు వద్ద ఉన్న బాలసుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి కార్తీక దీపోత్సవం జరిగింది. మహాన్యాశ పూర్వక సంపూర్ణ ఏకాదశ రుద్రాభిషేకాన్ని పురస్కరించుకొని బాలసుబ్రహ్మణ్యేశ్వరుడికి విశేష పూజలు జరిగాయి. తమిళనాడుకు చెందిన పలువురు భక్తులు అరుణాచలంలో కార్తీకదీప మహోత్సవం జరుపుకునే సమయానికి ఇక్కడ కార్తీకదీపాన్ని వెలిగించారు.

15న సామూహిక సత్యనారాయణ వ్రతం

నాయుడుపేట, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట అగ్రహారపేటలోని సాయిబాబా మందిరంలో ఈనెల 15వ తేదీ ఆదివారం దత్తజయంతి సందర్భంగా సామూహిక సత్యనారాయణ వ్రతం నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు శుక్రవారం తెలిపారు.

16, 17 తేదీల్లో సర్పంచులకు శిక్షణ తరగతులు

ఓజిలి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలకు ఈనెల 16, 17 తేదీల్లో రెండు రోజులపాటు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో విజయలక్ష్మి తెలిపారు. మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు శిక్షణ తరగతులకు హాజరుకావాలని ఎంపీడీవో కోరారు.

రెండో రోజూ ఎల్ఎస్‌డీజీ శిక్షణ

సూళ్లూరుపేట, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం రెండోరోజు ఎల్ఎస్‌డీజీపై అధికారులు, ప్రజా ప్రతినిధులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో ప్రమీలారాణి ఆధ్వర్యంలో పంచాయతీల్లో ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణ, అభివృద్ధి పనుల గురించి పంచాయతీ కార్యదర్శులు, మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బందితో పాటు ప్రజాప్రతినిధులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ భవాని, ఎంఈవో శ్రీనివాసులు, ఈవోపీఆర్‌డీ శ్రీనివాసులు, ఏపీవో నాగరాజు సర్పంచ్, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులు

గూడూరు, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో భూ సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు రెవెన్యూ సదస్సులను నిర్వహించడం జరుగుతోందని తిరుపతి పార్లమెంటు తెలుగు మహిళ ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణి అన్నారు. శుక్రవారం మండలంలోని చెన్నూరు గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ చంద్రశేఖర్, ఎల్లసిరి శ్రీనివాసులు రెడ్డి, అల్లూరు కరుణాకర్‌రెడ్డి, హేమకుమార్‌రెడ్డి, శివకుమార్, సర్వేయర్ విశ్వనాథం, వీఆర్‌వో పాల్గొన్నారు.

పెళ్లకూరు(ఆంధ్రజ్యోతి): మండలంలోని పునబాక గ్రామంలో తహసీల్దార్ ద్వారకానాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహిం చారు. ఆర్‌ఐ సంతోషిబాయి, వీఆర్వో సుధాకర్, సర్వేయర్ పూజిత, టీడీపీ సీనియర్ నాయకులు వేలూరు హరినాయుడు, మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, దామెర ప్రసాద్‌నాయుడు, మురళీ నాయుడు, రవినాయుడు, తాళ్ల యుగంధర్‌గౌడ్, పునబాక పోలయ్య, యాగాన్ని జెన్నీ, తాళ్ల రెడ్డిశ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

కోట(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చెందోడులో డిప్యూటీ తహసీల్దారు అజమతుల్లాఖాన్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మధులత ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు జరిగింది. టీడీపీ జిల్లా కార్యదర్శి వాకా విజయ భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో పలువురు రైతులు భూ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో సర్వేయర్ గోపీరెడ్డి, పంచాయతీ కార్యదర్శి కిరణ్‌కుమార్, వీఆర్వో సాయిశరణ్య పాల్గొన్నారు.

వెంకటగిరి టౌన్(ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మాశాస్త్రివారి కండ్రిగ, సుంకరవారిపల్లెలో తహసీల్దార్ రాంబాబు ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు జరిగింది. రెవెన్యూ సదస్సులో వచ్చే అర్జీలకు శాశ్వత పరిష్కారం చూపుతామని తహసీల్దార్ చెప్పారు.

డక్కిలి(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలుగోడు సచివాలయంలో తహసీల్దార్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యలు పరిష్కరించాలంటూ ఎక్కువగా అర్జీలు వస్తున్నాయని చెప్పారు. ప్రతి అర్జీని ఆన్‌లైన్ చేసి సమస్య పరిష్కరించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ రాజగోపాల్, రెవెన్యూ సిబ్బంది పావని తదితరులు పాల్గొన్నారు.

బాలాయపల్లి(ఆంధ్రజ్యోతి) మండలంలోని వెంగమాంబపురం, అక్కముద్రం గ్రామాల్లో తహసీల్దార్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. పాసు పుస్తకాలు, 1బీ నమోదు కోసం 21, పక్కాగృహాల కోసం 5, సాగుభూమికి హక్కులు కల్పించాలని ఒకటి, సర్వే కోసం మూడు అర్జీలు అందాయని తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకటసుబ్బయ్య, ఆర్‌ఐ శ్రీకాంత్, సర్వేయర్ తారకరామారావు తదితరులు పాల్గొన్నారు.

ఓజిలి (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలం భట్లకనుపూరులో శుక్రవారం తహసీల్దారు పద్మావతి ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. పలువురు రైతులు తమ భూ సమస్యలపై అర్జీలు అందజేశారు.

పంబలేరుకు పోటెత్తిన వరద


చప్టాపై నిలిచిన రాకపోకలు



పంబలేరు చప్టాపై ఉధృతంగా ప్రవహిస్తున్న వరదనీరు

గూడూరు అర్బన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి కారణంగా గూడూరు మండలంలోని గురువారం భారీ వర్షం కురిసింది. పైప్రాంతాల్లో నుంచి వరద నీరు రావడంతో పంబలేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. చప్టాపై మూడు అడుగుల లోతు వరకు వరద నీరు ప్రవహిస్తుండడంతో రూరల్ ఎస్‌ఐ. మనోజ్ కుమార్ రాకపోకలను నిలిపివేశారు. అదే విధంగా మండల పరిధిలోని విందూరులో పైప్రాంతం నుంచి వరద నీరు ప్రవహించడంతో గ్రామ సమీపంలో లోతట్టు ప్రాంతాల మార్గం, వేమలపాళెం సమీపంలోని చప్టాపై వరద నీరు ప్రవహిస్తుండడంతో వాహనదారులు ఇబ్బందులు పడాల్సి వచ్చింది.

నీట మునిగిన వరి



భీమవరంలో నీటమునిగిన వరి పొలాల వద్ద రైతులు

పెళ్లకూరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలో బుధవారం రాత్రి నుంచి శుక్రవారం రాత్రి వరకు కురిసిన భారీ వర్షాలకు స్వర్ణముఖినదితో పాటు వాగులు, కాలువల్లో నీటి ప్రవాహం ఉధృతంగా ఉంది. గత నెలలో కురిసిన వర్షాలకు భీమవరం, టెంకాయతోపు, చిల్లకూరు, పెళకూరు, చావాలి గ్రామాల్లో వరినాట్లు నీటమునిగాయి. ప్రస్తుత వర్షాలతో మళ్లీ పంటలు నీటమునగడంతో తీవ్రంగా నష్టపోతామని రైతులు డీలాపడుతున్నారు. ఇక మండలంలోని అన్ని చెరువులు నిండుకుండల్లా మారాయి.

స్వర్ణముఖినది చప్టాపై ఆగిన రాకపోకలు

పెళ్లకూరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కలవకూరు - పుల్లూరు గ్రామాలకు వెళ్లే రహదారిలో ఉన్న స్వర్ణముఖినది రిజర్వాయర్ చప్టాపై వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో ఐదు మండలాల ప్రజల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వరద పూర్తిగా తగ్గే వరకు చెక్‌డ్యామ్, లోలెవల్ కాజ్‌వేలు, వాగుల మీదుగా రాకపోకలు సాగించవద్దని ఎస్‌ఐ నాగరాజు సూచించారు.